జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 18, అక్టోబర్ 2024 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం






## పెట్టుబడిదారులకు ఆంధ్రప్రదేశ్ స్వర్గధామం

- సీఎం చంద్రబాబు

**చండీగఢ్,మహానాడు:** పెట్టుబడిదారులకు ఆంధ్రప్రదేశ్ స్వర్గధామం అని సీఎం చంద్రబాబు తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు రెడ్ కార్పెట్ ఆహ్వానమంటూ స్వాగతించారు. ఏపీ ఇప్పుడు కొత్త అత్యుత్తమ విధానాలతో ఆహ్వానం పలుకుతోందని బాబు అన్నారు. ప్రధాని మోదీ అధ్యక్షతన చండీగఢ్‌లో ఎన్డీయే సీఎంల కౌన్సిల్ సమావేశం గురువారం జరిగింది. ఏపీ నుంచి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు ఆ సమావేశంలో ఏమన్నారంటే... ఆంధ్రప్రదేశ్ పూర్తిగా వ్యాపార అనుకూల

మిగతా.. 2లో



# వద్దన్న విజయసాయి.. మళ్లీ ముద్దయ్యారా?



- ఉత్తరాంధ్ర పార్టీ పగ్గాలు మళ్లీ విజయసాయిరెడ్డికే
- గతంలో ఆయనను అక్కడి నుంచి అర్ధంతరంగా తప్పించిన జగన్
- సజ్జల సలహా, సుబ్బారెడ్డి కోరిక మేరకు విజయసాయి ఔట్
- అప్పట్లో ఆయనపై వేగుల నిఘా
- ఎన్నికల ముందు వైవి సుబ్బారెడ్డికి పట్టం కట్టినా ఫలించని వ్యూహం
- ఉత్తరాంధ్రలో పార్టీ కోసం కష్టపడ్డ విజయసాయిరెడ్డి
- అయినా జగన్‌కు ఆయనపై కోటరీ చాడీలు
- ఎన్నికల తర్వాత పార్లమెంట్ నాయకుడి బాధ్యతల నుంచి తొలగింపు
- ఆయన స్థానంలో మిథున్, సుబ్బారెడ్డిని నియమించిన జగన్
- కనీసం రాజ్యసభ నేత హూదా కూడా దక్కని అవమానం
- ఇప్పుడు మళ్లీ విజయసాయికి ఉత్తరాంధ్ర బాధ్యతలపై పార్టీలో చర్చ
- ప్రస్తుతం పార్టీలో అంటీముట్టనట్లు ఉన్న విజయసాయిరె డ్డి
- పార్టీలో సజ్జల, అప్పిరెడ్డి, తలశిలదే హవా

(మార్తి సుబ్రమణ్యం)

వాడుకో.. వదిలెయ్. అవసరం వచ్చినప్పుడు మళ్లీ పిలువ్. ఇది ఇప్పుడు వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ పాటిస్తున్న నయా రాజకీయ సూత్రం. అధికారంలో ఉన్నప్పుడు ఎంపి విజయసాయిరెడ్డిని అడ్డగోలుగా వాడుకుని.. సజ్జల, సుబ్బారెడ్డి మాట విని ఆయనను పక్కనపెట్టిన జగన్‌కు, ఇప్పుడు మళ్లీ ఉత్తరాంధ్రలో అదే విజయసాయిరెడ్డి దిక్కవడం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఐదేళ్ల వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు నాడు నెంబర్‌టూగా ప్రచారంలో ఉన్న ఎంపి, పార్లమెంటరీపార్టీ నేత విజయసాయిరెడ్డి.. ఉత్తరాంధ్ర సమన్వయకర్తగా అవిశ్రాంతంగా కష్టపడిన వైనాన్ని, విశాఖ వైసీపీ నేతలు గుర్తు చేస్తున్నారు. విశాఖలో అయితే ఒక డివిజన్ స్థాయి నాయకుడిని సైతం పేరు పెట్టి పిలిచి, ప్రోత్సహించిన విజయసాయి.. పార్టీ క్యాడర్‌లో ఉత్సాహం నింపార ని చెబుతున్నారు. విజయసాయి ప్రోత్సాహంతోనే చాలా మంది కార్పోరేటర్లు, ఎమ్మెల్యే సీట్లకు పోటీ చేసే స్థాయికి ఎదిగారంటున్నారు.

ఇక ఉత్తరాంధ్రలో కూడా పార్టీ అంతర్గత సమస్యలతో పాటు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల సమస్యలను పరిష్కరించే క్రమంలో, సంబంధిత అధికారులతో మాట్లాడిన వైనాన్ని వైసీపీ వర్గాలు గుర్తు చేస్తున్నాయి. సీఎంగా జగన్ ఎవరికీ అందుబాటులో ఉండని నేపథ్యంలో, విజయసాయి అంతా తానై పార్టీ నేతల సమస్యలను పరిష్కరిస్తే.. చివరకు ఆయనను ఎన్నికల ముందు పార్టీ బాధ్యతల నుంచి తప్పించిన జగన్.. మళ్లీ అదే విజయసాయిరెడ్డికి ఉత్తరాంధ్ర బాధ్యతలు అప్పగించడంపై పార్టీ వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి.

నాటి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, జగన్ చిన్నాయన వైవి సుబ్బారెడ్డి కలసి.. విజయసాయిరెడ్డిని ఉత్తరాంధ్ర బాధ్యతల నుంచి విజయవంతంగా తప్పించారన్న ప్రచారం అప్పట్లో జరిగింది. ప్రధానంగా విజయసాయిపై అనైతిక వ్యవహారాలకు సంబంధించిన ఫిర్యాదులు కూడా, జగన్‌కు ఇప్పించారన్న ప్రచారం పార్టీ వర్గాల్లో జరగకపోలేదు. ఆయన కార్యకలాపాలు–కదలికలపై చివరకు వేగులతో నిఘా వేయించారని గుర్తు చేస్తున్నారు. ఉత్తరాంధ్రపై ఏమాత్రం అవగాహన లేని వైవి సుబ్బారెడ్డికి.. ఎన్నికల ముందు ఆ ప్రాంత బాధ్యతలు అప్ప గించినా, ఫలితం శూన్యమని వైసీపీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

ఎన్నికల ఫలితాల తర్వాత కూడా విజయసాయిని అవమానించిన వైనాన్ని పార్టీ వర్గాలు గుర్తు చేస్తున్నాయి. దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి భర్త మీడియా ముందుకొచ్చి, తన భార్య బిడ్డకు విజయసాయిరెడ్డే తండ్రి అని, ఆయనకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహించాలంటూ నానా రచ్చ చేసిన ఎపిసోడ్‌లో.. విజయసాయిరెడ్డి పార్టీలో దాదాపు ఒంటరివారయ్యారు.

ఆయనకు మద్దతుగా ఏ ఒక్క స్థాయి నాయకుడు కూడా, మీడియాముందుకు రాని వైనాన్ని పార్టీ నేతలు గుర్తు చేస్తున్నారు. ఆ ఎపిసోడ్‌లో విజయసాయిరెడ్డి ఒంటరిపోరాటం చేశారే తప్ప, జగన్ సహా ఏ ఒక్క అగ్రనాయకుడూ విజయసాయికి దన్నుగా రాలేదంటున్నారు. తనపై దుష్ప్రచారం చేసిన ఒ చానెల్ సీఈఓకు లీగల్ నోటీసు పంపించటమే కాకుండా, టాల్కమ్ పౌడర్ అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించిన విషయం తెలిసిందే.

అప్పటికి వైసీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా కొనసాగుతున్న విజయసాయిరెడ్డిని.. తొలగించి ఆయన స్థానంలో మిథున్‌రెడ్డిని నియమించిన జగన్.. రాజ్యసభ నాయకుడిగా కూడా కొనసాగుతున్న విజయసాయిని తప్పించి, తన బాబాయ్ సుబ్బారెడ్డిని రాజ్యసభలో పార్టీ నేతగా నియమించి, అవమానించారని సీనియర్లు గుర్తు చేస్తున్నారు. అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో విజయసాయిరెడ్డి, జగన్ కోసం ఢిల్లీలో బీజేపీ నేతల చుట్టూ కాళ్లరిగేలా తిరిగారు. ప్రధాని మోదీ–హోంమంత్రి అమిత్‌షా చాంబర్ల వద్దనే ఆయన ఎక్కువగా దర్శనమిచ్చేవారు.

కేవలం విజయసాయి లాబీయింగ్ వల్లే..అన్ని అంశాల్లో జగన్‌కు ఊరట వచ్చిందన్న విషయం, బహిరంగ రహస్యమేనంటున్నారు. అన్ని వ్యవస్థలనూ జగన్‌కు అనుకూలంగా మలచడంలో విజయసాయిదే కీలకపాత్ర అన్నది బహిరంగ రహస్యమేనంటున్నారు. ఐదేళ్ల కాలంలో ఒక్కరోజు కూడా జగన్.. ఏ ఒక్క కేసులోనూ కోర్టుకు హాజరుకాని విషయం తెలిసిందే. టీడీపీ ఎన్డీఏలో చేరకుండా చివరివరకూ శతవిధాలా ప్రయత్నించిన విజయసాయిరెడ్డి, ఆ అంశంలో మాత్రం విజయవంతం కాలేకపోయారు. అయితే ఎన్నికల సమయంలో ఈసీతో చర్చలు, ఫిర్యాదులు, ఉత్తర ప్రత్యుత్తరాల కోసం ఆయన ఎక్కువగా ఢిల్లీలోనే గడిపారు. పార్టీ కోసం అంత చిత్తశుద్ధితో పనిచేసిన విజయసాయికి, పార్టీలో ప్రాధాన్యం లేకుండా చేయడంలో సజ్జల విజయం సాధించారని పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

తారకరత్న మృతి తర్వాత విజయసాయి, టీడీపీ అధినేత చంద్రబాబుతో సన్నిహితంగా వ్యవహరిస్తున్నారన్న అనుమానం, జగన్ మనసులో నాటడంలో కోటరీ సక్సెస్ అయిందంటున్నారు. తారకరత్న మృతికి ముందు విజయసాయి తన ట్వీట్లలో బాబు–లోకేష్‌ను దుర్భాషలాడేవారు. ఒకదశలో బాబును ముసలోడు కూడా కూడా సంబోధించారు. అయితే తారకరత్న మృతి తర్వాత.. విజయసాయిరెడ్డి తన ట్వీట్లలో అంతకుముందుకు భిన్నంగా, చంద్రబాబుగారు అని ట్వీట్ చేయడాన్ని కూడా జగన్ వద్ద తమ వాదనకు మద్దతుగా చూపించారంటున్నారు. చివరకు విజయసాయిరెడ్డి మద్దతుదారన్న అనుమానంతో, జగన్‌కు బంధువైన బాలినేని శ్రీనివాసరెడ్డిని సైతం పార్టీలో తనంతట తాను నిష్క్రమించేలా చేశారంటున్నారు. కేవలం విజయసాయిరెడ్డి సన్నిహితుడన్న కారణంగానే, ప్రకాశం జిల్లాలో

మిగతా.. 2లో

## ఈ సన్నాసి సీఎం ఏం చేస్తున్నాడు?

- పైన జుమ్లా పీఎం ఉంటే ఇక్కడేమో హౌలా సీఎం
- స్కూళ్లలో చాక్ పీస్‌లకు కూడా పైసలు లేవు
- మూసీలో పారబోసేందుకు లక్షా 50 వేల కోట్లు ఉన్నాయంట
- బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అమలు చేసేందుకు ఏం రోగం?
- 25 సార్లు ఢిల్లీకి పోయి రూ.25 పైసలు తేలేదు
- చిట్టినాయుడు పాలనలో బాధపడని వాళ్లు లేరు
- ఊళ్లలో రైతులు పొట్టు పొట్టు తిడుతున్నారు
- కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలంటే తెలంగాణను తీసుకపోయి ఆంధ్రాలో కలపాలి
- తెలంగాణకు అతి ప్రమాదకరమైన పార్టీ బీజేపీ
- తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్వీ ప్రతినిధుల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**హైదరాబాద్,మహానాడు:** తెలంగాణ ఉద్యమంలో మహా ఉద్దండ పిండాలతో కొట్లాడినం. చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి లాంటి వాళ్లతో కొట్లాడి తెలంగాణ తెచ్చుకున్నాం. అంతటి ఉద్దండుల ముందు ఈ చిట్టి నాయుడు ఎంత? ఈ చిట్టి నాయుడిని తిట్టాలన్న, ఏదైనా చెప్పాలన్న మనసు రావటం లేదు. ఎందుకంటే ఆయనకు ఏమీ తెల్వదు. ఏమీ తెల్వదన్న విషయం కూడా ఆయనకు తెల్వదు.

మొన్న వికారాబాద్ వెళ్లి హైదరాబాద్ చుట్టు మూడు దిక్కులు సముద్రం ఉందంటాడు. ఆగస్టు 15 రోజు స్పీచ్‌లో భాక్రానంగల్ తెలంగాణలో ఉందంటాడు. రాసిచ్చినది కూడా చూసుకోకుండా చదువుతాడు. విప్రో సీఈఓ సత్య నాదెళ్ల అంటాడు. అలాంటి ముఖ్యమంత్రి ఉండటం మన ఖర్మ.

గుంపు మేస్త్రీ అంటే ఇళ్లు కట్టేటోళ్లు. కానీ ఈ ముఖ్యమంత్రి మాత్రం ఇళ్లను కూలగొట్టేటోడు. పరిపాలన పిచ్చోడి చేతిలో రాయి లా మారింది. రేవంత్ రెడ్డి బాధపెట్టినా సరే, ప్రజలను చైతన్య పరచాల్సిన బాధ్యత మన మీద ఉంది. ఇక్కడి యువతకు ఉద్యోగాలు రావాలని 95 శాతం కొలువులు మన బిడ్డలకే దక్కేట్టు పోరాటం చేసి రాష్ట్రపతి ఉత్తర్వులు తెచ్చింది కేసీఆర్ . జిల్లాకు ఓ మెడికల్ కాలేజ్, నర్సింగ్ కళాశాల, గురుకులాలు.

మిగతా.. 2లో



## కేసీఆర్..రచ్చబండకు రెడీనా?

- నేను సెక్యూరిటీ లేకుండానే వస్తా
- కేసీఆర్, కేటీఆర్, హరీష్‌కు మూసీ ఒడ్డున ఇళ్లు ఇవ్వండి
- ముగ్గురికీ భోజన సదుపాయాలు ఏర్పాటుచేయండని ఆదేశం
- మీరు మూడు నెలలు అక్కడ ఉంటే నేను ప్రాజెక్టు విరమించుకుంటా
- బీఆర్ఎస్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సంచలన సవాల్
- మూసీ నదికి సంబంధించి జరిగిన ఒప్పందం రూ.141 కోట్లు మాత్రమే
- మరి లక్షా 50 వేల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి?
- ఇది మూసీ సుందరీకరణ కాదు.ఇది మూసీ పునరుజ్జీవనం
- సచివాలయంలో మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,మహానాడు:** తెలంగాణ ప్రజల భవిష్యత్‌ను, రాష్ట్ర, దేశ ఆర్థిక వ్యవస్థను నిర్దేశించే కార్యాచరణ ప్రభుత్వం తీసుకుంది. 33 బృందాలు మూసీ పరివాహక ప్రాంతంలో పేదల సమస్యలను తెలుసుకున్నాయి. దుర్గంధంలో దుర్భర జీవితాలను గడుపుతున్న పేదల కష్టాలను తెలుసుకున్నాం. ప్రపంచంతో పోటీ పడే నగరంగా హైదరాబాద్ ను తీర్చిదిద్దుతాం.

ఉపాధి కల్పనతో అక్కడి పేదలను ఆదుకోవాలనే ఆలోచన మా ప్రభుత్వానికి ఉంది. నెహ్రూ ఎడ్యుకేషన్, ఇరిగేషన్ రెవల్యూషన్ తీసుకొచ్చారు. కాంగ్రెస్ విజన్ వల్లే దేశానికి ప్రపంచంతో పోటీ పడే శక్తి లభించింది. దేశంలో సాంకేతిక విప్లవం తీసుకొచ్చిన ఘనత రాజీవ్ గాంధీది. పెట్టుబడుల సరళీకరణ విధానం తీసుకొచ్చింది పీవీ నరసింహారావు. ఆనాడు నెహ్రూ, రాజీవ్, పీవీ ప్రవేశపెట్టిన పాలసీలను కొందరు వ్యతిరేకించారు.

కానీ ఆ పాలసీలే దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాయి. అధికారం కోల్పోయిన నిస్పృహతో కొందరు ఏదేదో మాట్లాడుతున్నారు. బందిపోటు దొంగల్లా పదేళ్లు తెలంగాణను దోచుకున్నవారు మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నారు. సుందరీకరణ అంటూ కాస్మటిక్ కలర్ అద్దాలని చూస్తున్నారు. వాళ్ల మెదడులో మూసీ మురికి కంటే ఎక్కువ విషం నింపుకున్నారు.

ఇది సుందరీకరణ కోసం

మిగతా.. 2లో

## ఖజానాకు లిక్కర్ కిక్కు

- మళ్లీ మద్యం ధరలకు రెక్కలు?
- మందు బాదుడుకు సర్కారు సిద్ధం
- బ్రూవరీల కోరిక మన్నించనున్న రేవంత్ సర్కారు
- దసరా అమ్మకాలతో ఖజానాకు కిక్కే కిక్కు




**హైదరాబాద్,మహానాడు:** తెలంగాణ సర్కారు మందుబాదుడుకు సిద్ధమవుతోంది. ఖజానా కిక్కు కోసం మందుబాబులపై భారం వేసేందుకు రెడీ అవుతోంది. బ్రూవరీల కోరికను మన్నించడం ద్వారా, మందుధరలు పెంచి ఖజానాను పరిపుష్ఠం చేసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు

మిగతా.. 2లో



06

కొడాలి అండతో కులాన్ని మార్చేసి పదవి పొందిన సర్పంచ్



03

మార్పును ప్రజలు గమనించారా? మీడియా గుర్తించిందా?



09

అక్రమ కేసులకు భయపడబోము



## సాక్షి పత్రిక ఎడిటర్‌పై కేసు నమోదు

**విజయవాడ,మహానాడు:** "అవినీతి ఖజానా - ముంపులోనూ మేసేశారు" అంటూ ప్రభుత్వంపై బురద జల్లుతూ ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ఆర్టికల్‌ను ప్రచురించారని... హైకోర్టు న్యాయవాది జి. లక్ష్మీనారాయణ చేసిన ఫిర్యాదు ఆధారంగా, సాక్షి ఎడిటర్ వి. మురళి & అదర్స్‌పై ఈరోజు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

## యాంటీగా పోస్టు పెట్టు.. మంత్రితో అవార్డు కొట్టు!


- సర్కారుకు వ్యతిరేకంగా పోస్టు పెట్టిన జర్నలిస్టుకు మంత్రి దుర్గేష్ అవార్డు
- లిక్కర్‌పై వ్యంగ్యంగా పోస్టు పెట్టిన దూరదర్శన్ జర్నలిస్టు శివన్నారాయణరెడ్డి
- ఆయన గోదావరి పుస్తకానికి ఉత్తమ అవార్డు

(మార్తి సుబ్రహ్మణ్యం)

అసలు కూటమి ప్రభుత్వంలో ఏం జరుగుతోంది? ఎవరు ఏం చేస్తున్నారు? ఎవరు అజమాయిషీ చేస్తు న్నారు? అసలు సమన్వయం ఉందా? ఎవరు నిర్ణయాలు తీసుకుంటున్నారు? వాటికి ప్రాతిపదిక ఏమిటి? గతంలో టీడీపీకి వ్యతిరేకంగా పనిచేసిన అధికారులను మళ్లీ అందలం ఎక్కిస్తున్నారు. వైన్‌షాపులు కూడా ట్కవె సీపీ వారికే ఎక్కువ ఎలా వచ్చాయి? ఇలాంటి ప్రశ్నాస్త్రాలతో తమ్ముళ్లు విరుచుకుపడుతున్న నేపథ్యంలో.. దానికి అదనంగా కాకినాడ కథ ఒకటి తాజాగా తోడయింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టేవారికి మంత్రిగారే ఎలా అవార్డు ఇస్తారు? ఇలా చేస్తే మనది గుడ్డి ప్రభుత్వం అని నవ్విపోరా?.. అంటూ తూర్పుగోదావరి తమ్ముళ్లు సోషల్‌మీడియాలో శివాలెత్తుతున్నారు. ఇక వివరాల్లోకి వెళితే..



ఆయనో జర్నలిస్టు. వివిధ సామాజిక అంశాలు, ఇతర రంగాలపై పుస్తకాలు రాస్తుంటారు. అందుకు ఆయనకు ప్రభుత్వం– ప్రభుత్వేతర సంస్థల నుంచి అవార్డులు లభించాయి. మంచిదే. కానీ సదరు జర్నలిస్టు తన ఫేస్‌బుక్‌లో, సర్కారుకు వ్యతిరేకంగా మద్యంపై పెట్టిన వ్యంగ్య పోస్టు ఇప్పుడు చర్చనీయాంశమయింది. అంటే కూటమి ప్రభుత్వం







ముందు హామీ ఇచ్చినట్లు.. 'అమ్మకు వందనం' పథకం కాకుండా.. మద్యం పాలిసీని అమలుచేయడాన్ని ఆక్షేపిస్తూ పెట్టిన పోస్టు అది. ఇంతకూ సదరు జర్నలిస్టు పెట్టిన పోస్టు ఏమిటంటే.. 'అమ్మకం వందనం' కంటే "నాన్నకు ఇంధనం" వచ్చేసింది. అమ్మ ఎందుకో వెనకబడింది! ఇదీ కాకినాడకు చెందిన దూరదర్శన్ రిపోర్టర్ డాక్టర్ సబ్బెళ్ల శివన్నారాయణరెడ్డి తన ఫేస్‌బుక్‌లో పెట్టిన పోస్టు!!

అయితే రాష్ట్ర పర్యాటక అవార్డు గ్రహీత, జర్నలిస్టు డాక్టర్ శివన్నారాయణ రెడ్డిని అభినందించిన కలెక్టర్ షణ్మోహన్ అంటూ.. కాకినాడ జిల్లా డీపీఆర్‌ఓ


మిగతా.. 2లో

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 18, అక్టోబర్ 2024 ||



# రోడ్లలో గుంతలు పూడ్చడానికి రూ.600 కోట్లు మంజూరు

**- సీఎం చంద్రబాబు వెల్లడి**



**అమరావతి, మహానాడు:** ఏపీలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. వైసీపీ హయాంలో రాష్ట్రం భారీగా నష్టపోయిందని సీఎం చంద్రబాబు అన్నారు. గత ప్రభుత్వంలో గ్రామీణ రహదారులు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఇదిలా ఉంటే.. తాజాగా ఏపీ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీ సచివాలయంలో నిర్వహించిన కేబినెట్ సమావేశంలో రాష్ట్రంలో రోడ్ల పరిస్థితి, మరమ్మతులపై చర్చించిన విషయం తెలిసిందే.

ఈ క్రమంలో రాష్ట్రంలోని రోడ్లపై గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని నవంబర్ 1వ తేదీ నుంచి యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సంక్రాంతి నాటికి రాష్ట్రంలో ఏ రోడ్డుపైనా గుంతలు ఉండకూడదన్నారు. ఆర్ అండ్ బీ పరిధిలోని రోడ్లలో గుంతలు పూడ్చడానికి 600 కోట్ల రూపాయలు మంజూరు చేశామని సీఎం చంద్రబాబు తెలిపారు. రోడ్ల పరిస్థితిపై డ్రోన్లతో సర్వే చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.55 వేల కోట్లతో రోడ్లు నిర్మిస్తున్నామని, మరో రూ.30 వేల కోట్లతోనూ రోడ్ల నిర్మాణానికి పర్మిషన్ వస్తుందని సీఎం చంద్రబాబు తెలిపారు.





## మహర్షి వాల్మీకి జయంతి శుభాకాంక్షలు

**- సీఎం చంద్రబాబు**

**అమరావతి, మహానాడు:** మూల రామాయణ రచయిత, సర్వ ప్రజానీకానికి మార్గదర్శకుడు మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు. కృషి ఉంటే మనుషులు ఋషులవుతారని లోకానికి చాటిన ఆ మహాపురుషుని జయంతిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా జరుపుతున్నందుకు సంతోషంగా ఉంది. ఆదర్శ జీవితాన్ని గడపడానికి మానవులు ఆచరించాల్సిన ధర్మాలు అన్నింటినీ శ్రీ రామాయణ మహా కావ్యంలో పొందుపరచిన ఆదికవి వాల్మీకి జయంతిని సాంస్కృతిక ఉత్సవంగా నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు గురువారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.





హర్యానా సీఎం నయాబ్ సింగ్ సైనీ ప్రమాణ స్వీకారానికి హాజరైన ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఘన స్వాగతం పలుకుతున్న దృశ్యాలు. వేదికపై హోం మంత్రి అమిత్ షా, తదితరులతో సీఎం మాటామంతీ...

## యాంటీగా పోస్టు పెట్టు.. మంత్రితో అవార్డు కొట్టు!

మొదటి పేజీ తరువాయి..

ఒక ప్రకటన విడుదల చేశారు. అందులో ఆ జర్నలిస్టు రాసిన పుస్తకాలు, వాటికి వచ్చిన అవార్డులు చూసిన కలెక్టర్ ఆయనను అభినందించారన్నది దాని వార్త సారాంశం.

ఉమ్మడి గోదావరి జిల్లాకు చెందిన పర్యాటక వివరా లకు సంబంధించి రాసిన ఐదు పుస్తకాలకు, ఐదు అవార్డులు రావటం జిల్లాకే గర్వకారణమని కలెక్టర్ అభినందించినట్లు ఆ ప్రకటనలో వెల్లడించారు. 2012లో యాత్ర, 2014లో తూర్పుగోదావరి యాత్ర, 2016లో అమరావతి, 2024లో గోదావరి పుస్తకాలు రాసినట్లు డీపీఆర్ఓ ప్రకటలో వెల్లడించారు.

ఇంతవరకూ బాగానే ఉంది. అయితే తాజాగా సర్కారుపై వ్యంగ్యాస్త్రాలు సంధించిన సదరు జర్నలిస్టు రెడ్డిగారిని, కలెక్టర్ అభినందించడం ఏమిటి? ఇప్పటికే జిల్లాలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భక్త అధికారులు ఎక్కువయ్యారు. ఎవరు ఏమిటో చూసుకునే పనిలేదా? ఇదేం గుడ్డి ప్రభుత్వం" అంటూ తూర్పు గోదావరి తమ్ముళ్లు, తమ పార్టీ-ప్రభుత్వంపై అగ్గిరాముళ్లలవుతున్నారు.

వారం క్రితం జర్నలిస్టు రెడ్డిగారికి ప్రపంచ






పర్యాటక దినోత్సవం సందర్భంగా, విజయవాడలో నిర్వహించిన సభలో మంత్రి కందుల దుర్గేష్ అవార్డు ఇచ్చారు.

దానిపై టీడీపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారట. మంత్రి దుర్గేష్ అసలు టీడీపీ కార్యకర్తలను లెక్క చేయడం లేదంటూ ఇప్పటికే తమ్ముళ్లు రుసరసలాడుతున్నారు. తాజాగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టేవారికి, మంత్రిగారే ఎంపిక చేసి మరీ అవార్డు ఎలా ఇస్తారని తమ్ముళ్లు శివాలెత్తు తున్నారు.

## పెట్టుబడిదారులకు ఆంధ్రప్రదేశ్ స్వర్గధామం

మొదటి పేజీ తరువాయి..

రాష్ట్రం. కొత్త పాలసీ ఫ్రేమ్ వర్క్ పరిశ్రమ అనుభవజ్ఞులతో రూపొందించాం. వ్యవస్థాపక స్ఫూర్తి, వ్యాపారాలను పెంపొందించడమే లక్ష్యం. దేశంలోనే అత్యుత్తమ వ్యాపార అనుకూల వ్యవస్థను నిర్మిస్తున్నాం.

అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుందని హామీ ఇస్తున్నా. దేశంలో, ఏపీలో పెట్టుబడులకు ఇంతకంటే మంచి సమయం లేదు. ఈ ఉత్తేజకరమైన వృద్ధి ప్రయా ణంలో మాతో సహకరించండి. వ్యాపార పరిధిలు, రాష్ట్ర సామర్థ్యం పరస్పరం విస్తరించుకునే అవకాశమిది. ఏపీలో నూతన పెట్టుబడుల కోసం ఎదురు చూస్తున్నాం.

## ఖజానాకు లిక్కర్ కిక్కు

మొదటి పేజీ తరువాయి..

సమాచారం. ప్రభుత్వం కూడా అందుకు సిద్ధంగా ఉందని తెలుస్తోంది. ధరలు 15 శాతం వరకు పెరిగే అవకాశం కనిపిస్తోంది.

ఆర్థిక కష్టాల్లో ఉన్న సర్కారును మందు బాబులు ప్రతిసారీ ఆదుకుంటున్నారు. ఇప్పుడు అప్పులతోతమతమవుతున్న రేవంత్‌రెడ్డి సర్కారును మరోసారి మందుబాబులు ఆదుకోనున్నారు. అంటే మళ్లీ మద్యం ధరలకు రెక్కలు రానున్నాయన్న మాట. మద్యం ధరలు పెంచాలని బ్రూవరీలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

ప్రభుత్వం ధరలను ప్రతి రెండేళ్లకోసారి పెంచుతుంది. వివిధ రకాల మద్యంపై రూ.20 నుంచి రూ.150 వరకు పెంచాలని బ్రూవరీలు ప్రభుత్వాన్ని కోరాయి. తెలంగాణలోని6 బ్రూవరీల్లో ప్రతి సంవత్సరం 88 కోట్ల లీటర్ల బీరు ఉత్పత్తి అవుతోంది. దసరా పండుగ సమయంలో మద్యం అమ్మకాలు భారీగా పెరుగుతాయి. ఈసారి పది రోజుల వ్యవధిలో రూ.1,100 కోట్లకు పైగా మద్యాన్ని తెలంగాణ మందుబాబులు తాగేశారు.

మద్యం అమ్మకాల్లో ఈసారి కూడా హైదరాబాద్ ముందు నిలిచింది. సెప్టెంబర్ 30 వరకు రూ.2,838 కోట్ల మద్యం అమ్మకాలు జరగగా... అక్టోబర్ నెల ప్రారంభం నుంచి 11వ తేదీ వరకు రూ రూ.1,100 కోట్ల విలువైన 10 లక్షల 44 వేల కేసుల మద్యం అమ్మకాలు జరిగాయని ఆబ్కారీ అధికారులు చెబుతున్నారు. 10 రోజుల వ్యవధిలో 17 లక్షల 59 వేల బీర్లు అమ్ముడుపోయినట్లుగా తెలుస్తోంది. ఇదే కిక్కుతో మద్యంపై బాదుడు ద్వారా మరిన్ని వేల కోట్ల రూపాయల ఆదాయానికి రేవంత్ సర్కారు సిద్ధమవుతున్నట్లు కనిపిస్తోంది.

## వద్దన్న విజయసాయి.. మళ్లీ ముద్దయ్యారా?

మొదటి పేజీ తరువాయి..

బాలినేనికి చెక్ పెట్టిన వైనాన్ని పార్టీ సీనియర్లు గుర్తు చేస్తున్నారు. ఇంతగా అవమానించి, పక్కనపెట్టిన విజయసాయిని మళ్లీ పిలిచి, ఉత్తరాంధ్ర బాధ్యతలు కట్టబెట్టడం వింతగా ఉందని పార్టీ సీనియర్లు వ్యాఖ్యానిస్తున్నారు. ఒకవేళ అధినేత జగన్ మాట కాదనలేక విజయసాయి ఈ బాధ్యతలు తీసుకున్నప్పటికీ.. ఇప్పటికే అక్కడ వివిధ హోదాల్లో సుబ్బారెడ్డి వర్గీయులే ఉన్నందున, వారు విజయసాయికి సహకరిస్తారా అన్నదే ప్రశ్న.

ఇక ఇప్పటికే మండలిలో విపక్షనేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ విశాఖతోపాటు.. ఉత్తరాంధ్ర వ్యవహారాలను అనధికారికంగా పర్యవేక్షిస్తున్నారు. ప్రధానంగా బొత్స, విశాఖ కేంద్రంగానే మంత్రాంగం నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో విజయసాయిరెడ్డికి మునుపటి మాదిరిగా స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందా? అన్నది వైసీపీలో జరుగుతున్న మరో ప్రధాన చర్చ.'విజయసాయిరెడ్డి మొదటి నుంచి రాజారెడ్డితో సన్నిహితంగా ఉన్న వ్యక్తి. ఆడిటర్‌గా వైఎస్ కుటుంబంతో గంటలపాటు మాట్లాడే చనువు ఉంది. వైఎస్ కుటుంబానికి విధేయుడు. కాకపోతే దగ్గరగా ఉండేవారు నిందలు మోయాల్సి



ఉంటుంది. అది తెలియక ఆయనంటే గిట్టని మా పార్టీ పెద్దలు కొందరు, విజయసాయి మరి కొందరు ఎంపీలతో కలసి బీజేపీలోకి వెళ్లిపోతున్నారని ప్రచారం చేశారు. జగన్ కోసం జైలుకెళ్లి తన జీవితాన్ని త్యాగం చేసిన విజయసాయిరెడ్డి పార్టీ ఎలా మారతారు? అందుకే ఆయనకు ఇష్టం లేకపోయినా జగన్ చెప్పినందున, ఉత్తరాంధ్రకు ఇన్చార్జిగా వెళతారు'ని మాజీ మంత్రి ఒకరు వ్యాఖ్యానించారు.

తన ప్రాధాన్యం తగ్గించేందుకు కారణమైన జగన్ కోటరీమీద అసంతృప్తితోనే, విజయసాయి రెడ్డి విజయవాడ వెళ్లడం మానేశారు. ఆయన చాలాకాలం నుంచి తాడేపల్లి జగన్ క్యాంపు ఆఫీసులో జరిగే పార్టీ మీటింగులకు దూరంగా ఉండి, హైదరాబాద్-ఢిల్లీకే పరిమితమవడానికి అదే ప్రధాన కారణమని సీనియర్లు విశ్లేషిస్తున్నారు.

## ఈ సన్నాసి సీఎం ఏం చేస్తున్నాడు?

మొదటి పేజీ తరువాయి..

ఇవన్నీ మనం సాధించిన విజయాలు.

తెలంగాణ మీద ప్రేమ ఉన్న కేసీఆర్ కాబట్టే ఇవన్నీ సాధ్యమయ్యాయి. తెలంగాణకు ఓ పెట్టుబడి, ఓ అవార్డు వచ్చినప్పుడు మేము ఎంతో సంతోషపడే వాళ్లం. శ్రీకాంత్ చారి, యాదిరెడ్డి, ఇషాంత్ రెడ్డి లాంటి వందల మంది విద్యార్థుల త్యాగాలతో పునీతమైన నేల తెలంగాణ. నీళ్లు, నియామాకాలు, నిధులు అనే నినాదాన్ని ప్రామాణికంగా పనిచేశాం.

నీళ్ల రంగంలో సంపూర్ణ విజయం సాధించాం. కాళేశ్వరం పూర్తి చేశాం. పాలమూరు-రంగారెడ్డి పనులు 90 శాతం పూర్తి చేశాం. నల్గొండలో ఫ్లోరోసిస్ ను పూర్తిగా తుడిచి వేసిన ఘనత కేసీఆర్ది. తలసరి ఆదాయంలో రాష్ట్రం ఏర్పడే నాటికి మనది 14 వ స్థానం. కేసీఆర్ దిగిపోయేనాటికి నంబర్ వన్ గా నిలిచి కాలర్ ఎగరవేసుకొని పరిస్థితి వచ్చింది.

నీళ్లు, రైతుబంధు సహా భూముల విలువ పెంచి కేసీఆర్ రైతుల్లో ధీమా నింపారు. ఇప్పుడు పరిస్థితి ఎలా తయారైందంటే రాష్ట్రంలోని ఏ వర్గం ప్రజలకు కష్టం వచ్చిన సరే ప్రజలు తెలంగాణ భవన్ కు వస్తున్నారు. ఆశ ఆడ బిడ్డలు వచ్చి కేసీఆర్ మేము అడగకుండానే 9, 900 ఇచ్చారని గుర్తు చేస్తున్నారు. మాకు 18 వేలు ఇస్తామని కాంగ్రెస్ చెబితే మోసం పోయామని చెబుతున్నారు.

చిట్టినాయుడిని కదిలించాలంటే మీరు వేలాది గా తరలి రావాల్సిన అవసరముందని వారికి చెప్పాను. గ్రూప్ వన్ మెయిన్స్ ఎగ్జామ్స్ రీ షెడ్యూల్ చేయాలని అశోక్ నగర్ లో పోరాటం చేసిన విద్యార్థులు తెలంగాణ భవన్ కు వచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ను అవమానించేలా రిజర్వేషన్లలో మోసం చేసే విధంగా వ్యవహరిస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లలో విద్యార్థులకు అన్యాయం జరిగేలా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం లోపభూయిష్ట విధానాలతో గ్రూప్ వన్ మెయిన్స్ ఎగ్జామ్ రద్దయ్యే పరిస్థితి ఉంది. అశోక్ నగర్ కు వెళ్లాల్సి ఉన్నప్పటికీ అక్కడ పోలీసులను పెట్టటంతో విద్యార్థులే తెలంగాణ భవన్ కు వచ్చారు. ప్రజలకు కష్టమొస్తే గాంధీ భవన్, బీజేపీ ఆఫీస్ కు కాదు తెలంగాణ భవన్ వైపు చూస్తున్నారు.

ప్రజల గూడు కూలగొడుతుంటే కేసీఆర్ కు చెప్పుకుంటే సమస్య తీరుతదని ప్రజలు భావిస్తున్నారు. నేను బయలుదేరే ముందు ఇంటి వద్దకు ఆటో యూనియన్ వాళ్లు కూడా వచ్చి వాళ్ల ధర్నాకు రావాలని కోరారు. చిట్టి నాయుడు పాలనలో బాధ పడని వాళ్లు లేరు. ఊళ్లలో రైతులు పొట్టు పొట్టు తిడుతున్నారు. తులం బంగారం, బతుకమ్మ చీరలు ఏదీ దిక్కులేని పరి స్థితి తెచ్చారన్నారని మండిపడుతున్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు ఆడ బిడ్డలను ఇంటి ఆడపడుచును చూసుకున్నట్టు చూసుకున్నాడని గుర్తు చేసుకున్నారు. టెన్త్ పాసైతే చాలు పది వేలు, ఇంటర్ పాసైతే 15 వేలు, డిగ్రీ పాసైతే 25 వేలు, పీజీ పాసైతే లక్షా, పీహెచ్ డీ చేస్తే లక్షా అన్నాడు. ఎవరికైనా వచ్చాయా? ఈ విషయాలను మనం ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలి.

కేసీఆర్ పదేళ్లలో 60 డిగ్రీ కాలేజ్ లు ఏర్పాటు చేశారు. ఇంటర్ రెసిడెన్షియల్ కాలేజ్ లు 146 ఉంటే 592 చేశారు. గురుకుల రెసిడెన్షియల్ స్కూళ్లను 294 నుంచి 1022 కు పెంచారు. మెడికల్ కాలేజ్‌లు 5 ఉంటే 33 చేశారు. నర్సింగ్ కాలేజ్ లను కూడా 33 చేశారు. మెడికల్ సీట్లు 800 ల నుంచి 3,581 కు తీసుకొచ్చారు.

సిద్దిపేటలో ఒకటే ఇంట్లో నాలుగు మెడిసిన్ సీట్లు వచ్చాయంటే చాలా సంతోషం అనిపించింది. రాష్ట్రంలో వైట్ కోట్ విప్లవం తెచ్చాం. ధాన్యం ఉత్పత్తి లో నంబర్ వన్ అయ్యాం. అది కేసీఆర్ ఘనత. ఈ సన్నాసి సీఎం ఏం చేస్తున్నాడు? స్కూళ్లలో చాక్ పీస్ లకు కూడా పైసలు లేవు. కానీ మూసీలో పారబోసేందుకు లక్షా 50 వేల కోట్లు ఉన్నాయంట. గురుకులాల అద్దె కట్టేందుకు డబ్బులు లేవు. బడా పారిశ్రామిక వేత్తలకు లక్షల కోట్లు దోచిపెడుతున్నారు. బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని అమలు చేసేందుకు ఏం రోగం ఈ ముఖ్యమంత్రికి?

25 సార్లు ఢిల్లీకి పోయి రూ. 25 పైసలు తేలేదు. తన సీటు కాపాడుకునేందుకు హైకమాండ్ కు కప్పం, ఢిల్లీ కి మూటలు సర్దేందుకే ముఖ్యమంత్రికి సమయం సరిపోతోంది. గురుకులాల్లో పాములు కుట్టి విద్యార్థులు చనిపోవటం చాలా దారుణం. కేసీఆర్ సమయంలో గురుకులాల విద్యార్థులు మౌంట్ ఎవరెస్ట్ ఎక్కితే చిట్టి నాయుడు మాత్రం గురుకులాలను పాతాళంలోకి తీసుకెళ్తున్నాడు. కేసీఆర్ ఆనవాళు లేకుండా చేయాలంటే తెలంగాణను తీసుకపోయి ఆంధ్రాలో కలపాలి. తెలంగాణలో కేసీఆర్ లేకుండా చేస్తామంటే ఏ మూరు?లకు ఏం చెప్పాలె. తులం బంగారం ఏమైందంటూ ప్రశ్నిస్తే జగిత్యాలలో కేసు పెట్టారు. ప్రశ్నించకపోతే తెలంగాణ మూగబోతుంది. కాంగ్రెస్ వాడు ఏం చేసిన బీజేపీ వాళు మాట్లాడటం లేదు.

పైన జుమ్లా పీఎం ఉంటే ఇక్కడేమో హౌలా సీఎం ఉన్నాడు. ఈ సీఎం కు ఏం చేయాలో అర్థం కావటం లేదు. ఆగమాగం జగన్నాథం అన్నట్లు ఉన్నాడు. మేము గెలుస్తమని మేమే అనుకోకుండా అడ్డగోలు హామీలిచ్చామని ఓ కాంగ్రెస్ మంత్రి నాతోనే అన్నాడు. మీరే 15 మంది మార్చుకుంటే గెలుస్తుండే అన్నాడు. కానీ నా పేరు చెప్పవద్దంటూ అన్నీ చెప్పేసిండు. కాంగ్రెస్ మళ్లీ గెలిచేది లేదని నడిచినన్ని రోజులు నడుస్తుదని ఎవ్వరి దుకాణం వాళ్ల తెరుచుకుంటున్నారు.

మేము ఉన్నప్పుడు పెద్ద బిల్డింగ్‌ల పర్మిషన్లకు కూడా మంత్రిని కలవాల్సిన అవసరం రాలేదు. కానీ ఇప్పుడు కరెంట్ కనెక్షన్ కోసం కూడా రూ.25 లక్షలు తీసుకున్నారని ఓ బిల్డర్ చెప్పాడు. అందినకాడికి దోచుకో. అవన్నీ దాచుకో అని కాంగ్రెస్ వాళ్ల యవ్వారం ఉంది.

గత పదినెలల్లో మన పార్టీ అన్ని కష్టకాలాలను అధిగమించింది. కొన్ని పొరపాట్లు, కాంగ్రెస్ వాళ్లు ఇచ్చిన అడ్డగోలు హామీలతో మనం ఓడిపోయాం. గత అసెంబ్లీ ఎన్నికల్లో మనం ఊహించని విధంగా ఓడిపోయాం. ఆ తర్వాత కేసీఆర్ కి గాయం. కొంతమంది పార్టీ మారటం, మన పార్టీ నాయకురాలు కవితను జైలుకు పంపించటం చేశారు. అయినా సరే పోరాటం చేశాం. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా మనకు ఎదురుదెబ్బ తగిలింది. పది నెలల్లో అన్ని కష్టాలను అధిగమించాం.

ఇప్పుడు ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా సరే మనల్నే తలచుకుంటున్నారు. దసరా రోజు ప్రతి ఇంట్లో ప్రజలు కేసీఆర్ ని తలుచుకున్నారు. ఒక్క కాంగ్రెస్ మాత్రమే కాదు. తెలంగాణకు అతి ప్రమాదకరమైన పార్టీ బీజేపీ. మతాన్ని అడ్డంపెట్టుకొని రెచ్చగొట్టే పార్టీ బీజేపీ. మనకు ఒక్క మెడికల్, నర్సింగ్, నవోదయ పాఠశాల ఇవ్వలేదు. తెలంగాణ విద్యార్థులకు ఏం చేశారని ప్రశ్నిస్తే సమాధానం చెప్పరు. పిల్లలను అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేస్తారు.

ప్రతి జిల్లాల్లో బీఆర్ఎస్వీ సమావేశాలు జరగాలి. ఎక్కడికక్కడ మీటింగ్ లు పెట్టుకుందాం. మన పార్టీలో ఎంతో మంది యువ నాయకులు ఉన్నారు. వాళ్లను ప్రోత్సహించుకుందాం. మనకు చాకుల్లాంటి యువ నాయకత్వం ఉంది. కొత్త నాయకత్వాన్ని తయారు చేసుకుందాం. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇంత జరుగుతున్నప్పటికీ ఆ పోరాటాన్ని చూపించే ధైర్యం ప్రధాన మీడియా చేయటం లేదు. సోషల్ మీడియాలో మనమే పోరాటం చేయాలే. కేసులు పెట్టినా సరే భయపడవద్దు. మన లీగల్ సెల్ ను మరింత బలోపేతం చేసుకుందాం. పోలీసులు కూడా కాంగ్రెస్ కార్యకర్తల్లా మారిపోయారు. మనం సాధించిన విజయాలను ప్రతి ఒక్కరికీ పంపించాలి. బీఆర్ఎస్వీ జెండా లేని కాలేజ్ మనకు కనిపించవద్దు. డీలిమిటేషన్, మహిళ రిజర్వేషన్లు రాబోతున్నాయి. చాలా మందికి అవకాశాలు వస్తాయి. కొత్త నాయకత్వాన్ని మనం తయారు చేసుకుందాం. బీఆర్ఎస్ పార్టీ అనేది తెలంగాణ ప్రజల గొంతుక.

పేద ప్రజల ఇళ్లు కూలగొడుతుంటే, కేసులు పెడుతుంటే బీజేపోళ్లు మాట్లాడుతున్నారా? పొంగులేటి ఇంట్లో ఈడీ రైడ్ జరిగితే మాట్లాడుతున్నారా? పైన ఆడే నాటకం ఒకటి. లోపల మాత్రం వాళ్లు రెండు ఒక్కటే. తోడు దొంగలు. తెలంగాణకు శ్రీరామరక్ష కేసీఆర్ నాయకత్వం, బీఆర్ఎస్ పార్టీ మాత్రమే. సోషల్ మీడియా లో బూతులు తిట్టవద్దు. అది మన తెలంగాణ సంస్కృతి కాదు. మనం సబ్జెక్ట్ ను మాత్రమే చర్చకు పెడదాం. చిట్టి నాయుడు 60 వేల ఉద్యోగాలు ఇచ్చినా అని అంటుంటే మాత్రం చిత్రంగా అనిపిస్తోంది. ఉద్యోగం ఇవ్వాలంటే నోటిఫికేషన్, పరీక్షలు పెట్టాలె. మరి చిట్టి నాయుడు వచ్చాక ఎన్ని నోటిఫికేషన్లు వచ్చాయి? రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీలకు మాత్రం 2 ఉద్యోగాలు వచ్చాయి. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు. ఇప్పటి వరకు దాన్ని పట్టించుకోవటం లేదు. ప్రజలు మనకు రెండుసార్లు అవకాశం ఇచ్చారు. వాళ్లను అనటానికి ఏమీ లేదు. మనమే పొరపాట్లు చేశాం. మళ్లీ ప్రజలు మెచ్చే విధంగా వాళ్లకు దగ్గరవుదాం. బీఆర్ఎస్ పార్టీ ప్రజలది. డీఎంకే మాదిరిగా మరో 70 ఏళ్ల పాటు బలంగా ఉండేలా తీర్చిదిద్దుకుందాం. విద్యార్థి నాయకులంతా కూడా ఎమ్మెల్యే, ఎంపీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, నాయకులు కావాలి.

## కేసీఆర్..రచ్చబండకు రెడీనా?

మొదటి పేజీ తరువాయి..

కాదు.. ఇది మూసీ పునరుజ్జీవనం కోసం. మూసీ మురికి నుంచి ప్రజలను కాపాడాలనేదే మా ప్రయత్నం. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరచాలనేదే మా ఆలోచన. మల్లన్న సాగర్, రంగనాయక్ సాగర్, కొండపోచమ్మ కు నేను ఎక్కడికైనా వస్తా.ఎక్కడికైనా సెక్యూరిటీ లేకుండా రావడానికి నేను సిద్ధంగా ఉన్నా.మీరూ రండి రచ్చబండ నిర్వహిద్దాం.

కేసీఆర్.. నీ నియోజకవర్గానికి నేను వస్తా. రచ్చబండలో కూర్చుని చర్చిద్దాం. ఇది మూసీ సుందరీకరణ కాదు...మూసీ పునరుజ్జీవనం. ఇది కొందరు దుబాయ్ వెళ్లి అందం కోసం జుట్లు నాటించుకోవడం లాంటి కార్యక్రమం కాదు. నగరం మధ్య నదీ ప్రవాహం ఉన్న నగరం దేశంలో ఎక్కడా లేదు. మూసీ పరివాహక ప్రాంత ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ వారిని తరలించాలనేదే మా ఆలోచన. 1600 పైచిలుకు మూసీ ఇండ్లు నదీ గర్భంలో ఉన్నాయి.

దసరా నేపథ్యంలో వారికి ఇండ్లు ఇచ్చి, ఖర్చులకు డబ్బులు ఇచ్చి అక్కడి నుంచి తరలించాం. మల్లన్న సాగర్, కొండపోచమ్మ బాధితులను దుర్మార్గంగా రాత్రికి రాత్రి ఖాళీ చేయించింది మీరు, కొండపోచమ్మ ప్రాజెక్టులో మునిగిన 14 గ్రామాల్లో ఏ ఒక్కరికైనా ఇండ్లు ఇచ్చారా? మిడ్ మానేరు ముంపు బాధితులకు ఇండ్లు ఇస్తామని మోసం చేసింది మీరు. కానీ మేం అలా చేయడం లేదు.

బఫర్ జోన్‌లో ఉన్న 10వేల కుటుంబాలకు కూడా పునరావాసం కల్పిస్తాం. ఈ నగరాన్ని అభివృద్ధి చేయడం విపక్షాలకు ఇష్టంలేదా? చరిత్ర కాలగర్భంలో మూసీని సమాధి చేయదలచుకున్నారా? మేం ఉండేది ఐదేళ్లా, పదేళ్లా అనేది ప్రజలు నిర్ణయిస్తారు. ఉప్పెనలా వరదలు వస్తే నగరమే మిగలదు. ఇదేమైనా గజ్వేల్ ఫామ్ హౌసా? లేక ధరణి లాంటి మాయాజాలమా?

ఎవరినో మోసం చేసి ఏదో చేయాలన్న ఆలోచన నాకు లేదు.మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్ట్‌లో నా స్వార్థం లేదు. ఆదాయాన్ని పెంచి పేదలకు పంచడమే మా ప్రభుత్వ ఆలోచన. మూసీ విషం హైదరాబాద్ నగరాన్నే కాదు. నల్లగొండనూ విషతుల్యం చేస్తోంది. నల్గొండ ప్రాంతానికి ఎలా పునరుజ్జీవనం కలిగించాలి. మాట్లాడితే లక్షా 50వేల కోట్లు అని మాట్లాడుతున్నారు.మీలా దోచుకోవడానికి ఇదేమైనా కాళేశ్వరం అనుకున్నారా?

మూసీ రివర్ కు సంబంధించి ప్రాజెక్టు రిపోర్టు తయారు చేసేందుకు ఐదు కంపెనీలు ఇక్కడ ఉన్నాయి. మూసీ పునరుజ్జీవనంతో పాటు అవసరమయ్యే నిధుల అంచనా, సేకరణ లాంటి ప్రణాళికలు రూపొందిస్తారు.18 నెలల్లో మూసీని ఏం చేయాలో వారు డీపీఆర్ అందిస్తారు. ఇప్పటి వరకు మూసీ నదికి సంబంధించి జరిగిన ఒప్పందం రూ.141 కోట్లు మాత్రమే. మరి లక్షా 50 వేల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి? సుందరీకరణ అనే పదాన్ని ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? ఇది మూసీ సుందరీకరణ కాదు.ఇది మూసీ పునరుజ్జీవనం. మూసీ పునరుజ్జీవనం అనే గొప్ప కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి.. అసూయ, ద్వేషంతో కొందరు సృష్టించే అపోహలను నమ్మకండి. హైదరాబాద్ నగరంలోని అద్భుతమైన చారిత్రక కట్టడాలను కాలగర్భంలో కలిపేయాలని కొందరు కంకణం కట్టుకు తిరుగుతున్నారు.

ఏ సంస్థల గురించి వాళ్లు మాట్లాడుతున్నారో, అవే సంస్థలకు వాళ్లు కూడా గతంలో కాంట్రాక్టులు ఇచ్చారు. అప్పుడు లేని అభ్యంతరం మూసీ అభివృద్ధి విషయంలోనే ఎందుకు? వాళ్లు చేస్తే గొప్ప.. మేం చేస్తే తప్పా? హరీష్, కేటీఆర్, ఈటెల ముగ్గురూ మూడు నెలలు మూసీ ఒడ్డున నివసించాలి. ఇప్పుడే ఆ ముగ్గురికీ ఇండ్లు కేటాయించాలని అధికారులకు ఆదేశిస్తున్నా. వాళ్లకు భోజన సదుపాయం కూడా ఏర్పాటు చేయండి. మూసీ పరివాహకం అలాగే ఉండాలనుకుంటే మీరు అక్కడ ఉండి రోల్ మోడల్ గా నిలవండి.మూడు నెలలు మీరు అక్కడ ఉండగలిగితే నేను ఈ ప్రాజెక్టును విరమించుకుంటా.

ఒక తెలంగాణ కవి తన నలుగురు కూతుర్లకు గంగ, యమునా, సరస్వతీ, కృష్ణవేణి అని పేర్లు పెట్టుకున్నాడు. మన మూసీ నది పేరు పెట్టుకోకపోవడానికి గత పాలకులు కాదా? ఈ ద్రోహాన్ని ఇలాగే కొనసాగిద్దామా? దేశ ద్రోహం కంటే ఇది పెద్ద నేరం. హిరోషిమా,నాగసాకిలలో పడిన అణుబాంబు కంటే మూసీ ఆక్రమణ ప్రమాదకరం. మూసీ నది పునరుజ్జీవనంపై చర్చకు ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశాలు పెడదాం.

మూసీ పరివాహక ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.. వారికి ఏం ఇద్దామో చెప్పాలని కేసీఆర్, కేటీఆర్, కిషన్ రెడ్డి, ఈటెల చెప్పాలని విజ్ఞప్తి చేస్తున్నా. అవసరమైతే న్యాయ నిపుణుల సలహా తీసుకుని ఎంపీల అభిప్రాయాలను అసెంబ్లీ రికార్డుల్లోకి తీసుకుందాం. మన నగరాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలో మీరు చెప్పండి.

ఎంఐఎం, బీజేపీ, బీఆరెస్, కమ్యూనిస్టు పార్టీల అధ్యక్షులకు నేను విజ్ఞప్తి చేస్తున్నా. మీకు ఎలాంటి అనుమానాలు ఉన్నాయో నాకు పంపండి. ప్రభుత్వం రాతపూర్వక వివరణ ఇవ్వడానికి సిద్ధంగా ఉంది.ఈ శనివారంలోగా మీరు యాక్షన్ ప్లాన్ ఇవ్వాలని కోరుతున్నా.

జనం గుండె చప్పుడు


# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 18, అక్టోబర్ 2024 ||

## రైల్వే అడ్వాన్స్ టిక్కెట్ బుకింగ్ ఇక 60 రోజులకే..

ఢిల్లీ,మహానాడు:
రైల్వే అడ్వాన్స్ టిక్కెట్ బుకింగ్‌ను ఇండియన్ రైల్వేస్ 60 రోజులకు కుదించింది. ఇప్పటివరకు ఇది 120 రోజులుగా ఉంది. రైల్వే నిబంధనల ప్రకారం రైలు నిర్ణీత సమయానికి 120 రోజుల ముందు అడ్వాన్స్ బుకింగ్ చేసుకోవచ్చు.



తాజ్ ఎక్స్‌ప్రెస్, గోమతి ఎక్స్‌ప్రెస్, తదితర ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్ల విషయంలో బుకింగ్ నిబంధన యథాతథంగా కొనసాగుతుందని తెలిపింది. ఈ రైళ్లకు అడ్వాన్స్ బుకింగ్ సమయం ఇప్పటికే తక్కువగా ఉంది. అదే సమయంలో విదేశీయులకు 365 రోజుల అడ్వాన్స్ బుకింగ్ సమయం కొనసాగుతుందని వెల్లడించింది.

నవంబర్ 1వ తేదీ నుంచి 60 రోజులకు కుదిస్తూ రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే బుకింగ్ చేసుకున్న వారికి ఎలాంటి ఇబ్బంది ఉండదని రైల్వే శాఖ వెల్లడించింది. నవంబర్ 1వ తేదీకి ముందు బుకింగ్ చేసుకున్న వారికి ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపింది.



### పొరపాట్లు లేకుండా

## గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

హైదరాబాద్,మహానాడు:
ఈనెల 21 వ తేదీ నుండి 27 వ తేదీ వరకు జరిగే గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలను ఏవిధమైన పొరపాట్లు లేకుండా అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి స్పష్టం చేశారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమీషనర్లు, సంబంధిత ఉన్నతాధికారులతో నేడు సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు.

తెలంగాణా పబ్లిక్ సర్వీస్ కమీషన్ కార్యాలయం నుండి కమీషన్ చైర్మన్ డా. మహేందర్ రెడ్డి, సభ్యులు పాల్గొనగా, సచివాలయం నుండి డీజీపీ జితేందర్, కమీషన్ కార్యదర్శి నవీన్ నికోలస్, ఎస్‌పిడిసిఎల్ ఎండీ ముష్రాఫ్ అలీ, రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ కర్ణన్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు అనుదీప్, శశాంక్, గౌతమ్ తదితర అధికారులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా సి.ఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు 34,383 మంది అభ్యర్థులు హాజరవుతుండగా, దీనికోసం 46 పరీక్షా కేంద్రాలను హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో ఏర్పాటు చేశామని వివరించారు. ఈ పరీక్షలు నిర్వహించే అన్ని కేంద్రాల వద్ద ఏవిధమైన అవకతవకలు, అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు, విస్తృత స్థాయిలో సీనియర్ అధికారులతో పర్యవేక్షణను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

జిల్లా కలెక్టర్లు నేరుగా ఈ పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తారని, సంబంధిత పోలీస్ కమీషనర్లు కూడా తగు బందోబస్తు ఏర్పాట్లను చేపడుతారని తెలిపారు. అన్ని శాఖల అధికారులు ఏవిధమైన స్వల్ప సంఘటనలు జరుగకుండా అత్యంత అప్రమత్తంగా ఈ పరీక్షల నిర్వహణా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు.

టిజిపిఎస్సీ చైర్మన్ డా.ఎం.మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, 2011 సంవత్సరం అనంతరం గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షలు జరుగుతున్నాయని, కొన్ని సంవత్సరాల అనంతరం జరిగే ఈ పరీక్షల నిర్వహణలో ప్రతీ అంశంలోనూ అత్యంత జాగ్రత్తగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు.

ఆధునిక సాంకేతికత, సోషల్ మీడియా ఆక్టివ్‌గా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో పరీక్షల నిర్వహణ కూడా సవాలుతో కూడుకుంటున్నదని, ఈ నేపథ్యంలో ఏవిధమైన అపోహాలు, పుకార్లకు తావివ్వకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని మహేందర్ రెడ్డి అన్నారు. గ్రూప్ -1 జరిగే అన్ని పరీక్షా కేంద్రాల వద్ద విస్తృతమైన బందోబస్తుతోపాటు పరీక్షలు ప్రశాంతంగా కొనసాగేందుకు అన్ని చర్యలు చేపట్టామని డీజీపీ జితేందర్ తెలిపారు.

టిజిపిఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ మాట్లాడుతూ, హైదరాబాద్ జిల్లాలో 8, రంగారెడ్డి జిల్లాలో 11, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 27 మొత్తం 46 కేంద్రాలలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పరీక్ష హాల్, చీఫ్ సూపరింటెండెంట్ రూమ్, పరిసర ప్రాంతాలన్నింటిలోనూ సీసీ టీవీలను ఏర్పాటు చేసి, టిజిపిఎస్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

పరీక్షల నిర్వహణలో ప్రతిస్టెప్‌లోనూ కచ్చితమైన నియమ నిబంధనలు పాటించేలా స్పష్టమైన మార్గదర్శకాలు అందచేశామని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల బయోమెట్రిక్ హాజరు తీసుకునేందుకై ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు, మధ్యాహ్నం ఒకటిన్నర తర్వాత పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులను అనుమతించేది లేదని స్పష్టం చేశారు.

ఇప్పటికే, 85 శాతం అభ్యర్థులు తమ హాల్ టికెట్లను డౌన్ లోడ్ చేసుకున్నారని తెలిపారు. దివ్యాంగులకు ప్రత్యేకంగా ఒక గంటను అదనంగా కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఎవరికైతే పరీక్ష రాయడానికి సహాయకులు (స్క్రైబ్ ) అవసరమో, ఆ అభ్యర్థుల హాల్ టికెట్లపై ప్రత్యేకంగా పేర్కొనడం జరిగిందని, స్క్రైబ్‌ల సహాయంతో పరీక్షలు వ్రాసేవారికి ప్రత్యేకంగా 4 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కార్యదర్శి వెల్లడించారు.

అన్నిపరీక్షా కేంద్రాల 46 వద్ద ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ కర్ణన్ తెలిపారు. నిరంతరం విద్యుత్ సరఫరా అందించేవిధంగా చర్యలు చేపట్టినట్టు, ఇందుకుగాను ముగ్గురు సి.ఈలు పర్యవేక్షిస్తారని ఎస్‌పిడిసిఎల్ ఎండీ ముషారఫ్ అలీ అన్నారు. అన్ని కేంద్రాలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

- **మెరుగైన వైద్య సేవల కోసం 30 అంశాల కార్యాచరణ ప్రణాళిక అమలుపై ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ సుదీర్ఘ సమీక్ష**
- **గత రెండు నెలల్లో ఏమేరకు మార్పు తెచ్చారని ప్రశ్నించిన మంత్రి సత్యకుమార్ యాదవ్**
- **శుభ్రత, సైనేజ్ బోర్డులు, ఓపీ రిజిస్ట్రేషన్ , రిసెప్షన్, ఫీడ్ బ్యాక్ , హాజరు నియంత్రణ, కేంద్రీకృత నమూనాల సేకరణ వంటి పలు అంశాల్లో మార్పులు తెచ్చామన్న జీజీహెచ్‌ల సూపరింటెండెంట్లు**
- **సూపరింటెండెంట్లు, వైద్య సిబ్బంది కృషిని ప్రశంసిస్తూనే... చేయాల్సింది చాలా ఉందన్న మంత్రి**
- **పట్టుదల, కృషితో జీజీహెచ్‌ల నిర్వహణ, సేవల్ని మెరుగుపర్చాలన్న మంత్రి సత్యకుమార్ యాదవ్**
- **రోగులకు సేవలందించేందుకు 725 మంది సహాయకులు, రూ.240 కోట్ల మేరకు పరికరాల అవసరాల గుర్తింపు**

### మార్పును ప్రజలు గమనించారా?

## మీడియా గుర్తించిందా?


అమరావతి,మహానాడు:
ప్రభుత్వ సర్వజనాసుపత్రుల నిర్వహణ, సేవల్ని మెరుగుపర్చి వీటి పట్ల ప్రజల్లో సానుకూల అభిప్రాయాన్ని కలిగించేందుకు రెండు నెలల క్రితం రూపొందించిన 30 అంశాలతో కూడిన కార్యాచరణ ప్రణాళిక అమలుపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ గురువారం వెలగపూడి సచివాలయంలో సుదీర్ఘంగా సమీక్షించారు.

మూడుగంటల పాటు సాగిన సమీక్షలో అంశాల వారీగా జీజీహెచ్‌లలో చేపట్టబడిన చర్యలపై వివరాల్ని మంత్రి అడిగి తెలుసుకున్నారు. పలు చర్యలు చేపట్టామని సూపరింటెండెంట్లు వివరించగా.... తద్వారా ఆసుపత్రుల నిర్వహణ, సేవల నాణ్యతలో వచ్చిన మార్పుల్ని ప్రజలు గమనించినప్పుడే సార్థకత ఉంటుందని, ఈ దిశగా ప్రసార మాధ్యమాల్లో వార్తల్ని చూడలేదని మంత్రి వ్యాఖ్యానించారు. ఆసుపత్రుల అధికారులు తమ ప్రయత్నాల్ని, వాటి ఫలితాల్ని ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలకు తెలపాలని ఆయన సూచించారు.

ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, డిఎంఇ డాక్టర్ నరసింహం, 16 ప్రభుత్వ సర్వజనాసుపత్రులు, విశాఖపట్నంలోని ఛాతి వ్యాధుల ఆసుపత్రి సూపరింటెండెంట్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సూపరింటెండెంట్లు, ఇతర వైద్య సిబ్బంది చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ, ప్రభుత్వ వైద్య సేవల పట్ల ప్రజల్లో మరింత సానుకూల అభిప్రాయాన్ని కల్పించేందుకు ఇంకా శ్రమించి, గమనించదగ్గ మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని





మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు.

ప్రభుత్వాసుపత్రులు కొన్ని పరిమితులకు లోబడి పనిచేస్తున్నా నాణ్యమైన సేవల్ని ఆశించే హక్కు ప్రజలకు ఉందని, వారి అంచనాల మేరకు పనిచేయడం ప్రభుత్వ వైద్య సిబ్బంది బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు. తమ బాధ్యతల్ని గుర్తించి పట్టుదలతో కృషి చేస్తే సత్ఫలితాల్ని సాధించవచ్చని ఆయన అన్నారు. జీజీహెచ్‌లలో జరుగుతున్న కృషి, వాటి ఫలితాల్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవాల్ని మదింపు చేసేందుకు తగు చర్యల్ని చేపడతామని ఆయన అన్నారు.

30 అంశాల కార్యాచరణ ప్రణాళికలో మొదటి కొద్ది నెలల్లో చేపట్టాల్సిన కొన్ని చర్యలపై 17 ఆసుపత్రుల సూపరింటెండెంట్లు తెలిపిన ప్రగతి వివరాలు

1) సాయంకాలం ఓపీ సేవలు అందిస్తున్న ఆసుపత్రులు-17
2) రోగులు, సహాయకుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్న ఆసుపత్రులు-17
3) ఫిర్యాదులు, సలహాల పెట్టెలను ఏర్పాటు చేసిన ఆసుపత్రులు -17
4) ఆసుపత్రులు అందిస్తున్న సేవల వివరాల్ని తరచుగా ప్రజలకు మీడియా ద్వారా తెలియజేస్తున్న ఆసుపత్రులు-15
5) స్పెషలిస్టులు, సీనియర్ డాక్టర్ల ద్వారా మధ్యాహ్నం ఓపీ సేవల్ని అందిస్తున్న ఆసుపత్రులు-15
6) రోగులు, సహాయకులు ప్రయోజనాలతో సైనేజ్ బోర్డుల్ని ఏర్పాటు చేసిన ఆసుపత్రులు-14
7) ఓపీ సేవలకు సమీపంలో రక్త నమూనాల సేకరణ జరుపుతున్న ఆసుపత్రులు -14
8) వైద్యులు, ఇతర సిబ్బంది హాజరును పటిష్టంగా పర్యవేక్షిస్తున్న ఆసుపత్రులు -14
9) ఆసుపత్రులు, ప్రాంగణాల్లో పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించిన ఆసుపత్రులు-13
10) రోగులకు కేవలం అర గంట సమయంలో ఓపీ రిజిస్ట్రేషన్ కల్పిస్తున్న ఆసుపత్రులు-12

మధ్య, దీర్ఘ కాలిక వ్యవధిలో పూర్తి చేయాల్సిన, వివిధ ఆసుపత్రులు చేపట్టిన చర్యల గురించి కూడా ఈ సమావేశంలో క్షుణ్ణంగా చర్చించారు. నిర్దేశించిన విధంగా వివిధ కాలపరిమితుల్లో రెండు నెలల క్రితం రూపొందించిన 30 అంశాల కార్యాచరణ ప్రణాళికను నిబద్ధతతో అమలు చేసి ప్రజోపయోగం కోసం సత్ఫలితాల్ని సాధించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు.

ప్రజలకు మెరుగైన సేవల్ని అందించడానికి రూ.240 కోట్ల విలువైన వివిధ డయాగ్నోస్టిక్ పరికరాల అవసరం ఉందని, రోగులకు సేవలందించేందుకు 725 మంది సహాయకులు, 300 మంది స్టాఫ్ నర్సుల అవసరం ఉందని వివిధ ఆసుపత్రుల సూపరింటెండెంట్లు మంత్రికి వివరించారు. అదే విధంగా వివిధ ఆసుపత్రుల్లో డాక్టర్ల కొరత ముఖ్యంగా రేడియాలజిస్టులు,

రేడియోగ్రాఫర్ల కొరత ఉందని మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ అవసరాలతో పాటు గతంలో అందిన సమాచారం మేరకు పారామెడికల్, ల్యాబ్ టెక్నీషియన్ల కొరతను కూడా తీర్చడానికి తగు చర్యల్ని చేపట్టాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ తమ శాఖ ఉన్నతాధికారుల్ని ఆదేశించారు.

## సోషల్‌మీడియాతో భూకంపం సృష్టిద్దాం

- దేశంలోనే బలమైన పార్టీగా ఎదగాలి
- సంస్థాగతంగా వ్యవస్థీకృత నిర్మాణంతోనే అది సాధ్యం
- ఇప్పుడు కష్టపడే వాళ్లకే అవకాశాలు, ప్రమోషన్లు ఉంటాయి
- లోటుపాట్లు సరిదిద్దుకోవడానికి ఇప్పుడు తగిన సమయం
- ఆ సమయం అవకాశం ఇస్తోంది.. సద్వినియోగం చేసుకుందాం
- ప్రతి నియోజకవర్గంలో యథేచ్ఛగా పేకాట క్లబ్‌లు
- ఇది సోషల్ మీడియా కాలం.. అదే అంతటా వ్యాప్తి
- వాళ్లు అబద్ధాలు సృష్టిస్తున్నారు. ప్రచారం చేస్తున్నారు
- మనం అంతకన్నా బలంగా తయారు కావాలి
- పార్టీ కమిటీలన్నీ ఆ మీడియాకు అనుసంధానం కావాలి
- పార్టీ నాయకుల పనితీరుపైనా ఎప్పటికప్పుడు నివేదికలు
- వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్
- హాజరైన జిల్లా పార్టీ అధ్యక్షులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులనుద్దేశించి మాట్లాడిన మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్

తాడేపల్లి,మహానాడు:
ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తగిన సమయం ఉంటుంది. మనలో ఏమైనా తప్పులుంటే వాటిని సరిదిద్దుకోవడానికి, పార్టీని మరింత పటిష్టం చేయడానికి మంచి అవకాశం ఉంటుంది. మన పార్టీ ఏర్పాటు చేసుకుని దాదాపు 15 సంవత్సరాలు అవుతోంది. ఈ 15 ఏళ్లలో వివిధ రకాల ఎన్నికలు చూశాం. ప్రతిపక్షంగానూ, అధికారంలోనూ, మళ్లీ ఇప్పుడు ప్రతిపక్షంగానూ మన పార్టీ ఉంది.

15 ఏళ్లలో స్థానిక సంస్థలతో పాటు చాలా ఎన్నికల్లో పాల్గొన్నాం. గ్రామ స్థాయి నుంచి పార్టీ ప్రతి అడుగులోనూ యుద్ధం చేస్తోంది. కాకపోతే మనం ఆర్గనైజ్డ్‌గా యుద్ధం చేస్తున్నామా? లేదా? అన్నది చాలా ముఖ్యమైన విషయం. పార్టీ వ్యవస్థీకృతంగా ముందుకు సాగితేనే అది మంచి ఫలితాలను ఇస్తుంది. అప్పుడే మనం రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకూ ఎఫెక్టివ్‌గా ఉంటాం. శాసనసభ, పార్లమెంటుకు జమిలి అంటున్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మనం ఆర్గనైజ్డ్‌గా ఉంటేనే సమర్థంగా ఎదుర్కోగలం.

ఈరోజు మనం వేస్తున్న ఈ అడుగులు రాష్ట్రస్థాయి



నుంచి జిల్లా కమిటీలు, నియోజకవర్గ స్థాయి, మండల, గ్రామ స్థాయి కమిటీల వరకూ ఎలా ఉన్నాయన్న దానిపై పరిశీలన, అవగాహన పెంచుకోవాలి. ప్రతి ఒక్కరూ తమ పాత్రలను నిర్వర్తించాలి. ఆ దిశలో అడుగులు వేయాలి. మరో ఆరు నెలల్లో మళ్లీ సమావేశం నాటికి గ్రామస్థాయి వరకు కమిటీలు ఏర్పాటు కావాలి. అక్కడే యూత్, మహిళా విభాగం, విద్యార్థి విభాగంతో పాటు విలేజ్ కమిటీ, బూత్ కమిటీల వంటి అనుబంధ విభాగాలకు గ్రామస్థాయిలో కూడా కమిటీలు ఏర్పాటు కావాలి.

ఈ కమిటీల ఏర్పాటున్నది కాగితాలకే పరిమితం కాకూడదు. దాని వల్ల పార్టీకి ఎలాంటి లాభం ఉండదు. కమిటీల ఏర్పాటుపై మీ పర్యవేక్షణ, పరిశీలన ఉండాలి. ఇలా చేయగలిగితే.. దేశంలోకెల్లా నెంబర్ వన్ పార్టీగా ఎదుగుతాం. పార్టీ క్షేత్రస్థాయి నిర్మాణంలో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

గ్రామస్థాయి నుంచి మనకు కమిటీలు, నాయకత్వం లేక కాదు. ప్రతి గ్రామంలోనూ ఆ గ్రామ సర్పంచ్ లేదా, పోటీ చేసిన అభ్యర్థి మన పార్టీ వారే ఉన్నారు.

86 శాతం సర్పంచ్‌లు, 90 శాతం పైచిలుకు ఎంపీటీసీలు మన వాళ్లే ఉన్నారు. 15 ఏళ్లుగా ప్రతి గ్రామంలో మనకు ఇవన్నీ ఉన్నాయి. కాకపోతే వీటిని నిర్మాణాత్మక వ్యవస్థల్లోకి తీసుకురావాలి. గ్రామస్థాయిలో కూడా నిర్మాణాత్మకంగా ఉండాలి. అప్పుడు మనం రాష్ట్రస్థాయిలో ఇచ్చిన పిలుపునకు గ్రామస్థాయి వరకు ఉధృత స్పందన వస్తుంది. అది చేయగలిగాలి.

మనం ఇంట్లో కూర్చుంటే.. ఏమీ జరగదు. మనం చొరవ తీసుకుని అన్ని అంశాలపై స్పందించాలి. గ్రామ, మండల, నియోజకవర్గాల స్థాయిలో, జిల్లా స్థాయిలో ప్రజా సంబంధిత అంశాలపై స్పందించాలి. అన్యాయాలపై స్పందించాలి. బాధితులకు అండగా నిలవాలి. మనవైపు నుంచి స్పందన లేకపోతే ఆ అంశం మరుగున పడుతుంది. ప్రజలకు న్యాయం కూడా జరగదు.

**ఇంత దారుణమైన ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూసి ఉండం.**

నాలుగు నెలల్లోనే ఈప్రభుత్వం వద్దురా అని ప్రజలు చెప్పే పరిస్థితి వచ్చింది. నేనెప్పుడూ ఇలాంటి ప్రభుత్వాన్ని ఎక్కడా చూడలేదు. అంత దారుణమైన పరిపాలన సాగుతుంది. ప్రభుత్వం ఎలా విఫలమైందో నాకన్నా.. నాయకులుగా మీరే బాగా చెప్తారు. ఎన్నికలప్పుడు వాళ్లు చెప్పిన మాటలేమిటి.. ఎన్నికలు అయిపోయిన తర్వాత వాళ్ల చేస్తున్న పాలన ఏమిటన్నది గమనిస్తే.. ఆశ్చర్యం కలిగించే వాస్తవాలు కనిపిస్తున్నాయి.

ఇవాళ ఈ ప్రభుత్వం చేస్తున్నదేమిటి? ఎన్నికలప్పుడు చెప్పిన మాటలేమిటి? ఎన్నికలప్పుడు చెప్పిన సూపర్ సిక్స్‌లు ఏమయ్యాయని ప్రజలు ఎక్కడ నిలదీస్తారోనని.. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేక కనీసం బడ్జెట్‌ను కూడా ప్రవేశపెట్టలేకపోతున్నారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌తో నడుపుతున్న ప్రభుత్వం ఇది.

ఎన్నికలప్పుడు ప్రచారంలో వారిలా మనం అబద్ధాలు చెప్పలేకపోయాం. అదే మనకు వాళ్లకూ తేడా. ప్రతిపక్షంలో కూర్చోడానికైనా మనం వెనకాడం కానీ, అబద్ధాలు చెప్పలేం.

నేను ఈ మాటలు చెప్తే ఎవ్వరికీ నచ్చకపోవచ్చు. వాళ్లూ మన శ్రేయోభిలాషులే. కానీ విలువలు, విశ్వసనీయ అనే పదాలకు అర్థం ఉండాలి. రాజకీయల్లో అధికారం ఉండొచ్చు. ఉండకపోవచ్చు. కానీ మళ్లీ మనల్ని అధికారంలోకి తీసుకు వచ్చేది మన విశ్వసనీయత, విలువలే. అవి లేనప్పుడు రాజకీయాలకు అర్థం లేదు. ఆ విలువలు, విశ్వసనీయత మనలో కూడా లేనప్పుడు ప్రజలకు ఏ పార్టీ అయినా ఒకటే.. అన్ని పార్టీలూ ఇంతే అన్న భావన వస్తుంది. ఐదేళ్లు ప్రతిపక్షంలో కూర్చుంటే తప్పేముంది.

ఫలానా మంచి మా హయాంలో జరిగిందని.. ప్రజల్లోకి మనం ధైర్యంగా వెళ్లగలుగుతాం. కానీ టీడీపీ కూటమి కార్యకర్తలు ధైర్యంగా వెళ్లగలుగుతారా? టీడీపీ వాళ్లు ప్రజల ఇళ్లకు పోయే పరిస్థితులు లేవు.

మనం ప్రతి కుటుంబానికి మంచి చేసే కార్యక్రమాలు చేశాం. కానీ చంద్రబాబు అబద్ధాలకు రెక్కలు కట్టారు. ఇంటింటికీ వెళ్లి ఆ ఇంట్లో చిన్న పిల్లలు కనిపిస్తే నీకు రూ.15 వేలు, ఆ పిల్లల తల్లి కనిపిస్తే నీకు రూ.18 వేలు, వాళ్ల చిన్నమ్మ కనిపిస్తే నీకూ రూ.18 వేలు, 50 ఏళ్లకుపైబడిన పెద్దమ్మ కనిపిస్తే నీకు రూ.48 వేలు, ఉద్యోగం కోసం చూస్తున్న యువకుడు కనిపిస్తే నీకు రూ.36 వేలు, అదే ఇంట్లో మెడలో కండువాతో రైతు కనిపిస్తే చాలు నీకు రూ.20 వేలు అని ఇంట్లో ఎవరు కనిపించినా.. నీకు ఇంత.. నీకు ఇంత అని ప్రతి ఒక్కరికీ ప్రచారం చేశారు.

మనం ప్రజల్లోకి వెళ్లినప్పుడు, ప్రతి ఇంటికీ మన నాయకులు డోర్ టు డోర్ క్యాంపెయిన్ చేసినప్పుడు, ఎవరింటికి పోయినా అందరూ సంతోషంగా దీవించారు. అయితే ఒకవైపు ఈవీఎంల వ్యవహారం, మరోవైపు టీడీపీ మోసపూరిత హామీలతోనే ఓడిపోయాం.

కేవలం నాలుగు నెలల్లోనే ఎప్పుడూ చూడని వ్యతిరేకత ప్రభుత్వం మీద కనిపిస్తోంది. టీడీపీ నేతలు, కార్యకర్తలు ప్రజల ఇళ్లకు పోయి తిరిగే పరిస్థితి లేదు. వాళ్లు ఏదైనా ఇంటికి గ్రి ఇతే మా రూ.15 వేలు ఏమయ్యాయని పిల్లలు అడుగుతారు. మా రూ.18 వేలు ఏమయ్యాయని మహిళలు, రూ.48 వేలు ఏమయ్యాయని అవ్వలు, మా రూ.20 వేలు ఏమయ్యాయని రైతులు, మా రూ.36 వేలు ఏమయ్యాయని నిరుద్యోగ యువత అడుగుతారు. టీడీపీ నాయకులు ప్రజల్లోకి వెళ్తే కచ్చితంగా ఇవే వినిపిస్తాయి.

ఇలాంటి పరిస్థితుల్లో మనం ప్రిపేర్‌గా ఉండాల్సిన సమయం వచ్చింది. ఒకవైపు హామీల అమలు లేకపోగా, మరోవైపు రాష్ట్రంలో పాలన కూడా దారుణంగా తయారైంది. దాదాపు రూ.2,400 కోట్ల ఆరోగ్యశ్రీ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆరోగ్య ఆసరా లేదు. ప్రభుత్వం ఆస్పత్రులు నిర్వీర్యం అయ్యాయి.

మూడు త్రైమాసికాలు వచ్చినా.. విద్యాదీవెన, వసతిదీవెన లేదు. ఇంగ్లిష్ మీడియం లేదు. సీబీఎస్ఈ లేదు. టోఫెల్ క్లాసులు లేవు. గోరుముద్ద కూడా పాడైపోయింది. అన్ని రంగాలూ దారుణమైన పరిస్థితుల్లో ఉన్నాయి.

వ్యవసాయ రంగంలో ఖరీఫ్ సీజన్ పూర్తవుతున్నా రైతులకు పెట్టుబడి సహాయం అందలేదు. ఉచిత పంటల బీమా గాలికి ఎగిరిపోయింది. ఈ-క్రాప్ ఏమైందో తెలి



యదు. ఆర్బీకేలు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయి. రైతుల పంటలకు ఎమ్మెస్పీ రాని పరిస్థితి.

స్కామ్‌లలో కూడా ప్రజలను ఎలా కొత్తగా పిండాలా అని ఆలోచన చేస్తున్నారు. కనీసం ఇసుక టెండర్లు పిలుస్తున్నారన్న విషయం ఎవ్వరికీ తెలియదు. రెండే రెండు రోజులు టైం ఇచ్చారు. టెండర్లు వేయడానికి ఎవ్వరూ పోకుండా చూశారు. ఎన్నికలకు ముందు ఫ్రీ ఇసుక అన్నారు. ఎన్నికలు అయిన తర్వాత ఇసుక రేటు మన హయాం కన్నా డబుల్ రేటు, ట్రిపుల్ రేటు.

మన హయాంలో కనీసం రాష్ట్ర ఖజనాకు డబ్బులు వచ్చి ప్రజలకు రీజనబుల్ రేట్లకు ఇసుక వచ్చేది. ప్రతి ఆదివారం ప్రతి నియోజకవర్గంలో రేట్లు ఇచ్చేవాళ్లం. అక్రమాలకు పాల్పడితే కేసులు పెట్టేవాళ్లం. అంత పగడ్బందీగా అమలు చేశాం.

కానీ ఇప్పుడు దోచుకోవడానికి పాలసీని మార్చారు. అడ్డగోలుగా స్టాక్‌యార్డులు, రీచ్‌లు అధికారంలోకి వచ్చిన నెల రోజులకే ఖాళీ చేసేశారు. ప్రభుత్వానికి సున్నా ఆదాయం. మరోవైపు ధరలు రెండు, మూడు రెట్లు పెరిగాయి.

మద్యం గురించి మాట్లాడాల్సిన అవసరం లేదు. మన హయాంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో దుకాణాలు నడిపాం. ఉన్న షాపులు తగ్గించి, పర్మిట్ రూమ్స్ తీసేసి, టైమింగ్స్ పక్కాగా పెట్టి, బెల్టుషాపులు లేకుండా చూసి, అమ్మకం వాల్యూమ్స్ తగ్గించి ప్రజలకు మంచి చేశాం.

కానీ ఇప్పుడు మద్యం షాపుల కోసం అధికార పార్టీ ఎమ్మెల్యేలు 30 శాతం ఇస్తావా, 40 శాతం ఇస్తావా.. అని బెదిరిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. షాప్‌ల కోసం కిడ్నాప్‌లు కూడా చేస్తున్నారు. నిజంగా లిక్కర్ పాలసీలో దురుద్దేశాలు లేకపోతే ఎమ్మెల్యేలు ఎందుకు పోటీ పడుతున్నారు.

అంత దారుణంగా ఎందుకు వ్యవహరిస్తున్నారు. లిక్కర్ రేట్లు తగ్గిస్తామన్నారు. కానీ, రేట్లు అలాగే ఉన్నాయి. మళ్లీ పర్మిట్ రూమ్స్ తీసుకొస్తున్నారు. బెల్టుషాప్‌లు ఏర్పాటవుతున్నాయి. ఇన్ని జరుగుతున్నా ప్రభుత్వానికి ఆదాయం తగ్గుతుండగా, వారికి, వాళ్ల అనుచరులకు ఆదాయం పెరుగుతోంది.

ప్రతి నియోజకవర్గంలో 10 పేకాట క్లబ్బులు నడుస్తున్నాయి. ఆ నియోజకవర్గంలో గ్రావెల్ తోలుకోవాలన్నా, ఫ్యాక్టరీ పెట్టుకోవాలనుకున్నా.. వ్యాపారం చేయాలనుకున్నా.. ఎవరు ఏం చేయాలన్నా ఎమ్మెల్యేకు కప్పం కట్టాల్సిందే. డబ్బు ఇవ్వకపోతే వ్యాపారమే లేదు. పోలీసుల సహాయంతో బెదిరిస్తున్నారు. నాలుగు నెలల్లో ఇంతటి అధ్వాన్నమైన పాలన ఎప్పుడూ చూసి ఉండం. కానీ ఇవాళ కళ్లెదుటే కనిపిస్తోంది. ఇలాంటి సమయంలో మనం చేసిన మంచి పనులను ప్రజలు గుర్తిస్తారు. ఇదే సమయంలో మన పార్టీ సన్నద్ధం కావాలి.

**సోషల్ మీడియాలో చురుగ్గా ఉండాలి**

ఇప్పుడున్నది సోషల్ మీడియా కాలం. ఇది నియోజకవర్గ ఇన్ ఛార్జ్ నుంచి గ్రామస్థాయి లీడర్ వరకు ధ్యాస పెట్టాల్సిన అంశం. ఇవాళ మనం యుద్ధం చేసేది చంద్రబాబుతోనే కాదు. ఒక చెడిపోయిన వ్యవస్థతో యుద్ధం చేస్తున్నాం. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5తో, టీడీపీ తప్పుడు సోషల్ మీడియాలతో యుద్ధం చేస్తున్నాం. వాళ్లే అబద్ధాలు సృష్టిస్తున్నారు. తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు.

అందుకే మనం అంతకన్నా బలంగా తయారు కావాలి. ప్రతి గ్రామంలోనూ పార్టీ కమిటీలన్నీ సోషల్ మీడియాకు అనుసంధానం కావాలి. కమిటీల్లోని ప్రతి ఒక్కరూ వాళ్ల సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉండాలి. మీ పేజీలను మీరే నడపాలి. ఫేస్‌బుక్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ పేజీలు తయారు చేసుకోవాలి. గ్రామస్థాయి నుంచి ప్రతి ఒక్కరూ ఆయా మాధ్యమాల్లో మీ అకౌంట్, మీ పేజీలు నిర్వహించాలి.

ఎప్పుడైతే మీరు మీ పేజీలు నడుపుతారో.. గ్రామస్థాయిలో జరుగుతున్న అన్యాయాలను మనం ఎండ గట్టగలుగుతాం. అలాగే నియోజకవర్గ స్థాయిలో కూడా జరుగుతున్న అన్యాయాలు, ఆకృత్యాలు కూడా చూపించగలగాలి.

రెండో వైపున పార్టీ సందేశాలు కూడా గ్రామస్థాయికి వెళ్లాలి. ఇదంతా సోషల్ మీడియా ద్వారా జరగాలి. ఇది చాలా సవాల్‌తో కూడిన కార్యక్రమం. వచ్చే రోజుల్లో దీనిపై బాగా దృష్టి పెట్టాలి. ఇది చేయగలిగే వ్యవస్థ మనకుంది. దీనిపై తగిన ధ్యాస పెట్టాలి. దేశంలో అత్యంత బలమైన పార్టీగా వైయస్సార్ కాంగ్రెస్‌ను తయారు చేయాలి.

రీజినల్ జనరల్ సెక్రటరీలను తీసుకొచ్చే కార్యక్రమం కూడా జరుగుతుంది. నియోజకవర్గాల్లో ఇన్‌ఛార్జ్‌ల పనితీరుపైనా మదింపు ఉంటుంది. రిపోర్టుల ప్రకారం నిర్ణయాలు ఉంటాయి. బాగా పని చేసే వారికీ రేటింగ్స్ ఇవ్వడం జరుగుతుందని వైయస్ జగన్ వివరించారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 18, అక్టోబర్ 2024 ||



## మార్గదర్శకుడు వాల్మీకి మహర్షి

◆ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

**సత్తెనపల్లి, మహానాడు:** మూల రామాయణ రచయిత, సర్వ ప్రజానీకానికి మార్గదర్శకుడు మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా అందరికీ సత్తెనపల్లి నియోజకవర్గ శాసన సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి ఉంటే మనుషులు ఋషులవుతారని లోకానికి చాటిన ఆ మహా పురుషుని జయంతిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా జరుపుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఆదర్శ జీవితాన్ని గడపడానికి మానవులు ఆచరించాల్సిన ధర్మాలన్నిటినీ శ్రీ రామాయణ మహాకావ్యంలో పొందు పరచిన ఆదికవి వాల్మీకి జయంతిని సాంస్కృతిక ఉత్సవంగా జరుపుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వాల్మీకి



మహర్షి విగ్రహానికి పూలమాల వేసి, ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బొర్రా అప్పారావు, పలువురు నేతలు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైయస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ముదునూరి మురళీకృష్ణంరాజు అమలాపురం నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడిగా కూడా ఉన్న మురళీకృష్ణంరాజు



కొమురం భీమ్ వర్ధంతి సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. కొమురం భీమ్ చిత్రపటానికి నివాలు అర్పించిన మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, తదితరులు.



ఏపీ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్‌ని ఏపీ, సెక్రటేరియట్, వెలగపూడి నందు కలిసిన శ్రీ శృంగేరి శారదా పీఠం ప్రతినిధులు, శ్రీ విదుశేఖర భారతి మహా స్వామి వారి రానున్న నవంబరు-2024 విజయయాత్ర గురించి వివరించారు, స్వామి వారి యాత్రలో పాల్గొని ఆశీస్సులు పొందవలసిందిగా ఆహ్వానించారు.




వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించిన మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైయస్ జగన్



తంబళ్లపల్లి నియోజకవర్గం కురబలకోట మండలం, తుమ్మచట్లవారిపల్లె సిసి రోడ్డును ప్రారంభించిన తంబళ్లపల్లె నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ దాసరిపల్లి జయచంద్ర రెడ్డి



పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలలో భాగంగా యర్రగొండపాలెం మండలం నర్సాపాలెం గ్రామంలో 20 లక్షలు, చిన్న బోయలపల్లి గ్రామంలో 20 లక్షల రూపాయలతో నిర్మించనున్న సీసీ రోడ్డుల పనులకు యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు



పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రూ.3.20 కోట్ల నిధులతో నూతన సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి భూమిపూజ

## 'సాక్షి' తప్పుడు రాతల మూల్యం రూ.75 కోట్లు?

◆ జగన్ మీడియాపై కొనసాగుతున్న నారా లోకేష్ న్యాయపోరాటం

◆ తాను వేసిన పరువునష్టం కేసులో మరోసారి క్రాస్ ఎగ్జామినేషన్

◆ 18న విశాఖ 12వ అదనపు జిల్లా కోర్టులో విచారణకు హాజరు కానున్న మంత్రి

**అమరావతి, మహానాడు:**

చినబాబు చిరుతిండి.. 25 లక్షలండి పేరుతో 'సాక్షి'లో అచ్చేసిన కథనంపై నారా లోకేష్ తన న్యాయపోరాటం కొనసాగిస్తున్నారు. ఉద్దేశపూర్వకంగా తన పరువు ప్రతిష్ఠలకు భంగం కలుగజేసేందుకు ఆ కథనం అవాస్తవాలతో వేశారని, రూ.75 కోట్లకు పరువునష్టం కేసుని నారా లోకేష్ తరఫున సీనియర్ న్యాయవాది దొద్దాల కోటేశ్వరరావు విశాఖ 12వ అదనపు జిల్లా న్యాయస్థానంలో దాఖలు చేశారు. కేసు విచారణ వివిధ దశలు దాటుకుని ఆగస్టు 29న లోకేష్ క్రాస్ ఎగ్జామినేషన్ జరిగింది. మరోసారి క్రాస్ ఎగ్జామినేషన్ 18వ తేదీ శుక్రవారం జరగనుండడంతో మంత్రి నారా లోకేష్ కోర్టుకి హాజరు కానున్నారు.

చినబాబు చిరుతిండి.. 25 లక్షలండి శీర్షికతో 2019 అక్టోబర్ 22న సాక్షిపత్రికలో కల్పిత కథనం ప్రచురించారు. దీనిపై తెలుగుదేశం పార్టీ(టీడీపీ) జాతీయ ప్రధాన కార్యదర్శి



నారా లోకేష్ తన న్యాయవాదుల ద్వారా రిజిస్టర్ నోటీసుని సాక్షికి పంపించారు. సాక్షి ఎటువంటి వివరణ వేయకపోవడం, నోటీసులకు స్పందించకపోవడంతో సాక్షిపై రూ.75 కోట్లకు పరువునష్టం దావా వేశారు. సాక్షిలో ప్రచురించిన తేదీల్లో అసలు తాను విశాఖలోనే లేనని, ఉద్దేశపూర్వకంగా తనను అభాసుపాలు చేసేందుకు వండివార్చిన కథనం అని తేలిందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. మంత్రిగా విశాఖపట్నం చాలాసార్లు వచ్చినా, ఎయిర్ పోర్ట్‌లో ఎటువంటి ప్రోటోకాల్ సౌకర్యాలుతాను స్వీకరించలేదని, తప్పుడు కథనం రాసి తన పరువుకి భంగం కలిగించిన సాక్షిపై చర్యలు తీసుకోవాలని లోకేష్ కోరుతున్నారు.

## వైసీపీ- కూటమి పాలనకు మధ్య తేడా అభివృద్ధే చెబుతుంది

◆ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

**పిట్టంబండ, మహానాడు:**

రాష్ట్రంలో వైసీపీ – కూటమి ప్రభుత్వాల మధ్య తేడా ఏమిటో నాలుగు నెలలుగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలే చెబుతున్నాయని తెలుగుదేశం పార్టీ(టీడీపీ) సీనియర్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. రోడ్ల విషయంలో, పల్లెల అభివృద్ధి విషయంలో అయిదేళ్లుగా ఏం జరిగిందని ప్రజలే బేరీజు వేసుకుంటారన్నారు. గుంతలు పడిన రోడ్లలో జనం ప్రాణాలు పోతున్నా తట్టెడు మట్టివేయని జగన్ – వస్తూనే వేల కిలోమీటర్ల మేర రోడ్ల దిశ మారుస్తున్న చంద్రబాబు పాలనకు మధ్య తేడా ఏ ఊరికి వెళ్లినా కనిపిస్తుందన్నారు.

వినుకొండ మండలం ఏనుగుపాలెం, పిట్టం బండలో ఎమ్మెల్యే పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

ఏనుగుపాలెంలో రూ.14 లక్షలతో సీసీ రహదారులు, డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నట్టల నివారణ కార్యక్రమంలో భాగంగా గొర్రెలకు నట్టల నివారణ మందు వేశారు. అనంతరం పిట్టంబండలో సీసీ రహదారులు, డ్రైన్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన వైసీపీ ప్రభుత్వంలో అర్హత ఉన్నప్పటికీ



2.30 లక్షలమంది పింఛన్లను జగన్‌రెడ్డి తొలగించారని విమర్శించారు.

ఈ కార్యక్రమంలో నిశంక్కర శ్రీనివాసరావు, వినుకొండ రూరల్ మండలం మండల పార్టీ అధ్యక్షులు మాదినేని ఆంజనేయులు, క్లస్టర్ ఇంచార్జ్ మద్దూకూరి రామబ్రహ్మం, వజ్రాల కృష్ణ రెడ్డి, మక్కెన కొండలు, మూతినేని ఏడుకొండలు, కర్నాటి వెంకట రెడ్డి, వీరగంధం ఆనంద్, మాదల చిరంజీవి, మాదల కృష్ణ, బోడేపూడి గోవింద రాజులు, కానాల వెంకటేశ్వర రెడ్డి, ఎర్రంరెడ్డి అంజిరెడ్డి, రామినేని రామాంజనేయులు, గ్రామ పార్టీ అధ్యక్షులు గ్రామ నాయకులు కార్యకర్తలు, ధ్వమా పీడీ సిద్ధి లింగ మూర్తి, గవర్నమెంట్ అధికారులు పాల్గొన్నారు.

## కాకాణి అండ్ బ్యాచ్... ఆ ఇళ్ళ సంగతేంటి?

◆ పేదల ఇళ్ళ పేరిట బొక్కిన ప్రతి రూపాయి కక్కిస్తాం..

◆ శాసన సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆగ్రహం

**సర్వేపల్లి, మహానాడు:**

పేదల ఇళ్ళ నిర్మాణాల్లో అంతులేని అవినీతి చోటుచేసుకుందని, జగనన్న కాలనీలు అన్నారు సరే.....ఇళ్లలోకి పోవడానికి ప్రజలకు ఈత నేర్పించాలి కదా అని సర్వేపల్లి శాసన సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఆయన వెంకటాచలంలో జగనన్న కాలనీ పేరుతో ఇళ్ళు నిర్మించిన ప్రాంతాన్ని పరిశీలించిన సందర్భంగా మీడియాతో ఏమన్నారంటే..

ఒక మోస్తారు వర్షానికే పరిస్థితి ఇలా ఉంటే వర్షాలు ఎక్కువైతే ఎలా ఉంటుందో.. కాలనీల పేరుతో కోట్లు గడించిన కాకాణి అండ్ బ్యాచ్ ఒక్కసారి ఈ ఇళ్ల మరుగుదొడ్డిలోకి వెళ్ళగలరా? పేదల ఇళ్ళ పేరుతో మెక్కిన వారి నుంచి ప్రతి రూపాయి కక్కిస్తాం.. ఈ విషయంలో రాజీ ప్రసక్తే లేదు.

అత్యంత నాసిరకంగా కట్టిన ఇళ్ల దుస్థితిని చూసి ఆవేదన కలుగుతోంది. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో పాటు నిర్దేశిత ప్రమాణాల కంటే అత్యంత దారుణంగా నిర్మాణాలు ఉన్నాయి. జగనన్న కాలనీల పేరుతో పేదలకు అత్యంత నాసిరకంగా ఇళ్ళు నిర్మించారు. శ్లాబులో మందం తగ్గిపోయింది...స్టీల్ రాడ్ల ఏర్పాటులోనూ చేతివాటం ప్రదర్శించారు. ఇంటి నిర్మాణంలో కీలకమైన పునాదుల



నిర్మాణంలోనూ అంతా మోసమే. పార్టీషియన్ వాల్ నిర్మాణంలోనూ వెడల్పు తగ్గించేశారు.

### కాలనీల పేరుతో కోట్లు గడించిన కాకాణి అండ్ బ్యాచ్!

పేదలంటే అంత అలుసా...ఇంత దారుణమైన వ్యక్తులను ఎప్పుడూ చూడలేదు. ఒక్క ఈ కాలనీలోనే రూ.20.50 లక్షలతో మట్టి తోలినట్టు బిల్లులు చేసుకున్నారు. ఒక్కో లబ్ధిదారుడి వద్ద ఇంటికి రూ.40 వేల వరకు అదనంగా గుంజుకున్నారు. చివరకు మరుగుదొడ్లను కూడా వదిలిపెట్టకుండా అవినీతికి పాల్పడ్డారు. నాలుగైదు అడుగుల ఎత్తులోనే మరుగుదొడ్డి నిర్మించడం దుర్మార్గం. ఇళ్ళ నిర్మాణంలో జరిగిన అవినీతిని ఇప్పటికే సీఎం చంద్రబాబు నాయుడి దృష్టికి తీసుకెళ్ళాను. సీఎం చంద్రబాబు నాయుడి ఆదేశాలతో ఇప్పటికే విజిలెన్స్ విచారణ జరుగుతోంది. జిల్లా ఉన్నతాధికారులు కూడా ఈ అక్రమాల మీద స్పందించి పేదల ఇళ్ళ పేరుతో దోచుకున్న కోట్ల రూపాయలను అక్రమార్కుల నుంచి కక్కించి వారిని జైలులో పెట్టాలి.

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కన్నా శంకుస్థాపనలు

**సత్తెనపల్లి, మహానాడు:**

వచ్చే ఐదేళ్లలో సత్తెనపల్లి నియోజకవర్గంలోని గ్రామాల్లో సీసీ రోడ్లు పూర్తి చేస్తామని శాసన సభ్యుడు కన్నా లక్ష్మీ నారాయణ తెలిపారు. పల్లె పండుగ పంచాయతీ వారో త్సవాల్లో పాల్గొన్న ఆయన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, మాట్లాడారు. రాష్ట్రంలో మళ్లీ పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేసి, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సంకల్పించామని, మ్యానిఫెస్టోలో ఇచ్చిన ప్రతి అంశాన్ని నెరవేర్చి తీరుతామని, పేదలకు, రైతులకు, మహిళా సంక్షేమానికి ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నకరికల్లు మండలం, రూపేనగుంట్ల గ్రామంలో రూ.10 లక్షలు, దేచవరం గ్రామంలో రూ.10 లక్షలు కండ్లగుంట రూ. 8 లక్షలు, చీమలమర్రి రూ. 8 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్లకు, రూ. 2 లక్షల విలువైన రెండు గోకులం షెడ్స్ పనులకు



శంకుస్థాపన చేశారు. అనంతరం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలల్లో నట్టల నివారణ కొరకు మందులు పంపిణీ చేశారు.



## సీఆర్ ఫౌండేషన్ సేవలు మరింత విస్తరిస్తాం

◆ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ నారాయణ

**చల్లపల్లి, మహానాడు:**

చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ సేవలు మరింత విస్తరించి పేద ప్రజలకు అందుబాటులో తెచ్చేందుకు కృషి చేస్తున్నట్టు ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ కె.నారాయణ పేర్కొన్నారు. కృష్ణాజిల్లా చల్లపల్లిలోని చంద్ర రాజేశ్వర రావు వికాస కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. అక్కడ జరుగుతున్న సేవా కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని కొండాపూర్‌లో ఐదు ఎకరాల విస్తీర్ణంలో సి.ఆర్ ఫౌండేషన్ నడుస్తుందని తెలిపారు. 85 గదులు, రెండు డార్మెటీరిలలో పేదవారికి ఆరోగ్య కేంద్రాలను, ఉపాధి శిక్షణ కేంద్రాలను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

రాష్ట్రం విడిపోయిన నేపథ్యంలో ఆంధ్ర రాష్ట్రంలో సీఆర్ ఫౌండేషన్ స్థాపించి ఇక్కడ కూడా సేవలను విస్తరించనున్నట్టు పేర్కొన్నారు. సిఆర్ ఫౌండేషన్‌కు అనుసంధానం చేసి అభివృద్ధి చేసే దిశగా ఆలోచన చేస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు అక్కినేని చంద్రరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, మహిళా సమైక్య జిల్లా నాయకులు మల్లు పెద్ది రత్నకుమారి, కంఠం నేని జ్యోత్స్న దేవి, పార్టీ నాయకులుమల్లు పెద్ది అజయ్, మల్లు పెద్ది బోసు, కొల్లూరి శ్రీధర్, నాగమల్లి, గంగాధర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకి మహర్షి కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తాం

◆ ఎమ్మెల్యే అమిలినేని

**కళ్యాణదుర్గం, మహానాడు:**

మహర్షి శ్రీ వాల్మీకి భగవానుడి జయంతి వేడుకల్లో ఇంత మంది వాల్మీకి సోదర సోదరీమణులు మధ్య పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నాని ఎమ్మెల్యే



అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు. వాల్మీకి సోదరులతో కలిసి వాల్మీకి కూడలిని మరింత అభివృద్ధి చేసి చక్కని ఆహ్లాదకరమైన సర్కిల్ గా తీర్చిదిద్దుతామని, అలాగే వాల్మీకి మహర్షి కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే ప్రకటించారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పట్టణం వాల్మీకి సర్కిల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వాల్మీకి జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మహర్షి వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం వాల్మీకి సీనియర్ నాయకులకు ఎమ్మెల్యే ఘన సన్మానం చేశారు.

## పూరీ శ్రీక్షేత్రంలో సేవలకు ఓంఫెడె నెయ్యి

**పూరి, మహానాడు:**




పూరీ శ్రీక్షేత్రంలో జగన్నాథుని సన్నిధిలో 'ఓంఫెడ్' నెయ్యి దీపాలు మాత్రమే వెలిగించాలి. మహాప్రసాదం (ఒబడా), ఇతర ప్రసాదాలన్నింటికీ దీనినే వినియోగించాలి. ఇతర కంపెనీల నెయ్యి స్వామి సేవలకు వినియోగించరాదు అని ఆలయ పాలనాధికారి అరవిందపాడి స్పష్టం చేశారు. కల్తీకి తావులేని ఓంఫెడ్ నెయ్యి మినహా ఇతర కంపెనీల నెయ్యి ఉపయోగించొద్దని సేవా యత్లకు పాలనాధికారి ఆదేశించారు. పూరీలో ఈమేరకు ఓంఫెడ్ నెయ్యిడిపో ప్రారంభించాలని కోరారు.



ప్రభుత్వం చేపట్టిన పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా ఫిరంగిపురం మండలం వేములూరిపాడు గ్రామంలో గురువారం సీసీ రోడ్లు నిర్మాణ పనులకు తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మంగళగిరి రూరల్ పోలీసులతో వాగ్వివాదానికి దిగిన మాజీ ఏజీ పొన్నవలు సుధాకర్ రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డితో తనను పంపించాలని రూరల్ ఎస్సై వెంకట్‌తో వాదన

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 18, అక్టోబర్ 2024



## వైసీపీ పరిపాలనలో హీనస్థితికి చేరిన పల్లెలు

- **అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్**

మోపిదేవి,మహానాడు:

వైసీపీ పరిపాలనలో హీనస్థితికి చేరిన పల్లెలకు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో పండుగ కళ వచ్చిందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. గురువారం మోపిదేవి మండలంలో పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాలు పురస్కరించుకొని మోపిదేవి మండలంలో రూ.ఐదు కోట్ల 63 లక్షల 20 వేలతో 8,899 మీటర్ల పొడవైన 86 సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ శ్రీకారం చుట్టారు.



మోపిదేవి గ్రామంలో రూ.కోటి 19లక్షలతో పన్నెండు సీసీ రోడ్లు, పెద్దప్రోలు గ్రామంలో రూ. 35. 10లక్షలతో పన్నెండు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పెద్దప్రోలు సభలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులు కూడా వెనక్కి తీసుకుందని, కరెంట్ బిల్లులు కూడా చెల్లించకుండా పంచాయతీలను అప్పల పాలు చేసిందని తెలిపారు.

## గజల్ శ్రీనివాస్ గానం చేసిన ఇతిహాస ఆడియోలు ఆవిష్కరించిన శ్రీ అవిముక్తేశ్వరానంద సరస్వతి

తిరువనంతపురం, మహానాడు:




డాక్టర్ గజల్ శ్రీనివాస్ స్వరపరచి, గానం చేసిన పోతన విరచిత భాగవతంలోని ముఖ్య 108 పద్యాలు, కవిత్రయం రచించిన ఆంధ్ర మహాభారతంలోని ముఖ్య 108 పద్యాలు, డాక్టర్ ముకుంద శర్మ రాసిన గేయ రామాయణాల ఆడియోలను ఉత్తరాఖండ్ జ్యోతిర్ మఠ్ శంకరాచార్య శ్రీ అవిముక్తేశ్వరానంద సరస్వతి స్వామి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం తిరువనంతపురం(కేరళ) శ్రీ పద్మనాభ స్వామి వారి ఏకాంత దర్శన అనంతరం వేలాది మంది భక్తుల సమక్షంలో జరిగింది. భారతీయ సనాతన ధర్మంలో అతి ముఖ్యమైన రామాయణ, భారత, భాగవతాల తెలుగు ఆడియోలను ఒకే రోజు ఆవిష్కరించడం అతి గొప్ప ధార్మిక కార్యక్రమం అని, వీటిని స్వరపరచి సందర్భ , తాత్పర్య సహితంగా అందరికీ అర్ధమయ్యేలా గానం చేసిన గజల్ శ్రీనివాస్ అభినందనీయుడని శ్రీ శంకరాచార్య ప్రశంసించారు. ఆడియో తొలి ప్రతులను సి.ఎల్.రాజం దంపతులకు, మిజోరమ్ పూర్వ గవర్నర్ కుమ్మనం రాజ శేఖర్ లకు స్వామి వారు అందించారు.

## పిచ్చి ప్రేలాపనలు మాని చేప పిల్లల పంపిణీపై దృష్టి సారించండి

- **మాజీ మంత్రి హరీష్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్‌పై తప్పుడు వ్యాఖ్యలు చేయడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఫిషరీస్ కార్పొరేషన్ మాజీ ఛైర్మెన్ పిట్టల రవీందర్**

హైదరాబాద్,మహానాడు:



కొత్తగా పదవిలోకి వచ్చిన ఫిషరీస్ కార్పోరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ గా పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నరు.చేప పిల్లల పంపిణీ ప్రక్రియ మీద దృష్టి పెట్టడం మానేసి అవాకులు, చెవాకులు పేలుతున్నారు. హరీశ్ రావు, తలసాని మీద వ్యాఖ్యలు చేస్తే వార్తల్లో నిలవచ్చనే ఉద్దేశ్యంతో అడ్డగోలుగా మాట్లాడు తున్నారు.

అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపుతున్న హరీశ్ రావు మీద వ్యాఖ్యలు చేసే స్థాయి నీది కాదన్న విషయం గుర్తించు. చేపల పంపిణీని ఆలస్యం చేసి, చేతగాని తనాన్ని కప్పిపుచ్చుకునేందుకు లేనిపోని నిందలు వేస్తున్నారు.

కుంటి సాకులు వెతుకుతున్న మీ పాలన విధానంపై మత్స్యకార కుటుంబాలు దుమ్మెత్తి పోస్తున్నా చీమ కుట్టినట్లైనా లేకపోవడం సిగ్గుచేటు.

60ఏళ్ల సమైక్య పాలనలో తెలంగాణ మత్స్యరంగం దారుణ వివక్షకు గురైతే, కేసీఆర్ గారు పదేళ్ల పాలనలో మత్సరంగాన్ని అభివృద్ధికి దేశానికి ఆదర్శంగా నిలిపారు.

తెలంగాణ మత్స్య సంపద విలువ 2014-15లో 2,60,010 టన్నులు కాగా, 2023-24లో 4,39,513 టన్నులు. తెలంగాణ మత్స్యకారుల ఆదాయం నాడు రూ. 2,431 కోట్లు కాగా, 2023-24 నాటికి రూ. 6,514 కోట్లు.

ఇవి మేము చెబుతున్న లెక్కలు కాదు, మీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేసిన 'తెలంగాణ స్టేట్ ఎట్ ఎ గ్లాన్స్ - 2024 నివేదికలోని పేజీ నెంబర్ 45లో పేర్కొన్న లెక్కలు.

ఇది బీఆర్ఎస్ ఘనత, ఇది కేసీఆర్ సాధించిన విజయం. చెరిపేస్తే చెరిగిపోని సత్యాలు ఇవి. మత్స్య రంగం పై ఆధారపడి జీవిస్తున్న సోదరులకు అనుభవంలో ఉన్న వాస్తవం.

చేపల ఉత్పత్తిని పెంచి నీలి విప్లవానికి నాంది పలికారు కేసీఆర్. కానీ, పది నెలల్లోనే ఆ ఖ్యాతికి మకిలి పట్టించే ప్రయత్నం చేశారు. మత్స్య రంగానికి ఎంతో ప్రాధాన్యమిచ్చి మత్స్య రంగంపై ఆధార పడ్డ కుటుంబాలకు భరోసా ఇచ్చారు.

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నూతన రిజర్వాయర్ల నిర్మాణం, బ్యాక్ వాటర్ పెంపు జరగగా, మిషన్ కాకతీయ ద్వారా చెరువులను పునరుద్ధరించారు.

రాష్ట్రంలోని మత్స్యసహకార సంఘాలను బలోపేతం చేసారు. 33 కొత్త జిల్లాల వారీగా మత్స్య సహకార సంఘాలు ఏర్పాటు చేశారు. 25గా ఉన్న సొసైటీలను అడ్డుగా ఉన్న నిబంధనలు తొలగించి 6,500కు పెంచారు. సభ్యుల సంఖ్యను నాలుగు లక్షలకు పెంచారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మత్స్య రంగానికి గ్రహణం పట్టింది. కుటుంబాలు ఆవేదన చెందుతున్నాయి. పది నెలల కాంగ్రెస్ పాలన వల్ల ఈ రంగానికి స్మశాన వైరాగ్యం పీడిస్తున్నది.

ఎన్నికల హామీలు అమలు చేయరు. బిఆర్ఎస్ ప్రభుత్వం మొదలు పెట్టిన పథకాలను కొనసాగించరు, కానీ ఇష్టం ఉన్నట్లు నోరుపారుసుకుంటరు.

ప్రజా పాలన అంటూ, అప్రజాస్వామిక పాలన కొనసాగిస్తున్నారు. హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్ మీద అడ్డగోలుగా మాట్లాడినందుకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నా.పిచ్చి ప్రేలాపనలు మాని చేప పిల్లల పంపిణీ పై దృష్టి సారించాలని, లేదంటే మత్స్య కుటుంబాల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరిస్తున్నా.



## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే చదలవాడ శంకుస్థాపనలు

రొంపిచర్ల, మహానాడు:

మండలం మాచవరం కొత్తపల్లి, కర్లకుంట గ్రామల్లో గురువారం జరిగిన పల్లె పండుగ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొన్నారు. గ్రామంలో సీసీ రోడ్డులు, సైడ్ కాలువల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గోనుగుంట్ల కోటేశ్వరరావు, రంగిశెట్టి రామకృష్ణ, పులుకూరి జగ్గయ్య, మొండితోక రామారావు, శాఖమూరి రామూర్తి, గడిపార్తి సురేష్, వడ్లమూడి కిషోర్, కూరపాటి శ్రీనివాసరావు, లింగ అనంత రామయ్య అంకమ్మ చౌదరి, మండలం టీడీపీ కూటమి నేతలు, కార్యకర్తలు, మహిళలు, ప్రభుత్వ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పల్లె పండుగతో గ్రామీణాభివృద్ధికి శ్రీకారం

- **82 లక్షలతో అభివృద్ధి పనులకు శంఖుస్థాపన.**
- **రోడ్లు,డ్రైన్ల నిర్మాణాలలో నాణ్యతా ప్రమాణాలు పాటించండి.**
- **పల్లెటూళ్లకు పూర్వ వైభవం.**
- **ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి**

కోవూరు,మహానాడు:

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో పల్లెటూళ్ళు ప్రగతిబాట పట్టనున్నాయన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. రాష్ట ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్లె పండుగ పల్లె పండుగ కార్యక్రమంలో పాల్గొనేందుకు మైపాడు గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కి పడమర పాళెం మత్స్యకారులు ఘన స్వాగతం పలికారు.

మత్స్యకార సంఘాలకు చెందిన పెద్ద కాపులు శాలువాలు పూల బొకేలతో సన్మానించారు. పడమరపాలెం మత్స్యకార కాలనీలో నిర్మిస్తున్న బంగారమ్మ ఆలయ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం 10 లక్షల వ్యయంతో మైపాడు గ్రామంలో సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణం మరియు 82 లక్షల రూపాయల వ్యయంతో ఇందుకూరు పేట మండలం లోని వివిధ



గ్రామాలలో జరగనున్న అభివృద్ధి పనులకు ఆమె శంఖుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఆగష్టు 23 వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన గ్రామసభల ద్వారా తీర్మానాలు చేసి 13 వేల 326 గ్రామ పంచాయితీల్లో 4,500 కోట్లతో 30 వేల అభివృద్ధి పనులు చేస్తూ పల్లెలకు పూర్వవైభవం తెచ్చే దిశగా కృషి చేస్తోందన్నారు.

కాంట్రాక్టర్ల ప్రమేయం లేకుండా గ్రామస్థులే నాణ్యతా ప్రమాణాలు పాటించి అభివృద్ధి పనులు చేసుకోవాలని సూచించారు. రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షి జయంతిని రాష్ట పండుగగా ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి ఆమె ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ నాగేంద్ర రెడ్డి, పంచాయతీ రాజ్ ఏ ఇ ఖాదర్ మస్తాన్, టీడీపీ మండల అధ్యక్షులు రావెళ్ల వీరేంద్ర నాయుడు, సీనియర్ నాయకులు దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, మండల టిడిపి నాయకులు కైలాసం ఆదిశేషారెడ్డి, చెంచు కిషోర్ యాదవ్, టిడిపి రాష్ట ముదిరాజ్ సంఘ అధ్యక్షులు పి ఎల్ రావు, బిజెపి సీనియర్ నాయకులు దువ్వూరు రాధాకృష్ణా రెడ్డి, జనసేన నాయకులు గుడి హరికుమార్ రెడ్డి, టిడిపి నాయకులు బెజవాడ వంశీ కృష్ణా రెడ్డి, కోడూరు కమలాకర్ రెడ్డి మత్స్యకార సంఘాల పెద్ద కాపులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ చాటే క్రీడాకారులకు అండగా ఉంటా

- **మాజీ మంత్రి తలసాని భరోసా**

హైదరాబాద్,మహానాడు:

ప్రతిభను చాటే క్రీడాకారులకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ అవసరమైన సహాయ సహకారాలను అందిస్తామని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు.

గురువారం వెస్ట్ మారేడ్ పల్లిలోని కార్యాలయంలో ఇంటర్నేషనల్ కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన మహేష్ వైష్ణవి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి తనకు లభించిన మెడల్స్ ను చూపించింది. ఈ సందర్భంగా మహేష్ వైష్ణవి ని ఆయన అభినందించారు.



ఈ నెల 4 నుండి 13 వ తేదీ వరకు సౌత్ ఆఫ్రికా లోని సన్ సిటీ లో జరిగిన పోటీలలో సుమారు 30 దేశాలకు చెందిన 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారని ఆమె వివరించారు. 84 కిలోల విభాగంలో గోల్డ్ మెడల్ తో పాటు స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ ద చాంపియన్ షిప్ మెడల్ కూడా లభించిందని చెప్పారు.

తనకు మొదటి నుండి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, యువ నాయకులు తలసాని సాయి కిరణ్ యాదవ్‌లు అన్ని విధాలుగా అండగా ఉంటూ ప్రోత్సహించడం వల్లనే తాను ఈ మెడల్స్ ను సాధించగలిగానని కృతజ్ఞతలు తెలిపింది. తనపై ఎంతో నమ్మకంతో కామన్వెల్త్ పోటీలకు హాజరుకావడానికి ఆర్ధిక సహకారం అందించిన విషయాన్ని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేసింది.

## అధికారులపై వైసీపీ బ్లాక్‌మెయిల్ రాజకీయాలు!

- **ప్రత్తిపాటి పుల్లారావు ఆరోపణ**

ఎండుగుంపాలెం, మహానాడు: ఎన్నికల్లో 151 నుంచి 11 సీట్లకు కుప్పకూలిపోయినా చేసిన తప్పులు తెలుసుకోని జగన్, వైసీపీ నాయకులు అధికారులపై బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు దిగుతున్నారని మాజీ మంత్రి, తెలుగు దేశం పార్టీ(టీడీపీ) చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మండిపడ్డారు. త్వరలో ఎన్నికలంటూ కలల్లో విహరిస్తూ అదే బూచీతో దొంగదారుల్లో అధికారులను లొంగదీసుకోవాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా చిలకలూరిపేట మండలం గోపాళంవారిపాలెం, నాదెండ్ల మండలం ఎండుగుంపాలెంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు భూమి పూజ చేశారు.

గోపాళంవారిపాలెంలో కోటి రూపాయలతో 4 కిలో మీటర్ల మేర ఆర్ అండ్ బి రహదారి, రూ.15 లక్షలతో సీసీ రహదారులు, డ్రైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఎండుగుంపాలెంలో రహదారులు, డ్రైన్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. రూ.55 లక్షల వ్యయంతో ఎండుగుంపాలెం నుంచి అప్పాపురం వరకు డొంకరోడ్డు పునరుద్ధరణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. రహదారుల నిర్మాణాలకు నిధులు విడుదల చేసిందన్నారు.



## స్వర్ణకారుల 60 ఏళ్ళ కల నెరవేర్చారు

- **కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం**
- **మంత్రి లోకేష్‌కు లక్ష్మీ నరసింహ గోల్డ్ స్మిత్ వెల్ఫేర్ సొసైటీ కృతజ్ఞతలు**

అమరావతి, మహానాడు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటుచేసి స్వర్ణకారులను ఆదుకుంటామని మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీని మంత్రి నారా లోకేష్ నిలబెట్టుకున్నారు. ఈ మేరకు కార్పొరేషన్ ఏర్పాటుపై మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు కృషిచేసిన మంత్రి నారా లోకేష్‌ను మంగళగిరికి చెందిన లక్ష్మీనరసింహ గోల్డ్ స్మిత్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

కేట్ కట్ చేయించి తమ ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం మంత్రిని శాలువాలతో సత్కరించారు. స్వర్ణకారుల 60 ఏళ్ళ కలను మంత్రి నారా లోకేష్ నెరవేర్చారని హర్షం వ్యక్తం చేశారు. మంత్రి చొరవతో దేశంలోనే మూడో స్వర్ణకార కార్పొరేషన్ రాష్ట్రంలో ఏర్పాటుకానుంది. మంగళగిరిలో నారా లోకేష్ చేతులమీదుగా లక్ష్మీ నరసింహ గోల్డ్ స్మిత్ వెల్ఫేర్ సొసైటీ ఏర్పాటైంది. ప్రతిపక్షంలో ఉండగానే స్వర్ణకారులకు అవసరమైన వివిధ పరికరాలను అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటుకు సంబంధించి అందరూ కలిసి కూర్చొని విధివిధానాలు రూపొందించాలని కోరారు. మంగళగిరిని గోల్డ్ హబ్‌గా రూపొందిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులతో పాటు పెద్దఎత్తున స్వర్ణ కార్మికులు పాల్గొన్నారు.



వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా రాజేష్ రెడ్డి బాధ్యతలను తీసుకున్న సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో కలిసి పాల్గొన్న శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతి జాయిన్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు రమేష్ ముదిరాజ్ తదితరులు...



మహబూబ్ నగర్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ నాయకులపై అక్రమ కేసులు పెడుతున్న పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డీజీపీ జితేందర్ ఐపిఎస్‌కి తెలంగాణ శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదన చారి, మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, సర్పంచ్‌ల సంఘం జేఏసి అధ్యక్షులు యాదగిరి కలిసి వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది.



## ఇప్పుడు న్యాయానికి కళ్లున్నాయ్

న్యాయదేవత కళ్లకు గంతలు తొలగిపోయాయి. అవును మీరు చదువుతుంది నిజమే. ఇన్నాళ్లూ భారతదేశంలో న్యాయ దేవత విగ్రహం కళ్లకు గంతలు ఉండేవి.

ఇకపై న్యాయదేవత కళ్లకు గంతలు ఉండకూడదని దేశ అత్యున్నత ధర్మాసనమైన సుప్రీం కోర్టు నిర్ణయించింది. ఆ నిర్ణయానికి అనుగుణంగా.. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవైచంద్రచూడ్ ఆదేశాలతో సుప్రీం కోర్టులో కొత్తగాన్యాయదేవత విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

అత్యున్నత ధర్మాసనంలో ఏర్పాటు చేసిన న్యాయదేవత విగ్రహం కళ్లకు గంతలు లేకపోవడంతో ఈ అంశం వార్తల్లో నిలిచింది. అంతేకాదు.. ఇన్నాళ్లూ న్యాయ దేవత రెండు చేతుల్లో.. కుడి చేతిలో న్యాయానికి ప్రతిబింబంగా నిలిచే త్రాసు, ఎడమ చేతిలో ఖడ్గం ఉండేవి. సుప్రీం కోర్టులో కొత్తగా ఏర్పాటు చేసిన న్యాయ దేవత విగ్రహం ఎడమ చేతిలో ఖడ్గానికి బదులుగా రాజ్యాంగం ఉండటం గమనార్హం.

సుప్రీం కోర్టులోని జడ్జీల లైబ్రరీలో ఈ విగ్రహాన్ని ఉంచారు. న్యాయం గుడ్డిది కాదని, చట్టానికి కళ్లున్నాయని బలమైన సంకేతమిచ్చే ఉద్దేశంతోనే న్యాయదేవత విగ్రహంలో సుప్రీం కోర్టు ఈ మార్పులుచేర్పులు చేసింది. అయితే ఇన్నాళ్లూ న్యాయదేవత విగ్రహం కళ్లకు గంతలు కట్టడం, చేతిలో ఖడ్గం ఉంచడం వెనక కారణం లేకపోలేదు

చట్టం ముందు అందరూ సమానమే.. న్యాయస్థానం డబ్బు, అధికారం.. ఇతర హెూదాను చూడదు" అనే సందేశమిచ్చేందుకే న్యాయదేవత విగ్రహం కళ్లకు గంతలు కడతారు. ఇక.. చేతిలో ఉంచే ఖడ్గం విషయానికొస్తే.. అన్యాయాన్ని న్యాయదేవత చీల్చిచెండాడుతుందని సంకేతం ఇచ్చేందుకు ఇలా న్యాయదేవత విగ్రహం చేతిలో ఖడ్గాన్ని ఉంచారు.

ఇంత గొప్ప అర్థం ఉన్నప్పుడు మరి న్యాయదేవత విగ్రహంలో మార్పులు ఎందుకు చేశారనే సందేహం కలగడం సహజం. బ్రిటీష్ ఛాయల నుంచి భారతదేశ న్యాయ వ్యవస్థ బయటపడాలనే ఉద్దేశంతో పాటు.. చట్టం గుడ్డిది కాదని, రెండు కళ్లు తెరిచి అందరినీ సమానంగానే చూస్తుందని చాటి చెప్పే ఉద్దేశంతో జస్టిస్ చంద్రచూడ్ ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేయించినట్టు సమాచారం.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 18, అక్టోబర్ 2024 ||



## పవన్ కళ్యాణ్‌కు హర్యానా ప్రభుత్వ ప్రాచీన జ్ఞాపికలు





హర్యానా రాష్ట్ర నూతన ముఖ్య మంత్రిగా నాయబ్ సింగ్ సైనీ నేడు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ డీప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హర్యానా ప్రభుత్వం అందజేసిన వేలాది సంవత్సరాల పురాతనమైన సింధు నాగరికతకు సంబంధించిన ఆకృతులు, ఉమామహేశ్వర విగ్రహం, ఇతర ప్రాచీన జ్ఞాపికలను, వారి సత్కారాన్ని డిప్యూటీ సీఎం ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు.



శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం పెనుకొండ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం ముందు వాల్మీకి జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి నివాళులు అర్పించి అనంతరం బోయగేరి నందు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జోలి శాఖ మంత్రి శ్రీమతి సవిత



పల్లె పండుగ" కార్యక్రమంలో ఇప్పేంట పంచాయితీలోని, లిబొడ్డెద్దులపల్లిలో 6.80 లక్షల (6లక్షల 80 వేలు) జ.జ. రోడ్లకు శంకుస్థాపన చేసిన శాసనసభ్యులు పుత్తా చైతన్య రెడ్డి



నటుడు రాజేంద్రప్రసాద్ కూతురు చిత్రపటానికి పూలు ఘటించి నివాళులర్పించిన రాజ్యసభ మాజీ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్.. నటుడు రాజేంద్ర ప్రసాద్‌ను తన కూకట్‌పల్లి నివాసంలో పరామర్శించినారు.



గుర్లలో డయేరియా వ్యాధికి గురై స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్



సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఎదురుగా సమతా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆదినారాయణ రెడ్డి వారి ద్వారా ఏర్పాటు చేసిన షెల్టర్ ఫర్ అర్బన్ హెూం లెస్‌ను ప్రారభించిన రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు శ్రీమతి సవితమ్మ అధికారులు నాయకులు...

## చేసింది గోరంత.. చెప్పుకునేది కొండంత

- మంత్రి పొంతన లేని వ్యాఖ్యలు
- ఎక్స్ వేదికగా మాజీ మంత్రి హరీష్ రావు కౌంటర్

**హైదరాబాద్,మహానాడు:**

కేసీఆర్ ఏటా ఇచ్చే బతుకమ్మ చీరలు కాంగ్రెస్ ప్రభుత్వం ఈసారి ఎందుకు బంద్ చేసిందన్న దానికి సమాధానం చెప్పకుండా, మంత్రి పొంతన లేని వ్యాఖ్యలు చేయడం శోచనీయం. మా ప్రభుత్వం ఏటా రూ.300 కోట్లతో బతుకమ్మ చీరెలు పంపిణీ చేసిందని ఒప్పుకున్నం దుకు ముందుగా మీకు ధన్యవాదాలు.

అయితే అంతకు మించిన ప్రయోజనాలను కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు కల్పించినట్లు భ్రమలు కలిపించే ప్రయత్నం చేయడం హాస్యాస్పదం. మహిళలకు ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన హామీలు అమలు చేయకుండా, ప్రచారం కోరుకోవడం ముఖ్యమంత్రితో పాటు మంత్రులకు అలవాటుగా మారింది.

మహాలక్ష్మి పథకానికి ఈ రాష్ట్రంలోని రేషన్ కార్డు కలిగి ఉన్న 93 లక్షల కుటుంబాలలో 18 ఏళ్లు నిండిన ఒక్క మహిళను అర్హులుగా తీసుకున్నా.. 10 నెలలు గా నెలకు ? 2,500 చొప్పున 93 లక్షల మహిళలకు ఒక్కొక్కరికీ ?25,000 వేలు బాకీ పడ్డారు. అంటే మొత్తం రూ. 23,250 కోట్ల బకాయి. మహాలక్ష్మి అమలు చేయకుండా మోసం చేయడమే కాకుండా రూ. 3,325 కోట్ల లెక్క చెప్పి, చెల్లించాల్సిన రూ. 23,250 కోట్లు కప్పి పుచ్చారు.

ఇది కాకుండా కళ్యాణలక్ష్మి చెక్కులకు అదనంగా తులం బంగారం ఇస్తామని మాట తప్పారు. రూ.500 గ్యాస్ పథకం, 200 యూనిట్ల గృహజోతిని కొందరికే పరిమితం చేశారు. హామీల అమలు విష యంలో చేసింది గోరంత, చెప్పుకునేది కొండంత. ఇక మహిళల గౌరవాన్ని నిలబెడుతున్నట్లు చెప్పిన మీ మాటలు అటుంచితే, ముందు మహిళల ప్రాణాలు కాపాడాలని, శాంతి భద్రతలు నిర్వహించి వారి భద్రతకు భరోసా ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

## మహనీయుడు వాల్మీకి మహర్షి

- టీడీపీ కేంద్ర కార్యాలయంలో నేతల ఘన నివాళి

**మంగళగిరి, మహానాడు:**

యువగళం పాదయాత్రలో రాష్ట్ర మంత్రి నారాలోకేష్ ఇచ్చిన హామిని నిలబెట్టుకుంటూ..నేడు వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా జరుపుకుంటున్నాం. వాల్మీకి అందించిన మదుర కావ్యాన్ని నిరంతరం స్మరిస్తూ... అవతారమూర్తి అయిన శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకుని ప్రజలు సన్మార్గంలో నడిచేందుకు భారతావనితో పాటు ప్రపంచ జనులకు అందించిన మహెూన్నత గ్రంథమే రామా యణం. సర్వమానవుల క్షేమం కోసం పురుషోత్త ముడైన శ్రీరాముడి చరిత్రను, ఉన్నతమైన ఆదర్శాలను మానవు లకు అందించిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని పలువురు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా గురువారం మంగళగిరి తెలుగ ుదేశం పార్టీ(టీడీపీ) కేంద్ర కార్యాలయంలో ఆ ఆదికవి చిత్రపటానికి పలువురు నేతలు పూల దండలు వేసి స్మరించుకున్నారు. వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. వాల్మీకి రచించిన



ఆదర్శ, అనుచరనీయ, ధర్మబద్ధమైన రామాయణాన్ని ప్రతి ఒక్కరు పటించి సన్మార్గంలో నడవాలని నేతలు కోరారు. హెూంమంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, సీనియర్ నాయకులు రమణ, తెలుగు రైతు అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, తెలుగు యువత అధ్యక్షులు శ్రీ రామ్ చిన్నబాబు, డూండి రాకేష్, ములక సత్యవాణి, మీడియా కోఆర్డినేటర్ ధారపనేని నరేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ చీరలకు మించిన ఆర్థిక ప్రయోజనాలు

మాజీ మంత్రి హరీష్ రావు వ్యాఖ్యలను ఖండించిన పంచాయతీ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమల శాఖ మంత్రి సీతక్క

**హైదరాబాద్,మహానాడు:**



ప్రజా ప్రభుత్వంలో బతుకమ్మ చీరను బంద్ పెట్టారన్న హరీష్ రావు వ్యాఖ్యలను ఖండిస్తున్నాం.నాసి రకం చీరలిచ్చి మహిళల ఆత్మగౌరవాన్ని బీఆర్ఎస్ కించపరి చింది. బతుకమ్మ చీరలకు మించిన ఆర్థిక ప్రయోజనాలను మహిళలకు కల్పిస్తున్నాం. బతుకమ్మ చీరలకు గత ప్రభుత్వం ఏడాదికి చేసిన ఖర్చు రూ.300 కోట్లు మాత్రమే.

మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ కల్పించేందుకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు పరుస్తున్నాం. మహి ళకు ప్రయాణ బారం లేకుండా ఉచిత ప్రయాణ సౌక ర్యాన్ని కల్పిస్తున్నాం. పైసా ఖర్చు లేకుండా మహిళలు ఉచిత ప్రయాణం చేస్తున్నారు. నిన్నటి దాకా 98.50 కోట్ల ఉచిత ప్రయాణాలను అక్కచెల్లెమ్మలు వినియోగించు కున్నారు. ఉచిత ప్రయాణం విలువ అక్షరాల రూ.3,325 కోట్లు.అంటే సగటున నెలకు రూ.332 కోట్లు ఆడబిడ్డలకు ఆదా అవుతోంది.

గత ప్రభుత్వం బతుకమ్మ చీరల కోసం వెచ్చించిన బడ్జెట్‌కు, పదిరెట్లు అధికంగా ఉచిత బస్సు ప్రయాణం కోసం మా ప్రభుత్వం వెచ్చిస్తోంది. ఒక్క ఏడాది కోసం బతుకమ్మ చీరల ఖర్చు రూ. 300 కోట్లు. అదే ఒక్క నెల ఉచిత బస్సు ప్రయాణం ఖర్చు రూ.332 కోట్లు. మహిళల వంటింటి భారం తగ్గించేందుకు రూ.500 కే గ్యాస్ సిలిండర్. అదే బీఆర్ఎస్ హయంలో గ్యాస్ సిలిండర్ ధర రూ. 1200.

రూ.500 కే గ్యాస్ సిలిండర్ ఇచ్చేందుకు ఇప్పటికే రూ. 300 కోట్లకు పైగా ప్రజా ప్రభుత్వం ఖర్చు చేసింది. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం కింద వేయి కోట్లు వెచ్చించాం.మహిళా సంఘాల ఆర్థిక స్వావలంబన కోసం బ్యాంకులకు రూ.400 కోట్ల వడ్డీని ప్రభుత్వమే చెల్లించింది. మరో వేయి కోట్లు చెల్లించేందుకు సిద్దంగా ఉన్నాం.

మహిళల గౌరవాన్ని నిలబెడుతూ వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చేయుతనిస్తున్నాం. బీఆర్ఎస్ పాలన వైఫల్యాలను సరిదిద్దుతూ ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు పరుస్తున్నాం.

## సజ్జల రామకృష్ణ రెడ్డిని అరెస్టు చేయాల్సిందే...

- బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ శర్మ డిమాండ్

**అమరావతి, మహానాడు:**

వైసీపీ ప్రభుత్వంలో సలహాదారుగా పనిచేసిన సజ్జల రామకృష్ణారెడ్డిని తెలుగుదేశం పార్టీ(టీడీపీ) ఆఫీస్ పైన దాడి, చంద్రబాబు ఇంటి పైన దాడి తదితర కేసుల్లో కుట్రదారుడని, కచ్చితంగా అరెస్టు చేయాల్సిం దేనని టీడీపీ నేత, బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ డిమాండ్ చేశారు. గుంటూరులో బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర కార్యాల యంలో నిర్వహించిన సమా వేశంలో శ్రీధర్ మాట్లాడారు.



మంగళగిరి పోలీసులు సజ్జల రామకృష్ణారెడ్డకినోటీసులు ఇచ్చిన నేపథ్యంలో పోలీసు విచారణలో ఎక్కడ పోలీసులకు సహకరించ కుండా అహంకార ధోరణి ప్రదర్శించారని, దీనిపైన పోలీసులు సమగ్రంగా విచారణ చేయాల్సిందేనని కోరారు. గత ప్రభుత్వంలో మాదిరి కూటమి ప్రభుత్వంలో చట్ట ప్రకారం వ్యవహరించకుండా ఏదో మొక్కుబడి గా విచారణ చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పోలీసు వైఖరి మార్చుకోవాలని నిజమైన పోలీసు వలె వ్యవహరించాలని, తాము చేస్తున్న ఉద్యోగానికి న్యాయం చేయాలని లేని పక్షంలో పోలీసులపై తెలుగుదేశం పార్టీపై వ్యతిరేకత ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉందని శ్రీధర్ హెచ్చరించారు.

## వైసీపీ నేత బోరుగడ్డ అనిల్ కుమార్ అరెస్ట్!

**గుంటూరు, మహానాడు:** వైసీపీ నేత బోరుగడ్డ అనిల్ కుమార్ ను పోలీసులు అరెస్టు చేశారు. ఆరండల్ పేట పోలీస్ స్టేషన్లో ఈయనపై పలు కేసులు నమోదు అయ్యాయి. గుంటూరు, అనంతపురం, విశాఖ జిల్లాలో ఇప్పట్టికే 20 కేసులలో నమోదు అయినట్టు సమాచారం. వైద్య పరీక్షలు నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



## కొడాలి అండతో కులాన్ని మార్చేసి పదవి పొందిన సర్పంచ్

- సైనిక వెల్ఫేర్ డైరెక్టర్ వెంకటరెడ్డి వేషాలు
- APEXCOలో మెజార్టీ సభ్యులు వైసీపీ సానుకూలపరులు ఉండేలా కుటిల యత్నం
- వైసీపీ నేతలకు కొమ్ముకాస్తున్న పోలీసులపై ఫిర్యాదులు
- అక్రమకేసులు పెట్టి వేధిస్తున్నారంటూ బాధితులు హెూంమంత్రికి విన్నపం
- హెూంమంత్రి సీరియస్.. ప్రజలను ఇబ్బంది పెడుతున్న పోలీసులను సస్పెండ్ చేయాలని ఆదేశం

**మంగళగిరి, మహానాడు:**

డోన్ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఇంతియాజ్ బాషా తమపై అక్రమ కేసులు పెట్టి.. ఇబ్బంది పెడుతున్నారని.. డోన్ మండల తెలుదేశం పార్టీ(టీడీపీ) కన్వీనర్ సలింద్ర శ్రీనివాసులను దారుణంగా కొట్టారని.. తీవ్రమైన గాయాలతో శ్రీనివాసులు ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారని నంద్యాల జిల్లా డోన్ కు చెందిన అడ్వకేట్ లక్ష్మిశెట్టి కృష్ణప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతియాజ్ బాషా విధుల దుర్వినియోగంపై అధికారులు తక్షణమే స్పందించకుంటే తాము ధర్నాకు దిగుతామని గురువారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ(టీడీపీ) కేంద్ర కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ లో హెూంమంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, వాణిజ్య విభాగం అధ్యక్షుడు డూండి రాకేష్, తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్ చిన్నబాబులకు వినతి ఇచ్చి అభ్యర్థించారు. వారి మొర విన్న హెూంమంత్రి వెంటనే జిల్లా పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి విచారించి సర్కిల్ ఇన్స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని అవసరమైతే ప్రజలను ఇబ్బంది పెడుతున్న పోలీసులను సస్పెండ్ చేయాలని ఆదేశించారు.

- కోర్టును, అధికారులను తప్పుదోవ పట్టించి, కొడాలి అండతో తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలు సృష్టించి పదవి పొందిన తమిరిశ గ్రామ సర్పంచ్ పై చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా నందివాడ మండలం తమిరిశకు చెందిన అంబేద్కర్ నగర్ వాసులు హెూంమంత్రికి వినతి పత్రం ఇచ్చారు. విచా రించి చర్యలు తీసుకుంటామని ఆమె వారికి హామీ ఇచ్చారు.
- వైఎస్ భారతిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, మాజీ ఎంపీ శ్రీనివాస రెడ్డిలకు సొంత బంధువైన వి.వెంకటరెడ్డి APEXCOలో సైనిక వెల్ఫేర్ డైరెక్టర్‌గా ఉండి వైసీపీ మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంల సహాయంతో సూరెడ్డి శివకుమార్, కటకం పూర్ణ చంద్రరావు మరికొందరు కలిసి రాష్ట్ర వ్యాప్తంగా సైనిక సమావేశాలు నిర్వహిస్తూ.. APEXCOలో మెజారిటీ సభ్యులు వైసీపీకి చెందిన వారు ఉండేలా ప్రయత్నం చేస్తున్నారని సంఘ అధ్యక్షుడు మోటూరి శంకరరావు నేడు గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశారు.
- వైసీపీ కార్యకర్తలు తన ఇండిపై దాడి చేసి తనను, తన కుటుంబ సభ్యులను అసభ్య పదజాలంతో దూషిస్తూ.. భయభ్రాంతులకు గురిచేసినా పోలీసులు పట్టించుకోకపోగా.. తిరిగి తమపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టి వేధిస్తు న్నారని.. ఆ పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని అల్లూరి జిల్లా కూనవరం మండలం పోలిపాక గ్రామానికి చెందిన షేక్ రసూల్ హెూంమంత్రికి విజ్ఞప్తి చేశారు.
- తన నుండి ఎప్పుడో విడిపోయిన తన భార్యా పిల్లలు.. తన ఆస్తికోసం తాను చనిపోయినట్టు రిజిస్ట్రర్ కార్యాలయంలో తప్పుడు సమాచారం ఇచ్చి తన భూమిని ఇతరులకు అమ్మే శారని.. తన భూమి తనకు ఇప్పించి న్యాయం చేయాలని కృష్ణా జిల్లా కంపాడుకు చెందిన వెంకటరెడ్డి గ్రీవెన్స్‌లో విజ్ఞప్తి చేశారు.
- తన భర్తకు లివర్ ఆపరేషన్ కు డబ్బులు ఇప్పిస్తామని చెప్పి తనకు తన కూతురుకు తెలియకుండా తన భర్త పేరుమీద ఉన్న ఆస్తులను రాయించుకుని పొలాన్ని అమ్మేసి డబ్బులు ఇవ్వకుండా తన ఆడపడుచు పి.నాగిని తన అత్త గొల్లమూడి




శివకుమారీలు మోసం చేశారని.. దాంతో తన భర్త చనిపోయారని, తనకు న్యాయం చేయాలని తన ఆస్తులు తనకు ఇప్పించాలని గుంటూరు జిల్లా పలకలూరుకు చెందిన గొల్లమూడి స్వర్ణలత వేడుకుంది.
- తీసుకున్న బంగారానికి ఇవ్వాల్సిన డబ్బులు అడుగుతుంటే తనపై రేప్ కేస్ పెట్టి చంపిస్తానని ఎం. శిల్ప అనే మహిళ బెదిరిస్తుందని.. తనకు గుంటూరు పోలీసులు, నాయకులు తెలుసని డబ్బులు అడిగితే ప్రాణాలు ఉండవని భయపెడు తుందని ఆమెపై చర్యలు తీసుకుని తనకు రావాల్సిన డబ్బులు ఇప్పించి ఆదుకోవాలని విజయవాడకు చెందిన కె. రాజేష్ అనే వ్యక్తి నేతల ముందు ఆవేదన వ్యక్తం చేశారు.
- నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం సునిపెంట గ్రామానికి చెందిన వినుకొండ యేసు విజ్ఞప్తి చేస్తూ.. తమ కుమారున్ని చంపి కర్నూలు రైల్వే ట్రాక్ పై వేశారని.. అనుమానంగా ఉన్న వ్యక్తులపై ఫిర్యాదు చేస్తే.. స్థానికంగా ఉన్న వైసీపీ నేతలు దాన్ని విచారణకు రాకుండా అడ్డుకుంటు న్నారని.. తమ కుమారుడి హత్యపై విచారించి తమకు తగు న్యాయం చేయాలని యేసు నేతలకు విజ్ఞప్తి చేశారు.
- బాపులపాడు మండలం వేలేరు గ్రామంలో ఉన్నతమ భూమిని తమకు సర్వే చేయించి ఇవ్వమంటే స్థానిక సర్వేయర్, అధికారులు పట్టించుకోవడంలేదని తమ పక్కన ఉన్న పెద్ద రైతుకు అధికారులు బయపడి సర్వే చేయకుండా ఆగిపోతున్నారని.. దయచేసి తమ భూమిని తమకు సర్వేచేసి ఇప్పించవలసిందిగా నందివాడ మండలం వెన్నపూడి గ్రామానికి చెందిన పొట్లూరి వెంకటసత్యనారాయణ విజ్ఞప్తి చేశాడు.
- కావలి నియోజకవర్గం బాగోలు మండలం నాగులవరం గ్రామానికి చెందిన కంచర్ల వెంకటెశ్వర్లు వేడుకుంటూ.. తమ భూమి 0.70లను కంచర్ల సుబ్బారావు, కంచర్ల శేషగిరిలు ఆక్రమించారని.. వారి నుండి భూమిని విడిపించి ఆదుకోవాలని వేడుకున్నారు.
- ప్రకాశం జిల్లా పామర్రు మండలం దొడ్డా వెంకటపల్లి గ్రామా నికి చెందిన ఉడుముల మహేష్ రెడ్డి విన్నవించుకొంటూ.. తమను ఇనపరాడ్లు, కర్రలతో కొట్టి చంపాలని చూసిన దోసులను కఠిన చర్యలు తీసుకునేలా కేసును రీ ఓపెన్ చేసి విచారించాలని హెూంమంత్రికి అర్జీ ఇచ్చి అభ్యర్థించారు.
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆసుపత్రులలో గల రక్తనిధి, రక్త నిల్వ కేంద్రాల్లో గత 18 సంవత్సరాలుగా అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న 149 మంది సిబ్బంది సమస్యలను పరిష్కరించి.. కనీస వేతనం ఇవ్వాలని వారు వేడుకున్నారు.
- తన కొడుకును చిత్రహింసలు పెట్టి చంపేశారని.. వారిపై కేసు పెట్టడానికి వెళితే గుంటూరు కొత్త పేట పోలీసులు కేసు తీసుకోకుండా.. వైసీపీ వాళ్లతో కుమ్మక్కై తననే అవమాని స్తున్నారని.. గుంటూరుకు చెందిన బడిగినేని పద్మావతి




ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమారుడి చావుకు కారకులైన వారికి కఠిన శిక్షపడేలా చూడాలని కోరారు.
- గత 25 సంవత్సరాల నుండి పంచాయితీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ మండల పరిషత్ కార్యాలయంలో రోజువారి వేతనం నిమిత్తం బోర్ మెకానిక్స్ గా(చేతిపంపు మెకానిక్స్) పనిచేస్తున్నామని.. తమకు ఉద్యోగ భద్రత కల్పించి వేతనం పెంచాలని వారు వేడుకున్నారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 18, అక్టోబర్ 2024 ||





# భూమిని వైసీపీ నేతలు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు...

- 'ప్రజాదర్బార్' లో ఓ బాధితుడి మొర
- సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి
- అధికారులకు మంత్రి నారా లోకేష్ ఆదేశాలు

**అమరావతి, మహానాడు:** ప్రజాదర్బాకు వచ్చే సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సిబ్బందిని ఆదేశించారు. ఆయా సమస్యలను సంబంధిత శాఖలకు పంపడంతో పాటు పరిష్కారం అయ్యేంత వరకు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఉండవల్లిలోని నివాసంలో మంత్రి లోకేష్ 43వ రోజు "ప్రజాదర్బార్"కు మంగళగిరితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు తరలివచ్చారు.

తమ సమస్యలను ఏకరవు పెట్టారు. ప్రతి ఒక్కరి విజ్ఞప్తిని పరిశీలించిన మంత్రి.. పరిష్కారా నికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## మంగళగిరి నియోజకవర్గం నుంచి వచ్చిన విజ్ఞప్తులు

- కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న తన ఏకైక కుమారుడిని తోటి డ్రైవర్లు కలిసి హత్య చేశారని, విచారించి నిందితులను శిక్షించాలని ఉండవల్లికి చెందిన ఏపూరి వెంకటరమణ విజ్ఞప్తి చేశారు. కుటుంబానికి ఆధారమైన కుమారుడిని కోల్పోవడంతో అనారోగ్యానికి గురయ్యా యని, పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు.
- అనారోగ్యంతో భర్త మరణించడంతో తన ఇద్దరి పిల్లల పోషణ భారంగా మారిందని, ఇల్లు మంజూరు చేయడంతో పాటు స్వయం ఉపాధి కల్పించి ఆదుకోవా లని నులకపేటకు చెందిన కొండ సుశీల కోరారు.
- అమరావతి రాజధాని పరిధిలో గత 50 ఏళ్లు వ్యవ సాయ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నామని, గత ప్రభుత్వం రాజధాని రైతుకూలీ పెన్షన్ నిలిపివేసిందని, తిరిగి పున రుద్ధరించాలని ఉండవల్లికి చెందిన పెయ్యాల శ్రీరామమూర్తి, భూపతిరాజు సత్యనారాయణ రాజు విజ్ఞప్తి చేశారు.
- ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి ల్యాండ్ పూలింగ్ కింద సేకరించిన తమ భూమికి వార్షిక కౌలు అందడం లేదని, విచారించి కౌలు మంజూరుయ్యేలా చర్యలు తీసుకోవాలని నిడమర్రుకు చెందిన చల్లా పెద్ద అంకమరావు విజ్ఞప్తి చేశారు.
- బీ.కామ్ కంప్యూటర్స్ చదివిన తనకు ఎయిమ్స్ లో ఉద్యోగ అవకాశం కల్పించాలని మంగళగిరికి చెందిన షేక్ మహ మ్మద్ రఫి కోరారు. పరిశీలించి తగిన ఉద్యోగం కల్పిస్తామని మంత్రి అర్జీదారులకు హామీ ఇచ్చారు.

## రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన విజ్ఞప్తులు

- తమ కుటుంబానికి వారసత్వంగా సంక్రమించిన 5.48 ఎకరాల అసైన్డ్ భూమిని వైసీపీ నేతలు అక్రమంగా రిజి స్ట్రేషన్ చేసుకుని.. జగనన్న ఇళ్ల నిర్మాణానికి ఇచ్చి సొమ్ము చేసుకున్నారని గుంటూరు జిల్లా ఓబుల నాయుడు పాలెంకు చెందిన సిద్దెల కిరణ్ మంత్రి నారా లోకేష్ ను కలిసి ఫిర్యాదు చేశారు. వైసీపీ నేతలైన కేశం హరినాథ్, దుగ్గెంపూడి అంజిరెడ్డి, వీఆర్ఏ పొత్తూరు పద్మ, పొత్తూరు భాగ్యరాజులు తమను నమ్మించి మోసం చేశారని కన్నీటిపర్యంతమయ్యారు. నిషేధిత జాబితా నుంచి తమ పొలాన్ని తొలగిస్తామని చెప్పి తమ వద్ద రూ.3 లక్షల నగదు, 50 గ్రాముల బంగారాన్ని లంచంగా తీసుకోవడంతో పాటు అనంతరం మాయమాటలు చెప్పి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఆ భూమిని జగనన్న కాలనీలకు ఇచ్చి తమకు అన్యాయం చేశారు. విచారించి తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.
- ఇటీవల సంభవించిన వరదల్లో తన ట్యాక్సీ మునిగి పూర్తిగా పాడైపోయిందని, మరమ్మతులకు తగిన ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని కృష్ణా జిల్లా పామర్రు నియోజకవర్గం హనుమంతపురానికి చెందిన కొడాలి కరుణాకర్ బాబు విజ్ఞప్తి చేశారు. కారుకు ఇన్సూరెన్స్ లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నానని వాపోయారు.
- రైతు సేవా కేంద్రాల్లో పనిచేస్తున్న టీఏ, డీఈవో, హెల్పర్స్‌ల కాంట్రాక్ట్ కాలపరిమితి 11 నెలలకు రెన్యు వల్ చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎన్టీఆర్ జిల్లాకు చెందిన సిబ్బంది మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు.
- డిగ్రీ చదివిన తన దివ్యాంగ కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని గుంటూరు శ్రీనగర్ కు చెందిన బొంతల శ్రీనివాసరావు కోరారు.
- క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న తనకు పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని గుంటూరు జిల్లా మందడంకు చెందిన పిల్లపాగ రోశమ్మ విజ్ఞప్తి చేశారు.























జనం గుండె చప్పుడు

# మహానాడు

8

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 18, అక్టోబర్ 2024 ||

# బాబ్బాబు.. ఇకనైనా మారయ్యా!



పార్టీ జెండాను భుజం పుండ్లుపడేలా మోసిన కార్యకర్తల ఆవేదనలతో.. గత మూడు నెలల నుంచి టీడీపీ సోషల్‌మీడియాలో హాహాకారాలు ప్రతిధ్వనిస్తున్నాయి. ఐదేళ్ల కాలంలో జగన్, ఆయన పార్టీ నేతల దాష్టీకాలు గుర్తు చేస్తూ, పార్టీ సోషల్‌మీడియాలో పెడుతున్న ఆవేదనాభరిత పోస్టింగులు, కార్యకర్తలలో ఆవేశం రగిలిస్తున్నాయి. జగన్ హయాంలో వెలిగిన అధికారులు, నాయకులే మళ్లీ తమపై పెత్తనం చేయడాన్ని సహించలేని తమ్ముళ్లు.. సోషల్‌మీడియా వేదికగా తమ ఆక్రోశం వెలిబుచ్చుతున్నారు.

తమ ఆవేదనను అవహేళన చేసి, తమ త్యాగాలు తక్కువచేసి సుద్దుల పలుకుతున్న ఏబీఎన్-ఆంధ్రజ్యోతి అధినేత రాధాకృష్ణపై, టీడీపీ సోషల్‌మీడియా సైనికులు ములుకుల్లాంటి పదాలతో వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. తాజాగా లగడపాటి కృష్ణకుమారి అదే మహిళా కార్యకర్త, 'ప్రజాప్రకటన' పేరుతో పార్టీకి చెందిన సోషల్‌మీడియా గ్రూపులోనే.. మళ్లీ జగన్ వస్తే ఎవరినీ బతకనీయడు..యమ డేంజరంటూ చంద్రబాబును హెచ్చరిస్తూ రాసిన ఓ లేఖ, టీడీపీ సోషల్ మీడియాలో చర్చనీయాంశమయింది.

లగడపాటి కృష్ణకుమారి రాసిన లేఖ యధాతథంగా..

ప్రజా ప్రకటన

వైసీపీ మళ్ళ జవసత్వాలు పుంజుకుని అధికారంలోకి వచ్చిందంటే.... చంద్రబాబు నాయుడునీ భవిష్యత్తు తరాలు క్షమించవు గాక క్షమించవు. ఈ ఐదేళ్ళూ అభివృద్ధి చేయకపోయినా వచ్చే నష్టం లేదు. కలో గంజో తాగిబతుకుతాం! వాడిని స్వేచ్ఛగా వదిలేసి, మీరు చేసే అభివృద్ధి ఎంటో ఆలోచించండి పెద్దాయనా ! మీరు రాజకీయం చేసి వాడిని రాజకీయ సమాధి చేస్తేనే ఆంధ్రోడికి భవిష్యత్తు ఉంటుంది. లేదూ.. నాకు అభివృద్ధే హాబీ అనుకుంటే.. మీరు చేసిన ఆనవాళ్లు ఉండవు అండి బాబుగారు.

గుర్తుపెట్టుకోండి!!

ప్రజలు ప్రాణాలకు తెగించి మీకు పట్టం కట్టింది ఈ రాక్షసుడిని శిక్షించి, వాడి బారి నుండి రక్షిస్తావు అనేగానీ.. మీరిస్తాను అన్న పథకాలకు, చేస్తాను అన్న అభివృద్ధికి ఆశపడి కాదు మహాప్రభో. ఇకనైనా దుష్టశిక్షణ మొదలెట్టకపోతే అతి త్వరలో ప్రజల్లో మార్పు చూడవలసి వస్తుంది. ఇది ప్రజా ప్రకటన.

ప్రేమతో..

పార్టీ కోసం ప్రాణం పెట్టే

- లగడపాటి కృష్ణకుమారి, గుంటూరు

# స్పర్శ



భావాల ధాటికి చిట్లిపోయిన నరాలు
నెత్తుటి సిరాగా
కలంలో ప్రవహిస్తున్నప్పుడు ....

అక్షరాల శబ్దానికి
విస్ఫోటనమై పోయిన భావాలు
శిధిల శకలాలుగా
కాగితంపై కుప్పకూలుతున్నప్పుడు ....

అనుభవాల ప్రకంపానికి
విచ్చిన్న మైపోయిన సంఘటనలు
బాధల స్మృతులుగా
కాలం వేదికపై కదలాడుతున్నప్పుడు ....

శ్రమజీవుల రెక్కల కష్టానికి
ఆవిరి అయిపోయిన ఊపిరి సెగలు
స్వేదబిందువులుగా
బతుకుచిత్రంపై వర్షిస్తున్నప్పుడు .........
మృగాల కామద్రావకానికి
దహనమైపోయిన శరీర భాగాలు
సమాధి గోడలుగా
సభ్యసమాజాన్ని ప్రశ్నిస్తున్నప్పుడు ......

సేద్యకారుడి పంట నష్టానికి
పగిలిపోయిన ఆశల గుండెలు
అశ్రుసముద్రాలుగా
సంసార నౌకను ముంచేస్తున్నప్పుడు ...

వేదనల తీవ్రతకు
ముక్కలైపోయిన జీవితాలు
నిస్సహాయ నిట్టూర్పులుగా
జీవన యానంలో కొనసాగుతున్నప్పుడు ...
కవి కలంలో
కవిత దానికదే పుడుతుంది
అక్కున చేర్చుకొని
బాధిత వర్గాన్ని
ఓదారుస్తుంది !

- పి. లక్ష్మణ్ రావ్
(అసిస్టెంట్ రిజిస్ట్రార్ సహకార శాఖ)
విజయనగరం
9441215989

## వేల కోట్లకి అధిపతి అయినా

# వాడేది సెకండ్ హ్యాండ్ కారే!

విప్రో కంపెనీ అధినేత, వేల కోట్లకి అధిపతి, దాదాపు 12 వేల కోట్ల రూపాయల సొంత డబ్బుని ఇండియాలో విద్య అభివృద్ధి కోసం ఖర్చు పెడుతున్న అజీం ప్రేమ్ జీ, సెకండ్ హ్యాండ్ కారు వాడతారు అంటే నమ్మగలమా?

కాని ఇది నిజం.



ప్రేమ్‌జి కోరుకుంటే, క్షణాల్లో ప్రపంచంలోనే అత్యంత ఖరీదయిన కారు కొనుక్కోగలరు. కాని తను సంపాదించేది, తిరిగి సమాజానికి ఇవ్వడానికే అని మనసా, వాచా కర్మణా నమ్మిన ఈ మహానుభావుడు, ఒక మామూలు కోటీశ్వరుడు కొనుక్కోగలిగిన 'టయోట కరోల' కారుని వాడతారు.

ఇది కాకుండా ఎప్పుడయినా ఉపయోగించుకోవడం కోసం మెర్సిడెస్ బెంజ్ ఇ సిరీస్ కారు కొనుక్కున్నారు. ఈ కారు కొత్తది కొనుక్కోవాలంటే 50 లక్షలు అవుతుంది, ఈ మాత్రం కూడా తన కోసం ఖర్చు పెట్టుకోవడం ఇష్టం లేని ఈ మహామనిషి, ఓ సెకండ్ హ్యాండ్ కారు కొనుక్కున్నారట. ఎంత గొప్ప మనసో కదా.. అంతేనా..

కూల్ డ్రింక్స్ తాగండి ఆరోగ్యం పాడుచేసుకోండి అని ప్రకటనల్లో నటించే స్టార్లు, తమ ఆరోగ్యం విషయం లో మాత్రం చాలా జాగ్రత్తగా ఉంటారు. కాని, అజీమ్ ప్రేమ్ జీ మాత్రం, ఇప్పటికీ తమ కంపెని తయారు చేసే చంద్రిక సబ్బునే షేవింగ్ క్రీమ్ లాగా ఉపయోగిస్తారట. ఎందుకిలా అంటే, మన కంపెని తయారీ సబ్బుని మనమే వాడకపోతే ఎలా అని ప్రశ్నిస్తారట ఈ కర్మయోగి. నేటి యువతరానికి స్ఫూర్తిగా నిలుస్తున్న ఈ గొప్ప మనసుకు ఒక సెల్యూట్ కొడదాం,

సేకరణ: సేతు వేణుమాధవ్

# షేక్ హసీనాపై అరెస్టు వారెంట్

## నవంబర్ 18 లోపుగా అరెస్ట్ చేయాలి

**ఢాకా:** షేక్ హసీనాపై అరెస్ట్ వారెంట్ జారీ అయింది. బంగ్లాదేశ్ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ ఐసీటీ ఆఫ్ బంగ్లాదేశ్ ఈ వారెంట్ ఇచ్చింది. 2024, నవంబర్ 18 లోపుగా ఆమెను అరెస్ట్ చేసి తమ ఎదుట హాజరుప ర్చాలని ఐసీటీ ఆఫ్ బంగ్లాదేశ్ ఆదేశించింది.

హసీనాతో పాటు మరో 45 మందిపై కూడా ఈ వారెంట్ జారీ అయింది. వీరంతా హసీనా పార్టీకి చెందిన అవామీ లీగ్ నాయకులు. రిజర్వేషన్లపై విద్యార్థుల నిరసనలు హింసాత్మకంగా మారడంతో షేక్ హసీనా పదవి నుంచి వైదొలిగారు. బంగ్లాదేశ్ నుంచి ఆమె నేరుగా దిల్లీకి వచ్చారు.

జులై 15 నుంచి ఆగస్టు 5 వరకు జరిగిన హింసాత్మక ఘటనలకు సంబంధించి హసీనాకు వ్యతిరేకంగా ఐసీటీకి ఫిర్యాదులు అందాయి. వాటిపై ట్రైబ్యునల్ దర్యాప్తు ప్రారంభించింది.

హసీనాను బంగ్లాదేశ్‌కు రప్పించాలని ప్రాసిక్యూషన్ ట్రైబ్యునల్‌లో రెండు పిటిషన్లు దాఖలు చేసింది. దీంతో ట్రైబ్యునల్ ఛైర్మన్ జస్టిస్ మహమ్మద్ గోలం మోర్తుజా మజుందార్ అరెస్ట్ వారెంట్ జారీ చేశారని చీఫ్ ప్రాసిక్యూటర్ మొహమ్మద్ తాజులు ఇస్లాం చెప్పారు.

వీరిపై అరెస్టు వారెంట్లు జారీ చేయాలని కోరుతూ ప్రాసిక్యూషన్ ట్రిబ్యునల్‌లో రెండు పిటిషన్లు దాఖలు చేయడంతో



ట్రిబ్యునల్ చైర్మన్ జస్టిస్ మహ్మద్ గోలం మోర్తుజా మజుందార్ నేతృత్వంలోని ట్రిబ్యు నల్ ఈ ఆదేశాలు జారీ చేసిందని చీఫ్ ప్రాసిక్యూటర్ మొహమ్మద్ తాజుల్ ఇస్లాం తెలిపారు.



# ఎంపి కేశినేని చిన్నిను కలిసిన మంత్రి వాసంశెట్టి సుభాష్

**విజయవాడ,మహానాడు:** కృష్ణ జిల్లాకు ఇన్‌ఛార్జి మంత్రిగా నియమితులైన కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి వాసం శెట్టి సుభాష్ కి సాదరంగా స్వాగతం పలికారు.

అనంతరం వీరద్దరూ కాసేపు కృష్ణ, ఎన్టీఆర్ జిల్లాల్లో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితుల గురించి చర్చించుకున్నారు. అలాగే ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి బలపరిచిన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కు ఉమ్మడి కృష్ణ జిల్లాల నుంచి భారీ మెజార్టీ వచ్చేందుకు చేయాల్సిన కృషి పై మాట్లాడుకున్నారు.

# వచ్చేనెల 5లోపల యాక్టివ్ మెంబర్షిప్ పూర్తి చేయాలి

- పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా శివన్నారాయణ

**గుంటూరు, మహానాడు:** భారతీయ జనతా పార్టీ(బీజేపీ) జిల్లా కార్యాలయంలో పార్టీ క్రియాశీలక సభ్యత్వ కార్యశాల(యాక్టీవ్ మెంబర్షిప్ వర్క్ షాప్) కార్యక్రమం ప్రారంభమైనది. సీనియర్ నాయకులు కొత్తూరు వెంకట సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మెంబర్షిప్ ఈ 40 రోజుల కార్యక్రమం దేశ మొత్తం మీద పార్టీకి పండగ లాంటిది.




400 మంది కార్యకర్తలు ఈ జిల్లాలో ఇంటింటికి వెళ్లి పార్టీ ఈ పదేళ్ళు మోడీ ప్రవేశపెట్టిన పథకాలు వివరిస్తూ మెంబర్షిప్ చేసినట్టు తెలిపారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోస్తాంధ్ర జోన్ సభ్యత్వ ఇన్‌ఛార్జి వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ దేశంలో అత్యద్భుతమైన పరిపాలన అందిస్తున్న పార్టీ బీజేపీ అంటూ, సబ్ కా సాత్, సబ్ కా వికాస్ ఈ స్లోగన్లతోటి అట్టడుగున ప్రజానీకం వరకు పార్టీ చేపట్టిని అభివృద్ధిని తీసుకువెళ్ళినట్టు తెలిపారు.

పార్టీ రాష్ట్ర కార్యాలయ ఇన్‌ఛార్జి మకుటం శివ మాట్లాడుతూ పార్టీ యాక్టివ్ మెంబర్షిప్ గురించి వివరించారు. 100 మంది సభ్యులు పూర్తయిన ప్రతి ఒక్క వ్యక్తికి యాక్టివ్ మెంబర్షిప్ ఇస్తూ పార్టీని బలోపేతం చేయాలని, ఇంకా నాలుగు రోజులు మిగిలి ఉందని, ఈ నాలుగు రోజుల్లో అందరూ సహకరించుకుంటూ పార్టీ మెంబర్షిప్‌ని పెంచి రాష్ట్రంలోనే అగ్ర జిల్లాగా నిలబెట్టాలని కోరారు.

ముఖ్య అతిథిగా విచ్చేసిన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా శివన్నారాయణ మాట్లాడుతూ మెంబర్షిప్ నాలుగు రోజులే సమయం ఉన్నదని, తరువాత పది రోజులలోపు యాక్టివ్ మెంబర్షిప్ తీసుకోవాలని, వచ్చేనెల ఐదు తారీకు లోపల యాక్టీవ్ మెంబర్షిప్ పూర్తి చేసుకుని రాష్ట్రానికి పుస్తకాలు అంద జేయవలసిందిగా కోరారు. పార్టీ మెంబర్షిప్ జిల్లా ఇన్చార్జి పాలపాటి రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, క్రియాశీల సభ్యత్వ ఇన్చార్జి యడ్లపాటి స్వరూపరాణి, క్రియాశీల సభ్యత్వ ఇంచార్జి జగ్గారపు శ్రీనివాస్, మాజీ మంత్రి శనక్కాయల అరుణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈదర శ్రీనివాసరెడ్డి, నరసరావుపేట నెల్లూరు జిల్లాల ఇన్చార్జులు కొక్కెర శ్రీనివాస్, గాజుల వెంకయ్య నాయుడు, పార్లమెంటు సంయోజక్ బీమినేని చంద్రశేఖర్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, మెంబర్షిప్ ఇన్చార్జి, యాక్టివ్ మెంబర్షిప్ ఇన్చార్జులు 200 మంది పాల్గొన్నారు.

# కౌలు రైతులకు మానవతాదృక్పదంతో రుణాలివ్వండి

- ఐదేళ్ళలో 50 లక్షల ఎకారాలను ప్రకృతి సేద్యం కిందకు తేవాలని లక్ష్యం
- వ్యవసాయ అనుబంధ రంగాలకు బ్యాంకులు తగిన తోడ్పాటును అందించాలి
- ఎంఎస్ఎంఇ రంగం ప్రోత్సాహానికి బ్యాంకులు ముందుకు రావాలి
- సాంకేతికతను జోడించి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ముందుకు తీసుకువెళ్ళాలి
- వరదల్లో బ్యాంకులు అందించిన తోడ్పాటుకు ప్రభుత్వం తరపున అభినందనలు
- రాష్ట్రస్థాయి బ్యాంకరుల కమిటీ సమావేశంలో వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చన్నాయుడు




**అమరావతి,మహానాడు:** రాష్ట్రంలోని కౌలు రైతులకు రుణాలు అందించుటలో బ్యాంకులు మానవతా దృక్పదంతో ముందుకు రావాల్సిన అవసరం ఉందని రాష్ట్ర వ్యవసాయ,పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖామాత్యులు కింజరపు అచ్చన్నాయుడు విజ్ఞప్తి చేశారు.

గురువారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన 228వ రాష్ట్ర స్థాయి బ్యాంకరుల కమిటీ (SLBC) సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 2024 ఏడాది మొదటి త్రైమాసికానికి సంబంధించి అనగా జూన్ నెలాఖరు వరకు సాధించిన ప్రగతిని సమీక్షించేందుకు జరిగిన ఈసమావేశంలో గత ఎస్ఎల్బిసి సమావేశం మినిట్స్ ఆమోదించడం, బ్యాంకింగ్‌కీ ఇండికేటర్స్, 2024-25 మొదటి త్రైమాసిక బ్యాంకుల వార్షిక రుణ ప్రణాళిక (ACP) లక్ష్య సాధన,కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రాయోజిత పథకాలు, ఫైనాన్సియల్ ఇన్ క్లూజన్,డిజిటల్ జిల్లాలు,ఆన్ గోయింగ్ క్యాంపెయిన్స్ ఆఫ్ ఇండియా మరియు రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా తదితర అజెండా అంశాలపై ఈసమావేశంలో చర్చించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 65 శాతానికి పైగా ప్రజలు వ్యవసాయ,అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నా రని కావున ఈరంగాల్లో బ్యాంకులు తగిన తోడ్పాటును అందించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా రాష్ట్రంలోని కౌలు రైతులకు 9 లక్షల సిసిఆర్సి కార్డులు (Crop Cultivator Rights Card) ఇవ్వగా ఇప్పటి వరకూ 2లక్షల మందికి మాత్రమే రుణాలు అందిచారన్నారు. కౌలు రైతులకు రుణాలు అందించడంలో మానవతా దృక్పధంతో బ్యాంకులు ముందుకు రావాలని ఆయన పునరుద్ఘాటించారు.

రాష్ట్రంలో వచ్చే ఐదేళ్లలో 50 లక్షల ఎకరాలను ప్రకృతి సేద్యం కిందకు తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిందని వ్యవసాయశాఖ మంత్రి అచ్చన్నాయుడు వెల్లడించారు. రాష్ట్రంలో ఎక్కువ మంది జనాభా వ్యవసాయ,అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్న



నేపథ్యంలో ఆయా రంగాల్లో అవసరమైన రుణాలను అందించాలని కోరారు. ప్రభుత్వం ఆరు రంగాల్లో విధాన నిర్ణయాలను ప్రకటించిందని వాటిలో ఎంఎస్ఎంఇ రంగం ప్రధానమైన రంగమని దీనిని ప్రోత్సహించేందుకు బ్యాంకులు అన్ని విధాలా ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రానికి 974 కిలోమీటర్ల సుదీర్ఘ సముద్రతీరంతో పాటు అపారమైన సహజ వనరుల తోపాటు తగిన యుతవ ఉందని కావున వివిధ రంగాల్లో వారికి చేయూతను అందించేందుకు బ్యాంకులు అన్ని విధాలా ముందుకు రావాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పియం ముద్రా యోజన,పియం విశ్వకర్మ తదితర పథకాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం వివిధ బ్యాంకులకు లక్ష్యాలను నిర్దిశిస్తోందని అయితే క్షేత్ర స్థాయిలో ఆయా పథకాలపై ప్రజలకు తగిన అవగాహన లేకపోవడంతో అవి సక్రమంగా అమలు కావడం లేదని కావున వాటిపై ప్రజలకు తగిన అవగాహన కల్పించి విజయవంతానికి కృషి చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

గత ప్రభుత్వం వివిధ రంగాలకు కేటాయించిన నిధులను వేరే అవసరాలకు మళ్ళించి ఆయా రంగాలన్నిటినీ నిర్వీర్యం చేసి అభివృద్ధిని నిలిపి వేసిందని మరలా వాటన్నిటినీ ఒక్కక్కటిగా గాడిలో పెట్టేందుకు గత నాలుగు నెలలుగా ఈ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలకు సాంకేతికతను జోడించి వాటిని ముందుకుకు తీసుకు వెళ్ళేందుకు బ్యాంకులు కూడా తమ వంతు సహకారాన్ని అందించాలని మంత్రి అచ్చన్నాయుడు విజ్ఞప్తి చేశారు.ఇటీవల వరదల్లో బాధి తులను ఆదుకునేందుకు బ్యాంకులు కూడా ఎంతో తేడ్పాటును అందించాయని అందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి అచ్చన్నాయుడు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండి మరియు సిఇఒఎ.మణిమేఖలై (Ms.A Manimekhalai) మాట్లాడుతూ విజనరీ లీడర్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో స్వర్ణ ఆంధ్ర ఏ2047,అభివృద్ధి చెందిన ఎపి లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనేక వినూత్న కార్యక్రమాలు,పథకాలను అమలు చేయడం పట్ల ముందుగా బ్యాంకులు అందరి తరపున రాష్ట్ర ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు.

ముఖ్యంగా సాంకేతికత సహాయంతో సింపుల్ అండ్ ఎఫెక్టివ్ గవర్నెన్స్ విధానంతో ముందుకు వెళుతోందన్నారు.అదే విధంగా పి-4 విధానం(పబ్లిక్,ప్రైవేట్, పీపుల్స్ పార్టనర్ షిప్)తో వివిధ రంగాల్లో అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు.

డిజిటల్ ఇనిషియేటివ్స్,మౌలిక సదుపాయాలు,ఆర్థిక, పారిశ్రామికాభివృద్ధి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లే ప్రయత్నానికి బ్యాంకులు అందరి తరుపున రాష్ట్ర ప్రభుత్వానికి తమ సహకారాన్ని అందిస్తామని చెప్పారు. ఇటీవల వరదల్లో బాధితులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషిని మణిమేఖలై ప్రత్యేకంగా అభినందించారు.

బ్యాంకుల పనితీరు గురించి ఆమె మాట్లాడుతూ.. 2024-25 వార్షిక రుణ ప్రణాళిక అమలుకు సంబంధించి ప్రాధాన్య రంగం కింద 3లక్షల 75వేల కోట్ల రూ.లు రుణాలు అందించాల్సి ఉండగా మొదటి త్రైమాసికంలో అనగా జూన్ 30 నాటికి లక్షా 36వేల 657 కోట్లు అనగా 36 శాతం రుణాలు అందించడం జరిగిందని ఎండి అండ్ సిఇఓ మణిమేఖలై తెలిపారు.

అదే విధంగా వ్యవసాయ రంగానికి సంబంధించి 2లక్షల 64వేల కోట్లు అందించాల్సి ఉండగా 89వేల 438 కోట్లు అందించి 34 శాతం,ఎంఎస్ఎంఇ రంగం రంగం కింద 87వేల కోట్లు రుణ సహాయం చేయాల్సి ఉండగా 44వేల 150 కోట్ల రూ.లు అందించి 51 శాతం లక్ష్యాన్నిసాధించి నట్టు చెప్పారు.అలాగే ప్రాధాన్యేతర రంగం కింద లక్షా 65వేల కోట్లు అందించాల్సి ఉండగా 87వేల 731 కోట్లు రుణాలందించి 53 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు చెప్పారు.

ఈ సమావేశంలో ఫైనాన్సియల్ సర్వీసెస్ శాఖ కార్యదర్శిగా ఢిల్లీలో రాష్ట్రం తరపున పనిచేస్తున్ననాగరాజు మద్దిరాల మాట్లాడుతూ.. వ్యవసాయ, ఎంఎస్ఎంఇ రంగాల్లో రుణవసతి బాగుందని అన్నారు.కేంద్ర ప్రభుత్వం వివిధ ఫ్లాగ్ షిప్పు పథకాలైన పియం జన్ ధన్ యోజన, పియం జీవన్ జ్యోతి యోజన,పియం అటల్ ఫెన్సన్ యోజన, పియం ముద్ర యోజన వంటి పథకాలకు సకాలంలో తగిన రుణాలు అందించాలని సూచించారు. వార్షిక రుణ ప్రణాళిక అమలులో మెరుగైన వృద్ధి సాధించారని అన్నారు.విద్యా రుణాలు మంజూరులో ఎస్సి,ఎస్టి,బిసి లకు తగిన రీతిలో రుణాలు విడుదల కావడం లేదని వాటని మెరుగుపర్చాల్సిన అవసరం ఉందని తెలిపారు. వ్యవసాయేతర రంగాలైన మత్స్య, కోళ్ళ, డైరీ వంటి రంగాల్లో మరింత పెద్ద ఎత్తున రుణాలందిం చాలని సూచించారు.ఎపిలో ప్రకృతి సేద్యం ప్రగతి బాగుందని దీనిలో మరింత తోడ్పాటు అందించడం జరుగుతుందని ఆయన చెప్పారు.

రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో సాగుచేసే రైతుల్లో 90 శాతం వరకు కౌలురైతులు ఉన్నారని వారికి సక్రమంగా రుణాలు అందడం లేదని కావున సిసిఆర్సి కార్డులు కలిగిన కౌలు రైతులకు తప్పకుండా రుణాలు అందించి ఆదుకోవాలని బ్యాంకరులకు విజ్ఞప్తి చేశారు.

ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్ మాట్లాడుతూ 2029 నాటికి పేదరికం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ ప్రణాళికలను అమలు చేస్తున్నట్టు చెప్పారు.

అందుకే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పలు సంక్షేమ పథకాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు.

అంతకు ముందు రాష్ట్ర స్థాయి బ్యాంకరుల కమిటీ కన్వీనర్ మరియు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ సివిఎన్ భాస్కరరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అజెండా వివరాలను తెలియజేస్తూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వార్షిక రుణ ప్రణాళిక కింద జూన్ 30 నాటికి మొదటి త్రైమాసికంలో సాధించిన ప్రగతిని వివరించారు.

అలాగే బ్యాంకింగ్ కీ ఇండికేటర్ల కింద వివిధ అడ్వాన్సులు,వడ్డీలేని రుణాలు,ఎంఎస్ఎంఇ రంగాలు సహా వివిధ ప్రాయోజిత పథకాలల్లో సాధించిన ప్రగతి తదితర అంశాలపై రంగాల వారీగా సాధించిన ప్రగతిని వివరించారు.

రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఎపి రీజియన్ రీజనల్ డైరెక్టర్ ఎఓ బషీర్ మాట్లాడుతూ కన్జంప్షన్ రుణాలు విషయంలో బ్యాంకులు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.డిజిటల్ ట్రాన్సుఫార్మేషన్ కు సంబంధించి క్యూఆర్ కోడ్ ను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.డిజిటల్ కరెన్సీకి సంబంధించి కాకినాడ,మచిలీపట్నం(కృష్ణా) రెండు జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టును ఆర్బిఐ ప్రారంభించిందని చెప్పారు.

ఆర్బిఐ క్విజ్ పోటీలను నిర్వహించగా ఎపి నుండే ఎక్కువ మంది యువత పాల్గొన్నారన్నారు.నాబార్డు డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ జిఎస్.రావత్ మాట్లాడుతూ ఫైనాన్షియల్ ఇన్క్లూజన్‌కు సంబంధించి రాష్ట్ర,జిల్లా స్థాయిల్లో లక్ష్యాలను ఇవ్వగా వాటి సాధనకు కృషి చేయాలన్నారు.

మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టులకు రాష్ట్రానికి అన్ని విధాలా సహకారం అందించేందుకు నాబార్డు పూర్తిగా తోడ్పడుతుందని చెప్పారు.

ఎపిలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(పిఎసిఎస్)కంప్యూటరీ కరణ ప్రక్రియ బాగుందని పేర్కొన్నారు.సిడ్బి సిఎండి మనోజ్ మిట్టల్ మాట్లాడుతూ సిడ్బికి సంబంధించి ఎపిలో 4 బ్రాంచిలు పనిచేస్తున్నాయని పుడ్ ప్రాసెసింగ్ క్లష్టర్లకు,స్టార్ట్అప్ లకు తగిన తోడ్పాటును అందిస్తున్నట్టు తెలిపారు.

ఈసమావేశానికి తొలుత యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఎజియం మరియు ఎస్ఎల్బిసి కోఆర్డినేటర్ రాజ బాబు స్వాగతం పలికి అజెండా అంశాలను వివరించారు.

ఈ సమావేశంలో చేనేత జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి సునీత,పరిశ్రమలు,వాణిజ్య శాఖ కార్యదర్శి యువరాజ్, ఆర్థికశాఖ కార్యదర్శి జానకి,అదనపు కార్యదర్శి జె.నివాస్ తదితర అధికారులు,వివిధ బ్యాంకుల డిజిఎంలు, ఎజియంలు, ఎల్డిఎంలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఫైనాన్షియల్ లిటరసీపై రిజర్వు బ్యాంకు ప్రచురించిన పుస్తకాన్ని మంత్రి అచ్చన్నాయుడు ఆవిష్కరించారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 18, అక్టోబర్ 2024 ||


## ప్రభుత్వ ఉద్యోగులకు హామీలు ఇచ్చారు.. మాట తప్పారు.

- పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు వెంటనే విడుదల చేయాలి
- ఈనెల 23న నిర్వహించే క్యాబినెట్‌లో చర్చించి, వెంటనే ప్రకటించాలని డిమాండ్
- మాజీ మంత్రి హరీష్ రావు



**హైదరాబాద్,మహానాడు:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు దీపావళి కానుకగా 3 శాతం కరువు భత్యం ప్రకటించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి వారు ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన హామీలను ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను.

కాంగ్రెస్ అభయ హస్తం మేనిఫెస్టోలో ప్రభుత్వ ఉద్యోగులందరికి ఆనాటికి పెండింగ్ లో ఉన్న3డీఏలను అధికారంలోకి రాగానే తక్షణమే చెల్లిస్తామని, ప్రభుత్వ ఉద్యోగులు మరియు పింఛనర్లకు ఇచ్చే డీఏలను సకాలంలో ప్రకటించి, బకాయిలను నేరుగా ఉద్యోగస్థులకు నేరుగా చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

పార్లమెంట్ ఎన్నికల వేళ ఎంసీహెచ్‌ఆర్డీలో ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో సమావేశమై మరుసటి రోజే క్యాబినెట్ లో చర్చించి డీఏలు వెనువెంటనే విడుదల చేస్తామని మరోసారి హామి ఇచ్చి మాట తప్పారు.

మీరు అధికారంలోకి వచ్చి 10నెలలు అయింది. ఈ నాటికి 5డీఏలు ఉపాధ్యాయ, ఉద్యోగ, పింఛనర్లకు ప్రభుత్వం బకాయి పడింది. డీఏలు విడుదల చేయకపోవడం వల్ల ఒక్కో ఉద్యోగి నెలకు సుమారు రూ.5000 నుంచి రూ.20,000 వరకు నష్టపోవాల్సి వస్తుంది.

బకాయి పడ్డ 5డీఏల మొత్తం 17.29 శాతం గురించి ఈనెల 23న జరిగే క్యాబినెట్ సమావేశంలో చర్చించి, దీపావళి కానుకగా బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన వెంటనే కొత్త పీఆర్సీని ప్రకటించి 6 నెలల్లోపు సిఫార్సులను అమలు చేస్తానని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చి పది నెలలు అయినా ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లుగా ఉంది ప్రభుత్వ తీరు. ఉపాధ్యాయ, ఉద్యోగ, పింఛనర్లకు ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా సప్లిమెంటరీ బిల్లులను 15 పనిదినాల్లో చెల్లిస్తామని చెప్పిన మీరు ఇప్పటికీ జీపీఎఫ్, సరెండర్ లీవ్ తదితర సప్లిమెంటరీ బిల్స్ నెలల తరబడి పెండింగ్ లో పెడుతున్నారు. కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం, వెంటనే ఆ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

ప్రస్తుతం ఉన్న సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని తెస్తామని మేనిఫెస్టోలో ప్రకటించారు. దీనిపై కూడా ఈనెల 23న నిర్వహించే క్యాబినెట్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నాను.

ఈ ఏడాది మార్చి 31 తర్వాత రిటైర్డ్ అయిన సుమారు 5వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు రిటైర్డ్ మెంట్ బెన్ఫిట్స్ నెలల తరబడి పెండింగ్ లో ఉన్నాయి. వారికి రావాల్సిన జీపీఎఫ్, ఇల్ ఎన్ క్యాష్మెంట్, గ్రాట్యుయిటీ, ఇన్సురెన్స్, కమ్యూటెడ్ బకాయిల కోసం సచివాలయం చుట్టూ రిటైర్డ్ ఉద్యోగులు తిరగలేకపోతున్నారు. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వెంటనే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం.ఏఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్ల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన నూతన ఈహెచ్ఎస్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

## ఒక్క సిక్సూ లేని కేబినెట్ మీటింగ్ ఎందుకు?

- ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి విమర్శ

**విజయవాడ, మహానాడు:** క్యాబినెట్ మీటింగ్ లో సూపర్ సిక్స్ లో ఒక్క సిక్స్ అయినా అమలు చేస్తారనుకున్నాం.. మహిళలకు శుభవార్త చెప్తారని భావించాం... ఉచిత సిలిండర్లు, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం రెండూ బడ్జెట్ స్కీంలు.. బాబు సూపర్ సిక్స్ లు గాలికి కొట్టుకుపోయాయని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆమె మీడియాతో ఏమన్నారంటే.. కొత్తగా సిక్స్ పాలసీలు వచ్చాయి. కొత్త పరిశ్రమలు వస్తే మంచిదే.. పెట్టుబడులు రావాలి. ఉద్యోగాలు రావాలి. 30 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకు వస్తామన్నారు. – 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తాం అన్నారు. జాబ్ ఫస్ట్ అనే నినాదం అని బాబు చెప్పారు. ఇక్కడ బిలియన్ డాలర్ల ప్రశ్న. ఇవన్నీ అమలు చేసే చిత్తశుద్ధి బాబు కి ఉందా?. 2014 లో పెద్ద పెద్ద పథకాలు అన్నారు. అమరావతిని సింగపూర్ అన్నారు. త్రీడి గ్రాఫిక్స్ చూపించారు. అప్పుడు చెప్పిన వాటికి, ఇప్పుడు చెప్పిన వాటికి తేడా లేదు. పాత సినిమా కి కొత్త టైటిల్ పెట్టారు. బాబు చెప్తుంటే ఈ కథ ఎక్కడో విన్నట్లుంది అనిపించింది. పాత గిఫ్ట్ కొత్త బాక్స్ లో ఇస్తున్నారు. ఇవి అమలు అవుతాయా లేదా అనే అనుమానాలు ఉన్నాయి. బాబుని ఒక విషయంలో స్వాగతిస్తున్నాం. జాబ్ ఫస్ట్ అనే నినాదం మంచిదే. రాష్ట్రంలో నిరుద్యోగం తారాస్థాయిలో ఉంది. ఉద్యోగాలు లేక వలసలు పోతున్నారు. గత 10 ఏళ్లుగా పరిశ్రమలు లేక యువత వలసలు వెళ్ళింది.

రాష్ట్రానికి నిరుద్యోగం అతి పెద్ద సమస్య. నిన్న చంద్రబాబు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం అన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులు 50 లక్షల మంది ఉన్నారు. ఈ లెక్కన బాబు చెప్పినట్టు ఏడాదికి 4 లక్షల ఉద్యోగాలు ఇస్తే... 5 ఏళ్లలో 20 లక్షలు ఇస్తారు. ఏడాదికి 4 లక్షల ఉద్యోగాల కల్పన జరిగితే మిగతా వాళ్ల సంగతి ఏంటి?

ఉద్యోగాలు అని గతంలో మోడీ బీజేపీ ప్రభుత్వం కూడా మోసం చేసింది. 20 కోట్ల ఉద్యోగాలలో మనకు ఎన్ని వచ్చాయి? ఒక్క ఉద్యోగం ఇవ్వని మోడీ కి ఎందుకు బాబు మద్దతు ఇస్తున్నారు? రాష్ట్రంలో మీరు ఇచ్చే 20 లక్షలకు తోడు మరో 30 లక్షల ఉద్యోగాలు మోడీ ఇవ్వాలి.

బాబు కేంద్రాన్ని డిమాండ్ చేయాలి. మోడీ, బాబు ఇద్దరు కలిసి కూర్చొని ఉద్యోగాల కల్పనపై వైట్ పేపర్ రిలీజ్ చేయాలి. రాష్ట్రంలో ప్రభుత్వ శాఖల పరిధిలో దాదాపు 3 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ఎప్పుడు చేస్తారో శ్వేత పత్రం ఇవ్వాలి.

గత 10 ఏళ్లుగా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ కావడం లేదు. మొత్తం ఎన్ని ఖాళీలు ఉన్నాయి తేల్చాలి.

జాబ్ క్యాలెండర్ ప్రకారం అన్ని పోస్టులు భర్తీ చేయాలి. లోకేష్ మోడీకి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారట. 21 మంది ఎంపీలు ఇస్తామని చెప్పి ఇచ్చారట. అయ్య లోకేష్ గారు... మీరు ఇచ్చిన మాట సరే...మోడీ ఇచ్చిన మాట ఏంటి? రాష్ట్రంలో ఉన్న 25 ఎంపీలు అందరు మోడీకి ఊడిగం చేస్తూనే ఉన్నారు. ఆంధ్ర ప్రదేశ్ కి ప్రత్యేక హెూదా ఇస్తామని తిరుపతిలో నిలబడి మోడీ చెప్పారు. ఇచ్చిన మాట ఎక్కడ పోయింది? హెూదా వచ్చి ఉంటే... పరిశ్రమల కోసం ఎక్కడికి పోవాల్సిన అవసరం లేదు. పోటీ పడి మరీ పరిశ్రమలు వస్తాయి. ప్రత్యేక హెూదా ఉన్న ఉత్తరాఖండ్ లో 2 వేల పరిశ్రమలు వచ్చాయి. హిమాచల్ ప్రదేశ్ లో దాదాపు 10 వేల పరిశ్రమలు వచ్చాయి. మరి హెూదా మీద మోడీ



ఇచ్చిన మాట ఎక్కడ పోయింది. పోలవరం నాది బాధ్యత అని మోడీ అన్నారు. రాజధానిని న్యూ ఢిల్లీ మించిన రాజధాని అన్నారు. మట్టికొట్టి పోయాడు తప్పితే ఒక్క రూపాయి లేదు. వెనుక బడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీలు అన్నారు..ఇవ్వలేదు. విశాఖ స్టీల్ కి ఒక్క క్యాపిటల్ మైన్ ఇస్తే మోడీకి జరిగే నష్టం ఏముంది? మోడీని నిలబెట్టి లోకేష్ అడగాలి. సూపర్ సిక్స్ పాలసీలు సరే...సూపర్ సిక్స్ పతకాలు ఎక్కడ పోయాయి. 20 లక్షల ఉద్యోగాలు అని అన్నారు...అంటే నిరుద్యోగ భృతి ఉన్నట్లా ? లేనట్లా ? నిరుద్యోగ భృతి మీద 2014 లోనే మీరు 2 వేలు ఇస్తామన్నారు.

### ఇప్పుడు 3 వేలు అంటున్నారు. ఇంత వరకు భృతిపై జాడ లేదు.

తల్లికి వందనం నిధుల కోసం పిల్లలు ఎదురు చూస్తున్నారు. మహా లక్ష్మి పథకం కింద 15 వందలు అన్నారు... ఏమయ్యింది? ఉచిత సిలిండర్లకు దసరా అన్నారు... దీపావళి అన్నారు... రేపు సంక్రాంతి అంటారేమో... ఇది చాలా తక్కువ బడ్జెట్ పథకం.. ఏడాదికి 2 వేల నుంచి 4 వేల కోట్లకు ఖర్చు అయ్యే పథకానికి నిధులు లేవా? ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఏమయ్యింది? జగన్ కి తెలియదు ఏమో... హర్యానా ఎన్నికలతో ఏపీని ఎలా పోలుస్తారు? ఇక్కడ ప్రజల నాడికి అనుకూలంగా ఫలితాలు వచ్చాయి. హర్యానాలో ప్రజల నాడికి వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. ఏపీలో ఫలితాలు అనుకున్నట్టే వచ్చాయి. జగన్ ప్రభుత్వాన్ని ప్రజలు చీదరించుకున్నారు. లిక్కర్ విషయంలో జగన్ కి, బాబు కి పెద్ద తేడా లేదు. జగన్ హయంలో లిక్కర్ మాఫీయా తాడేపల్లి ప్యాలెస్ కి లింక్ ఉంది. బాబు హయాంలో నియోజక వర్గంలోని తమ్ముళ్ళ చేతుల్లో మాఫీయా ఉంది. ఇద్దరు దొందు దొందే. లిక్కర్ విషయంలో మొత్తం మాఫీయానే.

## సరుకులు అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్య!

- మంత్రి నాదెండ్ల బజార్ల ఆకస్మిక తనిఖీ

**విజయవాడ, మహానాడు:** సరుకులు నాణ్యత, ధరలపై విజయవాడలో పడమట రైతుబజార్, గురునానక్ కాలనీలోని ఉషోదయ సూపర్ మార్కెట్ ను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ధరల స్థిరీకరణ విషయంలో భాగంగా కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు అన్ని రైతు బజార్లు, సంస్థాగత రిటైల్ దుకాణాలలో ప్రభుత్వం నిర్ణయించిన ధరకే నాణ్యమైన సరకులను వినియోగదారులకు అందించాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు.

బహిరంగ మార్కెట్‌లలో నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించడంలో భాగంగా అన్ని రైతు బజార్లలో వంట నూనెలు, కందిపప్పు, ఉల్లి, టమాటాలను అందుబాటులో ఉంచామన్నారు. ప్రజలకు బియ్యం, కందిపప్పు, వంటనూనె చౌక ధరలకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు.

రైతు బజార్లో సరుకులలో వ్యత్యాసంపై ఎస్టేట్



ఆఫీసర్‌ను నిలదీశారు. రైతు బజారులో బియ్యం, కందిపప్పు పంపిణీకి ఏర్పాటు చేసిన కౌంటర్ల నిర్వహణకు సమయపాలన పాటించకపోవడాన్ని గుర్తించి షాపుల నిర్వాహకులపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. వంటనూనెలు, ఉల్లి, టమాటా విక్రయాలపై వినియోగదారులను అడిగి సమాచారం తెలుసుకున్నారు.

గురు నానక్ కాలనీ ఉషోదయ సూపర్ మార్కెట్ సరుకుల ధరలు పరిశీలించినప్పుడు.. ప్రభుత్వం కందిపప్పు కిలో 67 వేల రూపాయలకు నిర్ణయించిన విధంగా అమ్మకాలు లేకపోవడానికి మంత్రి సూపర్ మార్కెట్



నిర్వాహకులను నిలదీశారు.

అధిక ధరకు అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వినియోగదారులకు తక్కువ ధరకే నిత్యావసర సరుకులు, వంటనూనె రైతు బజార్లు, హెూల్ సేల్, రిటైల్ దుకాణాలలో అందుబాటులో ఉంచినట్లు మంత్రి నాదెండ్ల తెలిపారు. పామాయిల్ లీటర్ 110 రూపాయలకు, సన్ ఫ్లవర్ ఆయిల్‌ను లీటర్124 రూపాయలకు, కిలో 67 రూపాయలకే కందిపప్పు, వినియోగదారులకు అందుబాటులో ఉంచామన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ సదుపాయాన్ని ప్రతి వినియోగ దారుడు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## అక్రమ కేసులకు భయపడబోము

- ఆ ఘటన జరిగిన రోజు నేను బద్వేలులో ఉన్నాను
- మంగళగిరి పీఎస్‌లో విచారణకు హాజరైన వైయస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి
- విచారణ అనంతరం మంగళగిరి పీఎస్ వద్ద మీడియాతో మాట్లాడిన సజ్జల రామకృష్ణారెడ్డి


**మంగళగిరి,మహానాడు:** టీడీపీ ఆఫీస్ మీద దాడి కేసులో అక్రమంగా కేసులు బనాయించి, విచారణ పేరుతో దాదాపు నెలన్నరగా వైయస్సార్‌సీపీ నాయకులను వేధిస్తున్నారని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి వెల్లడించారు. ప్రజా పాలనను గాలికొదిలేసి కేవలం వైయస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడి చేస్తున్నారని.. నీచమైన అబద్ధపు కథనాలు సృష్టించి ప్రజల దృష్టి మరల్చడంతో పాటు, పార్టీ నాయకులు, కార్యకర్తలను భయభ్రాంతులను గురి చేసేందుకు తప్పుడు వాంగ్మూలాలు సృష్టిస్తున్నారని ఆయన ఆక్షేపించారు.

ఆ తర్వాత విచారణ పేరుతో పదే పదే పోలీస్ స్టేషన్లకు పిలిపించడం పరిపాటిగా మారిందని చెప్పారు. వైయస్సార్‌సీపీ నేతలు తలశిల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డి, దేవినేని అవినాష్‌ను విచారణ పేరుతో ఇప్పటికే మూడుసార్లు పిల్చారని.. ఇంకా మాజీ ఎంపీ, నందిగం సురేశ్‌ను జైలుకు పంపారని, ఆయనకు బెయిల్ దొరికితే, మరో కేసులో ఇరికించి జైల్లోనే ఉంచారని సజ్జల రామకృష్ణారెడ్డి గుర్తు చేశారు.

ఏదైనా కేసులో విచారణ చేయాల్సి వస్తే నిబంధనల ప్రకారం పోవాలి తప్ప, వాళ్లు చెప్పారని.. వీళు చెప్పారని వందల సంఖ్యలో నిందితుల లిస్టును పెంచుకుంటూ పోవడం, ప్రజల దృష్టి మరల్చడం, విచారణ పేరుతో వైయస్సార్‌సీపీ నాయకులను వేధించడం ప్రభుత్వానికి అలవాటుగా మారిందని చెప్పారు.

టీడీపీ ఆఫీసు మీద దాడి జరిగిన రోజున తాను బద్వేలు ఉపఎన్నిక ప్రచారంలో ఉన్నానని, ఈ విషయం టీడీపీ వారికి కూడా తెలుసని, అయినా తనను ఆ కేసులో 120వ నిందితుడిగా చేర్చారని సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. ఇంకా లుక్ అవుట్ సర్క్యులర్ (ఎల్ఓసీ) జారీ చేసి, విదేశం నుంచి తిరిగి వస్తుండగా, ఎయిర్‌పోర్టులో ఆపి ఇబ్బంది పెట్టాలని చూశారని వెల్లడించారు. తాను స్వేచ్ఛగా తిరగకుండా వేధించాలన్నదే ప్రభుత్వ అభిమతంగా ఉందని అన్నారు. ఈరోజు వారు మొదలుపెట్టిన ఈ విష సంస్కృతికి, భవిష్యత్తులో తప్పనిసరిగా తాము కూడా బదులు తీర్చుకోవాల్సి వస్తే పరిస్థితి ఏమిటని సజ్జల రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. తమ ప్రభుత్వ హయాంలో ఏ కేసులో అయినా పక్కా దర్యాప్తు తర్వాత ఆధారాలుంటేనే చట్టపరంగా ముందుకు వెళ్లాం తప్ప, ఈ విధంగా తప్పుడు కేసులు బనాయించి, ఇలా వేధించలేదని స్పష్టం చేశారు.

ప్రతిపక్షం లేకుండా చేయాలనే భ్రమల్లో బ్రతికితే అంతకన్నా అవివేకం ఉండదన్న ఆయన, ఇప్పటికైనా



సీఎం చంద్రబాబు వైఖరి మార్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో తాము పోలీసులను నిందించడం లేదని, కేవలం రాజకీయ దురుద్దేశాలు మాత్రమే ప్రశ్నిస్తున్నామని చెప్పారు. జగన్‌పై నానాటికీ పెరుగుతోన్న ప్రజాదరణ నుంచి అందరి దృష్టి మళ్లించడం కోసమే, ఈ విధంగా అక్రమ కేసులతో వేధిస్తున్నారని తేల్చి చెప్పారు.

ఇప్పుడు దాన్ని మరింత తీవ్రం చేసేందుకు కేసును సీఐడీకి అప్పగిస్తున్నారన్న ఆయన, దీని వల్ల మరిన్ని అక్రమ అరెస్టులు జరగొచ్చని చెప్పారు. వీటన్నింటి వల్ల తమలో కసి, పట్టుదల మరింత పెరుగుతుంది తప్ప, అక్రమ కేసులకు ఏ మాత్రం భయపడబోమని సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు.

### విచారణకు సజ్జల రామృష్ణారెడ్డి సహకరించలేదు: సీఐ శ్రీనివాసరావు

టీడీపీ ఆఫీసుపై దాడి కేసులో సజ్జలను విచారించామని సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ముందుగా సిద్ధం చేసుకున్న 38 ప్రశ్నలు అడిగాం.. చాలా ప్రశ్నలకు గుర్తు లేదనే సమాధానం ఇచ్చారు. గత ప్రభుత్వంలో సజ్జల సలహాదారుగా ఉన్నారు. మా వద్ద ఉన్న ఆధారాలతో సజ్జలను ప్రశ్నించాం. సజ్జలను ఫోన్ అడిగినా ఇవ్వలేదు. విచారణకు సజ్జల రామృష్ణారెడ్డి సహకరించలేదు. మా ప్రశ్నలకు వ్యతిరేక ధోరణిలో సమాధానాలు ఇచ్చారు. ఘటన జరిగిన రోజు తాను అక్కడ లేనని చెప్పారు. ఈ కేసులో సజ్జల పాత్ర ఉన్నట్టు మా వద్ద ఆధారాలు న్నాయి. మూడు నెలలుగా ఈ కేసును విచారించాం. కేసు దర్యాప్తు దాదాపు చివరకు వచ్చిందని సీఐ తెలిపారు. ఇంకా ఆయన ఏమన్నారంటే... చాలా మంది నిందితులు కోర్టుల ద్వారా రక్షణ పొందారు. దీనివల్ల కేసు విచారణ వేగంగా జరగట్లేదు. నిందితులను అరెస్ట్ చేస్తే విచారణ త్వరగా పూర్తవుతుంది. కేసును ప్రభుత్వం సీఐడీకి ఇచ్చింది. ఉత్తర్వులు రాగానే విచారణ దస్త్రాలను సీఐడీకి ఇస్తాం.

## విద్యార్థుల జీవితాలలో విజయ దీపం వెలుగులు

- విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే సుజనా చౌదరి

**విజయవాడ,మహానాడు:** నేటితరం విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకువచ్చి వారి జీవితాలలో వెలుగులు నింపడానికి సుజనా ఫౌండేషన్, క్రిస్ప్ సంస్థలు కృషి చేస్తున్నాయని ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు.

సుజన ఫౌండేషన్ మరియు క్రిస్ప్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో విశ్రాంత ఐఏఎస్‌లు అంగన్వాడీలు,ఉపాధ్యాయులు, అధ్యాపకులతో గురువారం ది వెన్యూ కన్వెన్షన్ సెంటర్లో విజయ దీపం కార్యక్ర



మాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయ దీపం కార్యక్రమం కింద చేపట్టే కార్యక్రమాల బ్రోచర్ను అతిథులు ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమం నుద్దేశించి శాసనసభ్యులు యలమంచిలి సుజనా చౌదరి మాట్లాడుతూ.. పది మంది విశ్రాంత ఐఏఎస్ అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి అంగన్వాడీలు, పాఠశాలల్లోని బాల బాలికలు, టీచర్లు, అందరి అవసరాలకు అనుగుణంగా సరికొత్త విద్యా విధానానికి రూప కల్పన చేశారన్నారు. విద్యార్థుల శక్తి, సామర్థ్యాలను వెలికి తీసి వారికి ఇష్టమైన రంగాల్లో, రాణించేలా ప్రోత్సహించడం తద్వారా వారి జీవన జీవన నైపుణ్యాలను మెరుగుపరిచి వారికి ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా సుజాన ఫౌండేషన్, క్రిస్ప్ సంస్థలు కృషి చేస్తాయన్నారు. విజయవాడ వెస్ట్‌ను బెస్ట్‌గా తీర్చి దిద్దడం తన లక్ష్యమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మొదటి సారిగా పశ్చిమ నియోజకవర్గంలో ప్రయోగాత్మకంగా చేపడు తున్న విజయ దీపం కార్యక్రమం విజయవంతం అవు తుందని ఆకాంక్షించారు. ఈ విజయదీపం కార్య క్రమం ద్వారా ప్రైమరీ పాఠశాల, హై స్కూల్ విద్యా ర్థులసృజనాత్మకతను పెంపొందించి వారిలోని ప్రతిభా పాటవాలను గుర్తించి వారికి ఇష్టమైన రంగంలో శిక్షణ ఇవ్వడమే కాకుండా ఉపాధి అవకాశాల కల్పనె ధ్యేయంగా కృషి చేస్తామన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారికి ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకునేలా ప్రోత్సహించడం, వ్యాపార అభివృద్ధికి ఆర్థిక తోడ్పాటు అందించడం జరుగుతుందన్నారు. ప్రధాని మోడీ పదేళ్ల పాలనలో 35 కోట్ల మంది పేదలు దారిద్ర్య రేఖ నుంచి బయటికి వచ్చారన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచినా కూడా ప్రజలు అనేక




చోట్ల దుర్భర జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

స్వచ్ఛంద సేవల కృషితో పాటు, ప్రజల సహకారం ద్వారా మెరుగైన ఫలితాలను సాధించొచ్చు అన్నారు. సమిష్టిగా విజయ దీపం కార్యక్రమాన్ని విజయవంతం చేసి రాష్ట్రంలో, దేశంలో పశ్చిమ నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దు తామని సుజనా చౌదరి హామీ ఇచ్చారు.

అనంతరం ఎంపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి మాట్లాడుతూ సుజనా ఫౌండేషన్ , క్రిస్ప్ సంస్థలు స్వచ్ఛందంగా చేస్తున్న సేవలు అభినందనీయం అని కొనియాడారు. ప్రధాని మోడీ దేశ ప్రజల్లో మార్పు తీసుకురావాలని ఎంతో కృషి చేస్తున్నట్లు తెలియజేశారు. సమాజాభివృద్ధికి స్వచ్ఛంద సేవా సంస్థలు చేస్తున్న కృషి మరువలేనిది అన్నారు. పౌష్టిక ఆహార లోపం వలన శిశువుల మరణాలు జరుగుతున్నాయని అంగన్వాడీల ద్వారా గర్భిణీలకు పౌష్టిక ఆహారాన్ని ప్రభుత్వాలు అందిస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీ టీచర్స్ పిల్లల్లో మానసిక ఎదుగుదలకు కృషి చేయాలని సూచించారు.

అనంతరం మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ సీనియర్ నేత సోము వీర్రాజు మాట్లాడుతూ సుజనా ఫౌండేషన్ ద్వారా శాసనసభ్యులు యలమంచిలి సుజనా చౌదరి చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, అంగనవాడి సెంటర్ల అభివృద్ధికి కార్యాచరణ రూపొందించడం అభినందనీయమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సుజనా ఫౌండేషన్ సీఈవో పివి రావ్ , సుజనా ఫౌండేషన్ సలహాదారు వి శ్రీనివాసరావు, విశ్రాంత ఐఏఎస్ అధికారులు క్రిస్ప్ ఫౌండర్ కన్నెగంటి సంధ్యారాణి, వేణుగోపాల్ రెడ్డి, కైకలూరు శాసనసభ్యులు కామినేని శ్రీనివాస్, టిడిపి నేత నాగుల్ మీరా, జనసేన నేత అమ్మిశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు.



## సంస్కృత సాహిత్యంలో వాల్మీకి ఆదికవి

- పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

**అనంతపురం, మహానాడు:** సంస్కృత సాహిత్యంలో వాల్మీకి ఆదికవి అని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. అనంతపురంలోని పాతవూరు పవర్ ఆఫీస్ వద్ద ఉన్న వాల్మీకి మహర్షి విగ్రహానికి గురువారం ఆమె పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామాయణ మహాకావ్యాన్ని లిఖించిన జ్ఞాననిధి వాల్మీకి మహర్షిని అభివర్ణించారు. వాల్మీకి జయంతి సందర్భంగా వాల్మీకులకు, జిల్లా ప్రజలకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.



**ఈ నెల 22, 23వ తేదీల్లో జరిగే అమరావతి డ్రోన్ సమ్మిట్ 2024కు రావాల్సిందిగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడుకి ఆహ్వానపత్రం అందజేస్తున్న రాష్ట్ర పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్, ఏపీ డ్రోన్స్ కార్పొరేషన్ ఎండీ కె. దినేష్ కుమార్‌లు.**



**న్యూఢిల్లీలో జరుగుతున్న ఇండియా మొబైల్ కాంగ్రెస్ సదస్సులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున పాల్గొన్న గుంటూరు పార్లమెంటు సభ్యులు చంద్రశేఖర్ పెమ్మసాని, ఏపీ ఫైబర్ నెట్ ఎండీ కె.దినేష్ కుమార్ తదితరులు**

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి గెలుపు తథ్యం

- డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

**గుంటూరు, మహానాడు:** గుంటూరు కృష్ణాజిల్లాల పట్టబద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ని ఎంపిక చేయడం ఎంతో గర్వకారణమని తెలుగుదేశం పార్టీ(టీడీపీ) దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. ఆలపాటి రాజాకు మద్దతుగా గురువారం సాయంత్రం నరసరావుపేటలో డాక్టర్ల తో జరిగిన సమావేశంలో లక్ష్మి ఆలపాటి రాజాని కలిసి మద్దతు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో అనుభవజ్ఞులైన ఆలపాటి రాజా ఎమ్మెల్సీగా ఎన్నిక అవ్వవలసిన అవసరం ఎంతైనా ఉందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, అనుభవజ్ఞులైన రాజాని ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక



చేయడం అభినందనీయమన్నారు.

పట్టభద్రులైన విద్యావంతులు, డాక్టర్లు అందరూ సమిష్టిగా గెలిపించుకుందాం... కూటమి ప్రభుత్వానికి అండగా నిలుద్దామన్నారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ శుక్రవారం 18, అక్టోబర్ 2024





## పుష్ప-2 ది రూల్
# కౌంట్‌డౌన్ స్టార్ట్

ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అందరి దృష్టి పుష్ప-2 దిరూల్ మీదే. ఈ సినిమాకున్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ముఖ్యంగా భారతీయ సినీ పరిశ్రమ యావత్ ఎదురుచూస్తున్న సినిమా ఇది. అది మన తెలుగు సినిమా కావడం గర్వకారణం. ఇక 'పుష్ప-2' ది రూల్.. డిసెంబరు 6న ప్రారంభం కానున్న పుష్పరాజ్ రూల్‌కు కౌంట్‌స్టార్ అయ్యింది. మరో50 రోజుల్లో అంటే డిసెంబరు 6న పుష్ప-2 రూల్ బాక్సాఫీస్‌పై ప్రారంభం కానుంది.

ఈ సందర్భంగా మేకర్స్ ఐకాన్‌స్టార్ మాసివ్ లుక్‌తో పుష్పరాజ్‌గా రూల్ చేయడానికి సింహాసనం అధిష్టించిన ఓ పోస్టర్‌ను వదిలారు. అంతేకాదు డిసెంబరు 6న భారతీయ సినిమాలో ఆ రోజు ఓ సరికొత్త అధ్యాయం ప్రారంభం కానుందని హింట్ ఇచ్చారు మేకర్స్ ప్రతి సీన్‌కు గూజ్‌బంప్స్‌తో పాటు పుష్ప ది రూల్‌కు అందరూ ఫిదా అయిపోవాల్సిందే అంటున్నారు. మీరు ఎంత ఊహించుకుంటే అంతకు మించి.. అస్సలు తగ్గేదెలే లా చిత్రం వుండబోతుందనే విశ్వాసంతో వున్నారు చిత్ర మేకర్స్. అల్లు అర్జున్ 'పుష్ప-2'లో మైస్మరైజింగ్ నటన కోసం దర్శకుడు సుకుమార్ టేకింగ్..మేకింగ్.. కోసం అందరూ ఎంతగానో ఎదురుచూస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ అసోసియేషన్ విత్ సుకుమార్ రైటింగ్స్ సంస్థల పతాకంపై ప్రముఖ నిర్మాతలు, నవీన్ ఏర్నేని, వై రవిశంకర్‌లు ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.

ఇటీవల ఈ చిత్రం నుంచి వచ్చిన రెండు సాంగ్స్, టీజర్‌కు ఎంతటి అనూహ్యమైన స్పందన వచ్చిందో తెలిసిందే. దేవి శ్రీప్రసాద్ అందించిన ట్రెండీ పాటలకు మంచి స్పందన వచ్చింది. ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో వున్న ఈ చిత్రం, మరోవైపు నిర్మాణానంతర పనులను కూడా శరవేగంగా జరుపుకుంటోంది. ఇటీవలే ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్‌హాఫ్ పర్‌ఫెక్ట్ లాక్ అయిన సంగతి తెలిసిందే. కంటెంట్ పరంగానే కాకుండా మేకర్స్ టెక్నికల్‌గా కూడా చాలా శ్రద్ధ తీసుకున్నామని తెలిపారు. ఇక డిసెంబరు 6న అందరూ పుష్ప ది రూల్ డే అని ఎదురు చూస్తున్నారు.




## "లవ్ రెడ్డి" ప్రేక్షకులు హార్ట్‌ఫుల్‌గా
# సపోర్ట్ చేస్తారు - కిరణ్ అబ్బవరం

గీతాన్స్ ప్రొడక్షన్స్, సెహెరి స్టూడియో, ఎమ్జీఆర్ ఫిలిమ్స్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం "లవ్ రెడ్డి". అంజన్ రామచంద్ర, శ్రావణి రెడ్డి హీరో హీరోయిన్లు గా నటిస్తున్నారు. కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా స్వచ్ఛమైన ప్రేమకథగా నూతన దర్శకుడు స్మరన్ రెడ్డి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా "లవ్ రెడ్డి" సినిమా ఈ నెల 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది. ఈ రోజు హీరో కిరణ్ అబ్బవరం అతిథిగా "లవ్ రెడ్డి" సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ - నేనూ, అంజన్ షార్ట్ ఫిలింస్ నుంచి వచ్చాం. ఆ ఎమోషనల్ బాండింగ్ మా మధ్య ఉంది. చాలా మంది ఇక్కడ కష్టాలు పడలేక, ఆర్థిక ఇబ్బందులతో తిరిగి వెళ్లిపోయారు. అంజన్ గట్టిగా నిలబడి ఉన్నందుకు అతనికి థ్యాంక్స్ చెబుతున్నా. మూడేళ్లుగా అంజన్ ఫ్యామిలీ అంతా లవ్ రెడ్డి సినిమా కోసం కష్టపడుతున్నారు. శ్రావణి తెలుగింటి అమ్మాయిలా ఉంది. ఆమె మాట్లాడిన స్పీచ్ క్రైనా సినిమాకు వెళ్లండి. నా క సినిమా ఈనెల 31న రిలీజ్ అవుతోంది. లవ్ రెడ్డి 18న వస్తోంది. నా సినిమా రెండు రోజులు ఆగి చూసినా ఫర్వాలేదు. లవ్ రెడ్డి మాత్రం వెంటనే చూసేయండి. సినిమా మీద ఎంతో ప్రేమ ఉన్న ఇలాంటి టీమ్ సక్సెస్ కావాలి. లవ్ రెడ్డి సినిమాను నైజాంలో రిలీజ్ చేస్తున్న మైత్రీ వారికి, ఆంధ్రలో రిలీజ్ చేస్తున్న వంశీకి, కర్ణాటకలో రిలీజ్ చేస్తున్న హొంబలే సంస్థకు థ్యాంక్స్ చెబుతున్నాఅన్నారు.

# 25న సముద్రుడు

కీర్తన ప్రొడక్షన్స్ పతాకంపై రమాకాంత్, అవంతిక, భానుశ్రీ హీరో హీరోయిన్లుగా నగేష్ నారదాసి దర్శకత్వంలో బధావత్ కిషన్ నిర్మిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ సముద్రుడు అన్ని కార్యక్రమాలు పూర్తిచేసుకుని విడుదలకు సిద్ధమైంది. హీరో సుమన్ ఈ సినిమాలో ఒక ముఖ్య పాత్రలో నటించారు. సుమన్ యాక్షన్ సీక్వెన్స్ మరియు సినిమాలో ఉండే కామెడీ కథానుగుణంగా ప్రేక్షకులను అలరిస్తాయి. ఈ నేపథ్యంలో ఫిల్మ్ ఛాంబర్ లో చిత్ర యూనిట్ ట్రైలర్ విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో తలకోన ప్రొడ్యూసర్ శ్రీధర్ రెడ్డి, దర్శకుల సంఘం అధ్యక్షులు వీర శంకర్, డైరెక్టర్స్ సముద్ర, ప్రముఖ నిర్మాతలు రామ సత్యన్నారాయణ, ముత్యాల రాందాస్, పీపుల్ మీడియా ఎగిక్యూటివ్ ప్రొడ్యూసర్ కాసుల శ్రీధర్, చిత్ర కో ప్రొడ్యూసర్స్ జ్ఞానేశ్వర్, సోములు, చిత్ర నిర్మాత కీర్తన తదితరులు పాల్గొన్నారు."మత్యకారుల జీవితాలను ప్రతిబింబిస్తూ రూపొందించిన చిత్రమిది. సముద్రమే వారి జీవనాధారం, అలాంటి సముద్రంలోకి వారు వెళ్లకుండా ప్రభుత్వం ఆంక్షలు విధించే పరిస్థితుల్లో వారి జీవన పోరాటం, వారి మనో వేదనే ఈ చిత్రం. ఈ చిత్రంలో పెద్ద ఆర్టిస్టులు అందరూ నటించారు. ఈ సినిమా ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.



# 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' ఫస్ట్ లుక్

30 రోజుల్లో ప్రేమించడం ఎలా సినిమాతో బ్లాక్ బస్టర్ డెబ్యు చేసిన పాపులర్ యాంకర్- టర్న్- హీరో ప్రదీప్ మాచిరాజు తన రెండవ సినిమాతో అలరించబోతున్నారు. ఈ యూనిక్ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను యంగ్ ట్యాలంటెండ్ డైరెక్టర్స్ డుయో నితిన్, భరత్ దర్శకత్వం వహిస్తున్నారు. దీపికా పిల్లి ప్రదీప్ సరసన హీరోయిన్ గా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని మాంక్స్ %ఃడ% మంకీస్ నిర్మిస్తున్నారు. మేకర్స్ మూవీ టైటిల్ 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' అని అనౌన్స్ చేశారు. కోఇన్సిడెంట్లీ ఇది పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మొదటి సినిమా టైటిల్ కావడం విశేషం. టైటిల్ అనౌన్స్ తో పాటు, ఫస్ట్ లుక్, మోషన్ వీడియోను రిలీజ్ చేశారు. గ్రీన్ బ్యాక్ డ్రాప్ లో ప్రదీప్, దీపిక కళ్లలోకి చూస్తూ కనిపించిన ఫస్ట్ లుక్ వారి డాజ్లింగ్ కెమిస్ట్రీని ప్రజెంట్ చేస్తోంది. మోషన్ వీడియోలో విలేజ్ లో గందరగోళ పరిస్థితి మధ్య ప్రదీప్ ఇంటి నుంచి దీపిక ఇంటికి ఫైర్‌ఫ్లై ప్రయాణించే బ్యూటీఫుల్ సీన్ ని ప్రజెంట్ చేస్తోంది, ఇదొక ప్లజంట్ లవ్ స్టోరీని సూచిస్తుంది. ప్లాట్‌లైన్‌కి వస్తే- ఒక సివిల్ ఇంజనీర్ వర్క్ కోసం ఒక గ్రామంలోకి వస్తారు, అక్కడ అమ్మాయితో ప్రేమలో పడతాడు. ఇద్దరి మధ్య ఎంటర్ టైనింగ్ ప్రేమకథ, లాఫ్ లౌడ్ మూమెంట్స్, ఊహించని మలుపులు, సర్ ప్రైజింగ్ ప్రేమ కథగా వుండబోతోంది. ఈ చిత్రంలో ప్రముఖ హాస్యనటులు వెన్నెల కిషోర్, సత్య, గెటప్ శ్రీను కీలక పాత్రలు పోషిస్తున్నారు.



# 'డెకాయిట్'లో శృతి అవుట్

యువ కథానాయకుడు అడివి శేష్ నటిస్తున్న మూవీల్లో ఒకటి డెకాయిట్. ఆయన హీరోగా ఇప్పటికే వచ్చిన క్షణం, గూఢచారి వంటి చిత్రాలకు సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరించిన షానీల్ డియో.. డెకాయిట్ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. తెలుగు, హిందీలో ద్విభాషా చిత్రంగా సుప్రియ యార్లగడ్డ రూపొందిస్తున్నారు. గత ఏడాది చివర్లో మూవీ టైటిల్ టీజర్ ను మేకర్స్ రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. డెకాయిట్ టైటిల్ టీజర్.. సినీ ప్రియుల నుంచి మంచి రెస్పాన్స్ అందుకుంది. జూలియెట్ ఎన్నేళ్లయింది మనం కలిసి అనే డైలాగ్? తో అడివి శేష్ ఎంట్రీ ఇచ్చారు. అల్లర్లు జరిగిన ప్రాంతంలో గన్ పట్టుకొని శ్రుతి కనిపించారు.

ఆ తర్వాత శేష్, శ్రుతి ఇద్దరూ ఒకరికొకరు తుపాకులు ఎక్కు పెట్టుకుంటారు. తుపాకీ ఫైర్ చేసినట్టు, కింద పడినట్టు బ్యాక్ గ్రౌండ్ సౌండ్ వచ్చింది. ఇద్దరు మాజీ లవర్స్ తప్పని పరిస్థితుల్లో కలిసి దోపిడీలు చేయడమే డెకాయిట్ మూవీ ప్రధాన బ్యాక్? డ్రాప్ గా క్లారిటీ వచ్చింది. మెలోడీ మొత్తంగా ఇంటెన్స్, లవ్ యాక్షన్ చిత్రంగా డెకాయిట్ తెరకెక్కిస్తున్నట్లు క్లియర్ గా అర్థమవుతుంది.

ఇప్పటికే సగానికిపైగా షూటింగ్ జరిగినట్లు తెలుస్తోంది. అయితే రీసెంట్ గా సినిమా నుంచి హీరోయిన్ శ్రుతి హాసన్ తప్పుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. డేట్స్ ఇష్యూ కారణంగా ఆమె.. ఆ నిర్ణయం తీసుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే శ్రుతి.. మేకర్స్ కు కొన్ని రోజుల డేట్స్ ఇచ్చారట. కానీ డైరెక్టర్ షానీల్ డియో.. మెడికల్ ఎమర్జెన్సీ వల్ల అమెరికా వెళ్లారట.

దీంతో డేట్స్ అడ్జెస్ట్ చేసుకోలేక శ్రుతి హాసన్.. డెకాయిట్ నుంచి తప్పుకున్నట్లు తెలుస్తోంది.

ఇప్పుడు మరో స్టార్ హీరోయిన్‌ను డెకాయిట్ మేకర్స్ సంప్రదించగా.. ఆమె ఓకే చెప్పారట. త్వరలోనే సెట్స్ లో అడుగుపెడతానని తెలిపినట్లు సమాచారం. మరికొద్ది రోజుల్లో మేకర్స్.. కొత్త హీరోయిన్ పేరు అఫీషియల్ గా అనౌన్స్ చేయనున్నారని వినికిడి. స్పెషల్ పోస్టర్ ను కూడా రిలీజ్ చేయనున్నట్లు టాక్ వినిపిస్తోంది.



# "వెట్టయన్ ది హంటర్"కి ప్రీక్వెల్ చేయాలని ఉంది : టి.జె. జ్ఞానవేల్



**దసరా సందర్భంగా విడుదలైన సూపర్ స్టార్ రజనీకాంత్ యాక్షన్ థ్రిల్లర్ 'వెట్టయన్ ది హంటర్' చిత్రం బ్లాక్ బస్టర్ అయిన సంగతి తెలిసిందే. టి.జె.జ్ఞానవేల్ దర్శకత్వం వహించిన వేట్టయ్యన్ ది హంటర్ అందరినీ ఆకట్టుకుంటోంది. అమితాబ్ బచ్చన్, ఫహద్ ఫాజిల్, రానా నటించిన ఈ చిత్రం థియేటర్లలో దుమ్ములేపేస్తోంది తెలిపారు.**

### జైలర్ వంటి బ్లాక్ బస్టర్ తరువాత రజినీకాంత్ తో ఇలాంటి ప్రాజెక్ట్ ఎలా అనుకున్నారు?

రజనీకాంత్ అభిమానులను అలరించే అంశాలతో పాటు ఆకట్టుకునే కంటెంట్‌తో సినిమాను రూపొందించడమే నా మెయిన్ టార్గెట్. ఈ చిత్రంలో అనేక అంశాలపై లోతుగా చర్చించినప్పటికీ.. ఆయన అభిమానులు ఇష్టపడే ఆ ఐకానిక్ మూమెంట్స్‌ను పెట్టాను. ఈ కథకి రజినీ స్టైల్, మ్యానరిజంను జోడించడమే నాకు ఎదురైన సవాల్.

### జర్నలిస్టుగా మీకున్న అనుభవం ఈ సినిమాకు ఎలా ఉపయోగపడింది? రజనీకాంత్‌ను ఏమైనా సలహాలు, సూచనలు అందించారా?

రజినీకాంత్‌ను ఎలా చూడాలని, ఎలా చూపిస్తే అభిమానులు సంతోషిస్తారనే అవగాహన నాకు ఉంది. నేను ఆయనకు ఓ ఎలివేషన్ సీన్స్ చెబితే ఆయన ఫుల్ ఎగ్జైట్ అయ్యేవారు. అభిమానులు తన నుంచి ఏం కోరుకుంటారో ఆయనకు బాగా తెలుసు. ఆయన నాపై పూర్తి నమ్మకాన్ని పెట్టుకున్నారు. నేను ఆ నమ్మకాన్ని నిలబెట్టుకున్నాను.

### 'వెట్టయన్'లో రజనీకాంత్, అమితాబ్ బచ్చన్‌లను ఎలా బ్యాలెన్స్ చేశారు?

సూపర్‌స్టార్‌లను బ్యాలెన్స్ చేయడానికి ప్రయత్నించడం కంటే.. నేను వారి పాత్రల భావజాలాన్ని బ్యాలెన్స్ చేయడంపై దృష్టి పెట్టాను. అమితాబ్ బచ్చన్ పాత్రను మొదట పరిచయం చేశాను. ఆ పాత్ర తాలుకా వ్యక్తిత్వాన్ని చూపెట్టాను. అయితే రజనీకాంత్ పాత్ర మరింత తటస్థ వైఖరితో ప్రారంభం అవుతుంది. వారిద్దరి మధ్య ఉండే భావజాలాల ఘర్షణ ద్వితీయార్థంలో ఆసక్తికరమైన కథనంగా మారింది.

### సినిమా కథ ఎన్‌కౌంటర్లు, న్యాయ వ్యవస్థ చుట్టూ తిరిగింది. వీటిని పరిశోధించడానికి మిమ్మల్ని ప్రేరేపించింది ఏంటి?

దేశవ్యాప్తంగా జరిగిన ఎన్‌కౌంటర్ హత్యల గురించి అనేక వార్తలు చదివాను. వాటితో ప్రభావితుడ్ని అయ్యాను. ఈ ఎన్‌కౌంటర్లలో ఎంత వాస్తవం ఉంది? అసలు ఇలా చేయడం కరెక్టేనా? దోషుల్నే శిక్షిస్తున్నామా? అనే వాటిని చూపించాను. ఎర్రచందనం స్మగ్లర్లు అంటూ చెట్లు నరికేసే అమాయకుల్ని ఎన్‌కౌంటర్ చేసిన ఘటన నన్ను కదిలించింది. నా పరిశోధనలో పేదలు తరచూ ఇటువంటి ఎన్‌కౌంటర్ల బాధితులవుతున్నారని, సంపన్నులు న్యాయం నుండి తప్పించుకుంటారని తెలిసింది. విద్యా వ్యవస్థ లోపాలను కూడా ఈ చిత్రం స్పృశిస్తుంది.

### అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. ఈ ప్రాజెక్ట్‌కి ఆయన్ని ఎవరు? ఎందుకు ఎంపిక చేశారు?

అనిరుధ్‌కు ఇప్పుడు దేశ వ్యాప్తంగా ఉన్న క్రేజ్ తెలిసింది. ఆడియెన్స్ పల్స్ పట్టుకోవడంలో అతను నిష్ణాతుడు. కమర్షియల్ ఎలిమెంట్స్‌తో కూడిన సంగీతాన్ని అందించడంలో దూసుకుపోతున్నారు. అతను సినిమా సోల్‌ను పూర్తిగా అర్థం చేసుకుంటారు. దానికి తగ్గ సంగీతాన్ని అందిస్తారు.

### ఎన్‌కౌంటర్ నేపథ్యంలో వచ్చిన మలయాళ చిత్రం 'జన గణ మన'తో పోల్చడం గురించి మీ అభిప్రాయం ఏంటి?

నేను 'జన గణ మన' చూశాను. కానీ నా ఉద్దేశ్యం ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌ల జీవితాలను వేరే కోణం నుండి చూపించడం. నేను వారి వృత్తి సంక్లిష్టతలను, పరిణామాలను అన్వేషించాలనుకున్నాను.

Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144

డిజిటల్ న్యూస్ పేపర్

శుక్రవారం 18, అక్టోబర్ 2024

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

### డిజిటల్ మీడియాలో ..

# జయహో "మహానాడు"

# 2,03,132

## ఈ-పేపర్ పాఠకులకు సగర్వంగా సవినయంగా సెల్యూట్



మార్చి 1న ప్రారంభమైన మన
మహానాడు ప్రస్థానంలో కలిసి నడుస్తున్న
మా అభిమాన పాఠకుల
అనుబంధానికి వందనం





సీనియర్ జర్నలిస్ట్
మార్తి సుబ్రమణ్యం
సంపాదక సారథ్యంలో





బోడెపూడి సుబ్బారావు (BSR)
సారథ్యంలో

